ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




"కొత్తనాగలి"


కేంద్రప్రభుత్వ వ్యవసాయ పరిశోధకశాఖవారు తయారుచేసినది. దీనిలో ఒకచట్రమునకే మూడు కఱ్ఱులు అమర్చి ఉన్నవి.

11-5-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


వార్తాచిత్రాలు




బెంగుళూరు హిందూస్థాన్ విమాన నిర్మాణ కర్మాగారంలో తయారుచేయబడిన హెచ్-2 విమానాన్ని
భారత ప్రభుత్వ పారిశ్రామిక శాఖామంత్రి డా॥ యస్. పి. ముఖర్జీగారు పరిశీలిస్తున్నారు.



ఠక్కర్ బాపా విద్యాలయం గాంధీ ప్రార్థనమంటపం శంకుస్థాపనము డా॥ రాజేంద్రప్రసాద్ గారు జరిపిరి.
చిత్రపటములో డా॥ రాజేంద్రప్రసాద్ గారు,మదరాసు ప్రధాని శ్రీ పి. ఎస్. కుమారస్వామి రాజా,
హరిజనశాఖామంత్రి శ్రీ బి. పరమేశ్వరన్ గార్లు కలరు.



ఢిల్లీలో మే 4-వ తేదీ జరిగిన భారత వ్యవసాయ పరిశోధన సమితి ద్వితీయ వార్షికోత్సవ స్నాతక సభలో భారత
ఆహారసమస్య ప్రాధాన్యతనుగురించి, 1951 సరికి దేశాన్ని స్వయంసమృద్ధి చేయవలసిన అవసరాన్నిగురించి
కేంద్ర ఆహారశాఖామంత్రి జయరాందాస్ దౌలత్ రామ్ ఉపన్యసిస్తున్నారు.



కాశ్మీర్ యుద్ధవీరుడు దాడిమూకల్ని తరిమివేసిన తరువాత ఒక బాలుని
కోరికపై మరొకరకం సమస్యని పరిష్కరించడానికి యత్నిస్తున్నాడు.



మద్యనిషేధశాఖామంత్రి శ్రీ నీలం సంజీవిరెడ్డిగారు అనంతపురం వెళ్లినప్పుడు:
చిత్రంలోఉన్నవారు రియాజ్, శ్రీ వెంకటరెడ్డి, (వెనుక) జాఫర్ మొహిద్దీన్,
శ్రీ నీలం సంజీవిరెడ్డి, శ్రీ గోవిందరాజులుగార్లు.



సంస్థానకాంగ్రెసు అధ్యక్షుడు స్వామీ రామానందతీర్థ, డా॥ లంకసుందరం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర ! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్ల౯.(మహాభారతము)

Founder: K. NAGESWARA RAO

సంపుటము 41

సంచిక 34

విరోధి సంవత్సర వైశాఖ శుద్ధ చతుర్దశి బుధవారము



లాహోర్ చిత్రంలో నర్గిస్

ఆంధ్రపత్రిక

1949-వ సం॥ మేనెల 11-వ తేది బుధవారము

బర్మాకు కామన్వెల్తురాజ్యములసహాయం

కామన్వెల్తు ప్రధానుల సభ ముగిసిన ఒకటి రెండు రోజులకే, బ్రిటను, భారతదేశము, సిలోను, పాకిస్తానులు బర్మాకు అవసరమైన ఆర్థిక, ఆయుధముల సహాయము చేయ నిశ్చయించిరని తెలియవచ్చినది. ఈ నాలుగు దేశముల ప్రధానులు బర్మా అంతర్యుద్ధమును గురించి చర్చించియుండిరి. కామన్వెల్తు సమావేశమునకు ముందే భారత ప్రధాని ఆహ్వానముమీద బర్మా ప్రధాని థాకిన్‌నూ ఢిల్లీ వచ్చి తనదేశ సమస్యల గురించి చర్చించియుండెను. కరాచీ వెళ్లి పాకిస్తాన్ ప్రధానితోకూడ సంప్రతించెను. అంతకు పూర్వము కొద్దికాలము క్రిందట భారతప్రభుత్వము, కరేనులతో సమాధాన యత్నము చేయ సూచించగా దానికి బర్మా ప్రభుత్వము అంగీకరించలేదు. అప్పటికీ ఇప్పటికీ పరిస్థితులు చాలవరకు మారినవని చెప్పవచ్చును. బర్మా ప్రభుత్వమునకు సహాయఅవసరము ఎక్కువైనది. సహాయస్వరూప వివరములు త్వరలో ప్రకటింపబడును. కేవలము ఆర్థిక ఆయుధసంబంధమైన సహాయ ముండునే గాని ఏవిధమైన సైనిక సహాయమూ ఉండజాలదు. ఆయుధ ఆర్థిక సహాయమైనను పెద్ద ఎత్తున బ్రిటను చేయగలదు. తప్ప భారత, పాకిస్తాను, సిలోనుల కెవరికిని సాధ్యము కాదు.

ఆసియాలో స్థిరత్వ మనునది ఏర్పరచు కార్యక్రమములో బర్మాప్రభుత్వమునకు సాధ్యమైన సహాయము చేయుట ముఖ్యావసరము. పొరుగుదేశమగుటవల్ల బర్మాపరిస్థితియెడ భారతదేశము అశ్రద్ధ వహింపజాలదు. చైనానుండి కమ్యూనిస్టులు కొద్దికొద్దిగ బర్మాలో ప్రవేశించుచున్నట్లు వార్తలు వచ్చుచున్నవి. ఇప్పుడున్న అశాంతి కనుక ఎక్కువైన, దాని ప్రభావము భారతదేశముపై ప్రసరించక మానదు. ఈ దృష్ట్యానే కాక మరొక విధముగ గూడ బర్మాలో శాంతి స్థిరత్వములు ఏర్పడుట భారతదేశమున కవసరము. ఆహారమునకు భారతదేశము బర్మా బియ్యముపై ఆధారపడవలసియున్నది. బర్మానుండి బియ్యము వచ్చినంతకాలము ఆహారవిషయమున భారతదేశము లోటు అను మాటను ఎరుగదు. సహాయము చేయదలచుట మూలమున భారతదేశము సైనికచర్య బాధ్యత వహించుననుట హాస్యాస్పదము. చేయదలచినది కేవలము బర్మా ప్రభుత్వము తిరుగుబాటుదారులను అణచుటకు కావలసిన పరికరములను సరఫరా చేయుట తప్ప వేరు కాదు. కామన్వెల్తులోని నాలుగుదేశములు కూడ సహాయము చేసెదమని చెప్పటతోబాటు కరేనులతో బర్మా ప్రభుత్వము సమాధానపడవలసి యుండుననికూడ తెలిపిరి. అది క్రమమైన సలహాయే అని చెప్పవచ్చును. ఏ ఒక్కరో కాక నాలుగు దేశములు సమిష్టిగ వ్యవహరించదలచుట మెచ్చదగిన విషయము.

బర్మాకు సహాయము చేయవలెనను నిర్ణయము తగిన సమయములో జరిగినదని చెప్పవచ్చును. త్వరితనిర్ణయమునకు రాక కాలయాపన చేసియుండిన థాకిన్‌నూ ప్రభుత్వమున కతిశీఘ్రకాలములో చైనాలో చాంగ్-కై-షేక్ ప్రభుత్వమునకు పట్టిన గతి పట్టగలిగెడిది. ఏ విధమైనసహాయము అత్యవసరమను విషయమును నాలుగుదేశముల ప్రతినిధులతో కూడిన సమిష్టిసంఘము నిర్ణయించ గలదు.

కార్మిక సంస్థలు

ఈ వారము మన దేశములో మరొక కార్మిక సంఘసమాఖ్య కలకత్తాలో ఉద్భవించినది. సోషలిస్టు పార్టీకి అనుబంధముగ అట్టి కార్మిక సంస్థను స్థాపించ యత్నించి విఫలులైన వారు, రాజకీయములతో ప్రమేయము లేకుండ నిర్వహించవలెనను ఆశయముతో ఈ సంస్థను కొత్తగా స్థాపించిరి. దీనికి అధ్యక్షులు ప్రఖ్యాత ఆర్థికశాస్త్రవేత్త ప్రొఫెసర్ కె. టి. షా. కార్యదర్శి, పూర్వము అఖిలభారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేసి, ఆ సంస్థ కమ్యూనిస్టుల పరము కాగానే విడిచిపెట్టిన శ్రీమృణాళకాంతి బోస్‌గారు.

మన దేశమున రాజకీయము లే ధోరణిలో నున్నవో కార్మికోద్యమము కూడ అదే ధోరణిలో నున్నది. విప్లవము ద్వారా ప్రభుత్వమును పడగొట్టి పరిపాలనను హస్తగతము చేసికొనవలెనను ఆశయముతో సమ్మెలు, సానుభూతి సమ్మెలు, సర్వకార్మిక జన సమ్మెలు ప్రయోగించి కమ్యూనిస్టులు కార్మికోద్యమము నడుపుచున్నారు. కార్మిక జనులలో ఐక్యత ప్రధానమని వీరు నినాదము చేయుదురే కాని, అన్య కార్మిక పక్షములను భగ్న మొనర్చుట వీరి కార్యక్రమములో ప్రధానాంశము.

సామ్యవాద ఆర్థిక వ్యవస్థ స్థాపించుటకొరకే కృషిచేయు సోషలిస్టులు కూడా కార్మికసంఘములకు రాజకీయములకు ముడిపెట్టుచున్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌ప్రభుత్వమును పడగొట్ట యత్నించుచున్నందువల్ల, ప్రతీకారచర్యగా జాతీయకాంగ్రెస్ ఒక కార్మిక కాంగ్రెస్‌ను స్థాపించినది. కాంగ్రెస్ ప్రభుత్వము శాసనముల ద్వారా చేసిన సదుపాయములతో తృప్తిపడి, ప్రభుత్వమునకు అండగా నిలబడి, తగవులు రెచ్చగొట్టకుండ, దేశములో కాంగ్రెస్‌పరిశీలనను సుస్థిరపర్చుటకు తోడ్పడవలెనని ఈ కార్మిక కాంగ్రెస్‌కు మంత్రులు, నాయకులు చెప్పుచున్నారు.

రాజకీయ పక్షములవలెనే కార్మికసంఘములు పరస్పర వైషమ్యములలో మునిగియున్నచో కార్మికుల స్థితిగతులు మేలు కాజాలవు. కార్మికుల హితము, వారి యోగక్షేమము లనే ప్రధాన లక్ష్యములుగా పెట్టుకొన్నచో, భిన్నాభిన్నమైన కార్మికోద్యమము వర్ధిల్లగలదు. కార్మిక సంస్థలు నాలుగై చీలిపోయిననూ సహకారము సాధించుట అసాధ్యము కాదు.

జాతీయ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ద్వితీయ వార్షిక సమావేశములో ఉపన్యాసములను గమనించినచో, నాయకులుకూడ ఈ విషయమును గుర్తించినట్లు కానరాదు. ఈ విషయము గుర్తించబడనంతవరకూ, పరస్పర సహకారవాంఛ లేనంతవరకూ మన కార్మికోద్యమము కమ్యూనిస్టులకే అనుకూలించగలదు.

కార్మిక జనైక్యత కోరుచున్నారను కమ్యూనిస్టు నినాదమునకు మరి ఆంతర్యము “అన్యకార్మిక పక్షములలో వీలైనన్ని విభాగములు సృష్టించి, చిట్టచివరకు కమ్యూనిస్టుల అదుపులో నుండు ఐక్యకార్మిక సంస్థను నిర్మించుట” యనియూ, కమ్యూనిస్టు పక్షము భారతదేశములోకూడ ఇట్టి విధానమునే అవలంబించుచున్నదనియూ గ్రహించినవారికి, కార్మిక సంస్థల మధ్య సహకారమును సాధించు టెంత అవసరమో గ్రాహ్యము కాగలదు.

ఐక్యజర్మనీ భవిష్యత్తు

రెండు ప్రపంచ యుద్ధములకు జర్మనీ ప్రత్యక్షహేతు వైనది. మూడవ ప్రపంచ యుద్ధమునకు పరోక్షహేతువు కాగలదన్న భయమును, బెర్లిన్ దిగ్బంధనతో ఒక కొలికికి వచ్చిన అగ్రరాజ్య చతుష్టయ విభేదములు తీవ్రతర మొనర్చినవి.

బెర్లిన్ దిగ్బంధన మొదలిడిన నాటినుండియు పశ్చిమ రాజ్యములు, రష్యాతో సంప్రదింపులును, భద్రతా మండలిలో రష్యాపై ఫిర్యాదులును ఎడతెగక తెచ్చుచునే ఉన్నది. కాని సమస్యకు పరిష్కారము లభించలేదు.

అట్లాంటిక్ ఒడంబడిక ఉద్భవించుటతో, రష్యావిదేశాంగ విధానము మారగలదను భ్రమకొలుపుటకు క్రెమ్లిన్ అధికార వర్గములో మార్పులు జరిగినవి. వితండవాదమును అవలంబించుచునే, అవసరమును బట్టి పూర్వవాదమును సంపూర్ణముగ వదలుకొని సమాధానము చేజిక్కించుకొనుటకు ప్రశస్తి కెక్కిన విషిన్స్కీ విదేశాంగ మంత్రి యయ్యెను.

పశ్చిమరాజ్యములు, యూరపియన్ కౌన్సిలును, పశ్చిమ జర్మనీ ఫెడరేషన్ రిపబ్లికును, ఒకే వారములో స్థాపించినవి. ఆ వారములోనే రష్యా బెర్లిన్ దిగ్బంధనను ఎత్తివైచి, విదేశాంగ మంత్రుల సమావేశమును 23 వ తేదీకి ఆహ్వానించి, సంప్రదింపులకు సంసిద్ధత జూపినది.

పశ్చిమ జర్మనీ విడి రిపబ్లిక్‌గా తయారవకుండవలెనను ఉద్దేశముతోనూ, ఐక్యజర్మనీ యంతయూ, రష్యా ప్రభావములోనికి రావలెనను ఆశతోనూ, రష్యా బెర్లిన్ దిగ్బంధనను సాగించినది. కాని, పశ్చిమ జర్మనీ, నూతన ఫెడరల్ రిపబ్లిక్ చట్టము నామోదించుటతో, ఈకోర్కె సిద్ధించుటకు అభ్యంతరము కల్గినది.

మే 23 న జరుగు సమావేశములో చర్చకు రాగల ముఖ్యవిషయము బెర్లిన్ దిగ్బంధన కాదు. ఐక్యజర్మనీ భవిష్యత్తు.

ప్రస్తుత మేర్పడిన పశ్చిమ జర్మనీ రిపబ్లిక్, తూర్పు జర్మనీ కూడ కలవవచ్చునని ఆహ్వానించినది. రిపబ్లిక్ ఇంత హడావుడిగా ఆమోదించిన రాజ్యాంగచట్టమును, తూర్పు జర్మనీ అసెంబ్లీగాని, రష్యాగాని ఆమోదించగలుగుట కష్టము. కాని విదేశాంగ మంత్రుల సమావేశము, జర్మనీ ఐక్యత విషయమునగల ఈ సమస్య లన్నింటిలోనూ సమాధానము కుదుర్చుకోగల్గిన తప్ప, జర్మనీ విభజన తథ్యమై, దాని ప్రాపున అగ్రరాజ్య విభేదములు పెచ్చు పెరిగిపోవు అవకాశమే ఎక్కువగలదు.

విదేశాంగ మంత్రుల సమావేశము నిటు ఆహ్వానించుచునే, అటు పశ్చిమ జర్మనీ ఫెడరేషన్‌కు ప్రతిగ, తూర్పు జర్మనీ ప్రత్యేక రాజ్యస్థాపన కార్యక్రమము జూన్ 1వ తేదీనాటికే

మనరాష్ట్రం మనదేశం

* ఆంధ్రరాష్ట్ర నిర్మాణం, రాష్ట్రకాంగ్రెస్ సమావేశం
* మద్రాసు మంత్రివర్గ నిర్మాణం
* కార్మికోద్యమం, నూతనసంస్థ
* నెహ్రూకు ట్రూమన్ ఆహ్వానం

ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యను గురించి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం చర్చిస్తోంది. చెన్నపట్నం భవిష్యత్తును గురించీ, సత్వర ఆంధ్రరాష్ట్ర నిర్మాణం గురించీ ప్రజల్లో బహువాదాభిప్రాయా ఏర్పడి రోజు కొకరీతిని మారుతున్నందువల్ల విమర్శలన్నీ చల్లబడి ఏదో అభిప్రాయం స్థిరపడే వరకూ చూస్తున్నారనీ, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సర్వసభ్య సమావేశం ఎటువంటి అభిప్రాయం వెలిబుచ్చుతుందో తెలుసుకోడానికి నిరీక్షిస్తున్నారనీ రాష్ట్రపతి పట్టాభిసీతారామయ్య గారు చెన్నపట్నంలో పత్రికా విలేఖరుల్తో చెప్పారు. రోజు కొక రీతిగా అభిప్రాయాలు, ఆదర్శాలు మారడం ప్రజల్లోనూ నాయకుల్లోనూ ఇప్పుడు కొత్త కాదు. ఏ సమస్యపైనైనా ప్రజల అభిప్రాయం జాతీయప్రాంతీయాభిమానాలనుబట్టి, ఆర్థిక స్థితుల అనుకూలతనుబట్టీ ఏర్పడతాయి. నాయకులైన వారు దేశపురోభివృద్ధినీ, ప్రజాహితాన్నీ దృష్టిలో పెట్టుకుని మూక ప్రజాకోటి ఆశయాలకు స్వరూప మిచ్చి, అభిప్రాయాలను పరిదిద్దుతారు. దీనికి నాయకుల్లో విశుద్ధవర్తన, ఏకాగ్రత, నిర్భయం, పట్టుదల అవసరం. అన్ని దేశాలు వాని వాని నాయకుల్నిబట్టే పరిణామం చెందాయి. చరిత్రలో విషాదసంఘటనలన్నిటికీ ఎవరో ఒకరు నాయకులే కారకులు. ఈనాడు ఆంధ్రరాష్ట్రం ఏర్పడే అవకాశం అరిచేతిలోకి వచ్చినా జారవిడుచుకున్నామంటే బాధ్యత ప్రజలది కాదు. నాయకులదే అవుతుంది. ఈనింద అందరునాయకులూ సమానంగా భరించవలసి ఉంటుంది. ప్రకాశంగారు, రంగాగారు ఆంధ్ర కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో పాల్గొంటున్నారు. రాష్ట్రకాంగ్రెస్ కార్యవర్గం అభిప్రాయం ఇదివరకే ఒక తీర్మానంద్వారా ప్రకటించబడింది చెన్నపురి. ఆంధ్ర జిల్లాకాంగ్రెస్ కూడా తన అభిప్రాయం ప్రకటించింది.

చెన్నపట్నం లేకుండానే ఇప్పుడు ఆంధ్రరాష్ట్రం నిర్మించడానికి అంగీకరిస్తున్నట్లు ఉభయసంఘాలు తీర్మానాలు చేశాయి. ఇంక ఎట్లొచ్చీ ముమ్ముందు చెన్నపట్నంగురించి సరిహద్దునిర్ణాయకసంఘం పరిశీలిస్తుందా? లేక ఏపరిశీలనా జరక్కుండే చెన్నపట్నం తమిళ్నాడులో చేరిపోతుందా? ఆరీతిగా చేరిపోయినట్లయితే గంజాం, కోరాపుట్టిజిల్లాలగతే చెన్నపట్నానికీ పట్టవచ్చును. అందువల్ల ఆంధ్రరాష్ట్రాన్ని చెన్నపట్నం లేకుండానే నిర్మించవచ్చునుకాని ఉత్తరాన, దక్షిణాన, పశ్చిమాన సరిహద్దు తగవులు తీర్చడానికి వెన్వెంటనే సరిహద్దు నిర్ణాయక సంఘం ఒకటి నిర్మించమని కోరడంలో అనుచిత మేమీ లేదు. కాని దీన్ని గురించి మన నాయకులు ఆలోచించినట్లే కనపడదు. ఆంధ్రరాష్ట్రనిర్మాణం అయినాక ఎప్పుడో కేంద్రఅధిష్ఠానవర్గానికి తరుణమని తోచినప్పుడు సరిహద్దు తగవులు తీర్చగలరనుకుంటే, అది వట్టి భ్రమమాత్రమే.

చెన్నపట్నాన్ని విడిచి రాష్ట్రం నిర్మించుకోడానికి ఆంధ్రులకి అంతగా అభ్యంతరం లేదు. చెన్నపట్నం భవిష్యత్తు ఏ రీతిగా ఉండాలో నిర్ణయించాలంటే సరిహద్దువిషయములే కాదు. ప్రజాభిప్రాయాన్నీ, సాంఘిక, వాణిజ్య వ్యాపార, పాలనసౌకర్యాది విషయాలన్నిటినీ, సమగ్రంగా పరిశీలించవలసిఉంది. ఏపరిశీలనా జరుగకుండా, ఏపరిష్కారమార్గం సూచించకుండా "ఫలానా పద్ధతిమాత్రం పనికిరాదు" అనడం న్యాయం కాదు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఇటువంటి వైఖరి ప్రజలవంచన కిందికే జమ అవుతుంది. చెన్నపట్నంగురించి ఏపరిశీలనా లేకుండా "ప్రత్యేక రాష్ట్రంగా ఉండతగిన ప్రత్యేకత లేదు. సన్నిహిత భాషాప్రాంతాలతో అతిసన్నిహిత సంబంధాలుండడంవల్ల విడిరాష్ట్రంగా ఉంచడం కష్టం" అని పట్టాభి - పటేల్ - నెహ్రూ కమిటీ నివేదికలో చెప్పారు. ఈ వైఖరి నీతిసమ్మతంకాదు. చెన్నపట్నాన్ని తమిళుల కొప్పగింత పెట్టాలనే నిశ్చితాభిప్రాయంతో ఈ వాక్యాలు నివేదికలో చేర్చినట్లు గోచరిస్తుంది. అది కాదని డా॥ పట్టాభిగారు చెప్పగలరా? వారట్లు చెప్పగలిగినట్లయితే, బేషరతుగా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నాయకత్రయ నివేదికను అంగీకరించవచ్చును. ఎలాంటి అభ్యంతరం ఉండనక్కరలేదు. "చెన్నపట్నాన్ని ఆంధ్రరాష్ట్రంలో చేర్చని పక్షంలో పరిష్కారయోగ్యమైన ఇతర మార్గాల్ని" ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ తరఫున రంగాగారు థార్ కమిషన్‌కు సూచించిన రోజునే చెన్నపట్నంపై ఆంధ్రుల హక్కు పోయింది. ఇప్పుడు విడిచిపెట్టడానికి మిగిలిన హక్కు "అన్య పరిష్కార మార్గాలు." ఈ అన్యపరిష్కార మార్గాల్ని కూడా త్రోసిపుచ్చినట్లయితే పట్టాభి కమిటీ నివేదికను నిరాకరించవచ్చును. త్రోసిపుచ్చకుండా, ఇతర పరిష్కార మార్గాలకు అవకాశం ఉందని డా॥ పట్టాభిగారు చెప్పినట్లయితే, నివేదికను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అంగీకరించడం ధర్మం. అందువల్ల రాష్ట్రకాంగ్రెస్ తీర్మానం కోసం, ప్రజాభిప్రాయం స్థిరపడ్డంకోసం నిరీక్షించడంకంటె, డా॥ పట్టాభిగారు పరిస్థితిని స్పష్టపరిచి, సందిగ్ధచంచల వాతావరణాన్ని చల్లబరచవలసిన అవసరం ఉంది.

ఈలోగా "చెన్నపట్నం వొదిత్తే రాయలసీమ ఆంధ్రరాష్ట్రంలో చేరదు" అని కొందరు నాయకులు ప్రకటనలు చేస్తున్నారు. ఇవి స్వార్థాశయ ప్రకటనలుగానే కనిపిస్తున్నాయి. హేతుయుక్తవాదనగా కనిపించదు. వీరు సరిహద్దు నిర్ణాయకసంఘం వెంటనే నియమించాలనీ, చెన్నపట్నంలో రాయలసీమవాసుల స్థితినీ హక్కుల్నీ పరిశీలించాలనీ ఆందోళన చెయ్యడం మంచిది. రాయలసీమవారికి చెన్నపట్నంపై ఇంత కాంక్ష ఉంటే, చెన్నపట్నం రాయలసీమ వాసులదే అయితే, నగరంలో తెలుగు విద్యాబోధన రద్దవుతుంటే ఎందుకు కూరుకున్నారు? చెన్నపట్నంతో రాయలసీమకు గల సన్నిహిత సంబంధాన్ని నిరూపించుకోడానికి ఇప్పటినుంచీ సిద్ధపడవచ్చును.

మంత్రివర్గ నిర్మాణం:

మద్రాసు మంత్రివర్గ నిర్మాణం గురించి ఈ వారం ప్రకాశంగారి ప్రకటన, ప్రధాని సమాధానం, ప్రధాని పత్రికా సమావేశ ప్రకటనా చూస్తే మనరాష్ట్రరాజకీయాలధోరణి ఎతంశోచనీయంగా ఉందో తెలుస్తుంది. మద్రాసుమంత్రివర్గరాజకీయాల్లో నాయకులమధ్య విరోధాలు, వర్గవిభజనలకు నాయకులందరూ బాధ్యులే. అధికార పదవుల వ్యామోహంతో నేడొకవర్గంలో, మర్నాడు మరొకవర్గంలో చేరి, మాటిమాటికీ వర్గాలబలాలు మారడానికి తోడ్పడుతూ, మంత్రివర్గాల పతనాలకు కారకులైన మంత్రులు, శాసనసభ్యులూ కూడా సమానబాధ్యులే.

అంతో ఇంతో బలగం చేర్చుకున్న నాయకులందర్నీ మంత్రిపదవు లిచ్చి సంతృప్తిపరచడమా లేక వారివారి బలగాలతో వచ్చి తమకు వోట్లిచ్చి నాయకునిగా ఎన్నుకున్నందుకు ఆ ఒక్క వర్గంలోని నాయకుల్నే తృప్తిపరచడమా అనేది సమస్య. 1946 లో శ్రీ ప్రకాశంగారు మొదటి పద్ధతి అవలంబించిఉంటే చెన్నరాష్ట్రంలో ఈనాడు మంత్రివర్గ రాజకీయా లింత శోచనీయ స్థితిలో ఉండవు. ప్రత్యర్థివర్గానికి ఆ బలానికి తగిన రీతిని మంత్రివర్గంలో ప్రాతినిధ్యం ఇవ్వలేదని ఇప్పుడు ప్రకాశంగారు నిందిస్తున్నారు. ఈ నిందకు ఒకప్పుడు వారూ బాధ్యులే. ఆనాడు కూడా ప్రకాశంగారు రాజాజీవర్గంలో తన ఇష్టంవచ్చిన వారి కిద్దరికి మంత్రిపదవు లిస్తానన్నారు. ఈనాడూ తిరిగి అదే కుమారస్వామి రాజాగారు అంటున్నారు. ఆనాడు వారు చేసినదీ ఉచితంకాదు. ఈనాడు కుమారస్వామి రాజాగారు చెప్పుతున్నదీ ఉచితంకాదు "నేను పార్టీలో వర్గభేదాల్ని పాటించను" అని కుమారస్వామి రాజాగారన్నారు. వర్గభేదాల్ని పాటించని పక్షంలో, కామరాజనాడార్‌గారు రామస్వామిరెడ్డిగారిని పడగొట్టాలని విశ్వప్రయత్నం చేస్తున్నప్పుడు, వివిధబలగాల నాయకుల్తో ఎందుకు చేరారు? వారిప్పుడు ప్రధానిగా ఉన్నారంటే వర్గభేదాలే వారికి పంట నిచ్చింది. వర్గభేదాల్ని పుట్టుకలోనే అంతరింప చెయ్యగల అవకాశం ప్రకాశంగారికి వచ్చినప్పుడు జారవిడిచారు. ఇప్పుడు వర్గ ప్రతిష్ఠ, వర్గ అభిమానాలవల్లనే ప్రస్తుతావకాశం వ్యర్థమయిపోయింది.

ఇవి పోగా పరస్పరవిరోధాలు పెచ్చుపెరుగుతున్నాయి. వ్యక్తిగత దూషణలు చెలరేగుతున్నాయి. డా॥ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా ఉండగా మద్రాసుమంత్రులపై ఆరోపణల విషయంలో వారు అంతగా జోక్యం చేసుకోవడానికి ఇష్టపడలేదు. పార్టీలోని విరోధాలే ఆరోపణలకు హేతువని కొందరన్నారు. మంత్రులపై అవినీతివర్తన ఆరోపణల్ని గురించి అప్పుడు బహిరంగపరచకుండా ఉంచారు. ఇప్పుడు ప్రకాశంగారు వానిని తిరిగి రెచ్చగొట్టారు. ఇట్టి ఆరోపణల్ని సరిగా విచారించి పరిపాలనలో ధర్మాన్నీ, నీతినీ పాటింపచవలసిన

(20-వ పేజీ చూడుడు)



బెర్నార్డుషాతో నెహ్రూ

పూర్తి చేయుటకు సోవియటు రష్యా ప్రయత్నించుచున్నది. ఒకరి కొకరు పోటీగ ఇట్లు ప్రయత్నములు చేయుచు, అగ్రరాజ్యములు, జర్మనీ విభజనను తథ్యము చేసిన, తమతమ మధ్యగల యుద్ధ ప్రోద్బలకములగు ప్రధానవిభేదములను సమసింప చేసికొనుట కాక ఖండితముగ తీవ్రమొనర్చుకొనుటయే యగును.

వ్యంగ్యరచన:

అవతరించే తెలుగుతల్లి

శ్రీ కే. సభా

ఏదో ఆలోచించుకుంటున్న నావేపుకు తీవ్రముగా విసరికొట్టాడు పత్రికను మా వాడు. ఈ చర్యలో ఏదో విశేష ముంటుందని నాకు తెలుసు. పైగా ఏదో సరిపడని సంగతి పత్రిక నంతా అల్లుకుని వుంటుం దని గూడా నాకు అనుమానం లేకపోలేదు. ధారుకమిటీ రిపోర్టు నందుకున్న అగ్రనాయకత్రయం భాషారాష్ట్ర సమస్యను ఏం చేసిందో, పైగా ఆ నివేదికను కాంగ్రెస్ కార్యవర్గం ఎలా అంగీకరిస్తుందో, అవతరించే ఆంధ్రరాష్ట్రం ఏ రూపంలో కనబడుతుందో తెలుసుకోవా లనే కాంక్ష ఆతురతతో హృదయం ముడివడుతోంది. అందుకే వెంటనే పత్రికను పరిశీలించాను. అటు గంజాం కోరాపుట్టి జిల్లాల ఊసెత్తక ఇటు మదరాసుకు నీళ్లువిడిచి తెలంగాణాను గంగలో కలపి ముక్తసరిగా ఏర్పడే ఆంధ్రరాష్ట్రచిత్రం స్పష్టంగానే కనబడుతూనే ఉంది. ఆ రోజంతా నాకూ మా వాడికీ ఈ చర్చతోనే దొర్లిపోయింది.

మా చర్చల్లో కాకతీయుల కదనపాండితినుండి తెలుగువెలుగుల బాలచంద్రుని పచ్చిరోసాల వరకు... తెలుగుటిల్లాండ్ర ముగ్గుల అల్లికలలోని సొబగులనుండి హంపీ శిల్పాల నైపుణ్యంవరకు... సుమతిశతక కారుని దూరదృష్టినుండి కవిత్రయాల కవితాశిల్పంవరకు—ఇంకా ఎన్నో తెలుగుతనం వివిధరంగాలలో మూర్తీభవించిన రీతులన్నీ గూడా వరుసక్రమంగా గాకున్నా చిందరవందరగా స్మృతికి వచ్చాయి

అనవసర వాగ్వివాదాలతో ప్రయోజనంలేని చారిత్రక స్మృతులతో ఉదయించిన అలసటతో తొమ్మిదిగంటలకే బాగా నిద్రపట్టింది. కానీ ఈ నిద్ర అట్టే నిశ్చలంగా నిలువలేకపోయింది. పన్నెండుగంటలు కొట్టిన శబ్దం ఎక్కడో రామజోగివేసే కంచుజాలర మోతలాగా మెల్లగా వినిపించాయి. అప్పటినుండే కలతనిద్రలో శరీరం తేలిపోతున్నట్టు గమనం...ఆ తేలిక వాతావరణంలో కనబడ్డ దృశ్యాలను చిత్రించడమే ఈ రచనలోని అసలు ఉద్దేశంకూడా.

సాధారణంగా పట్టణాల్లో కనిపించే నాటకశాలలకు ఆ స్వప్నసీమలో నేను చూచిన నాటకశాలకు ఎంతో తేడా వుంది. ఈ నాటకశాలల కంటే అది రమణీయంగా కనిపించినప్పటికీ అందులో ఏదో శిల్పం మరుగుపడ్డట్టు ఏదో అవ్యక్తమైన కళ దోబూచులాడుతూ అస్పష్టంగా కనబడుతున్నట్టూ తోచింది.

ఎక్కడా తెలుగుతనం గంతులేస్తూ వుంది. ప్రేక్షకుల్ని చూచినపుడు చప్పున ఎవరో.. ఏ ప్రాంతంవారో గుర్తించే అవకాశం లేకపోయినప్పటికీ కాస్తా ఆగి వారి భాషను గమనిస్తే అందరూ తెలుగువారే నని తెలుసుకొనే వీ లున్నది.

జరుగబోతున్న నాటకమేదో అందులో పాత్రధారు లెవరో కనిపెట్టడం చాలా కష్టమనిపించింది. అంతవరకూ ఆ విషయాన్ని గురించిన ఏ ఆచూకీగూడా అందకపోవడంవల్లా ఎంతో తికమక పడవలసిన గతి పట్టింది.

మొదటి దృశ్యం అతిమనోహరంగా ఆహ్లాదజనకంగా రచించబడింది. అందులో ఎవరో కొందరు ప్రత్యేకవ్యక్తులు ఆ పరిసరాలనంతా అత్యంతాసక్తితో కడుజాగ్రత్తగా పరిశీలిస్తున్నారు. కనబడ్డవారినల్లా పలకరిస్తున్నారు. అందులో కొందరివద్దనుండి అందిన జవాబులను రికార్డుచేసుకుంటున్నారు. ఇది కథో...దీని పర్యవసాన మేమౌతుందో ఇందులో దాగున్న నాటకనైపుణి ఏమిటో తెలుసుకోడానికి మెదడు కరగిపోయేలా ఆలోచించాను.

ఈ ఆలోచనలు పెల్లుబుకుతున్నపుడే తెర జారిపోయింది. యవనిక వ్రాలడంతోటే ప్రేక్షకులనుండి పెద్ద కలకలం పుట్టింది. ఈ కలకలాన్ని అణచడానికో...మరి యింకే అవసరంవల్లానో నేను చెప్పలేను కానీ, వేదికమీద ముసుగును తొలగించుకొని యిద్దరు ముందుకొచ్చారు. వారిని నాయకులని గుర్తుపట్టాక నాకు సహితం ఏదో క్రొత్త అనుభవాన్ని చవిచూస్తున్నట్టు.. ఏదో క్రొత్త ప్రపంచంలోకి పయనిస్తున్నట్టు ఆనందం కలిగింది. వారి శాంతవచనాలు వినడంతోటే నాటకశాలలో నిశ్శబ్దం నిర్విఘ్నంగా తాండవించింది. కానీ అక్కడక్కడా గుబలు గుసలు మాత్రం అస్పష్టంగా చిరుబుస్సులు కొడుతున్నాయి.

తెరతొలగడంతోటే రెండో రంగం ప్రారంభమైం దనుకున్నాను. కానీ అందులో వెలుతురే కనిపించలేదు. సన్నగా పలుచని చీకటి తెరల్లో ఎవరో కొందరు రహస్యాలోచనలు చేస్తున్నట్టు ఊహించడంలో అసహజం కనిపించలేదు. అతి ప్రయత్నంమీద అక్కడున్నది ముగ్గురు మాత్రమేనని గుర్తుపట్టగలిగాను. ఆ ముగ్గురూ దేనిని గురించి చర్చిస్తున్నది ఏం చేస్తున్నదీగూడా సరిగా కనిపించకపోవడంతో అసలు యిది నాటకమేనా అనిపించింది. కాని ఆ నాటకానికి నే నొక చిల్లిగవ్వగూడా యిచ్చినట్టు గమనం లేదు కాబట్టి, అసలందులో టిక్కెట్ల విధానంగూడా ఉన్నట్టు తోచడంలేదు కాబట్టి అక్కడ ప్రేక్షకుల అధికారాలు, ఆటలు, ఆర్భాటాలు ఎంతమాత్రం సాగవని కిక్కురుమనకుండా కూచున్నాను.

అదృష్టం అవసరమైనపుడు ఎవరికీ అందదు. కొందరు అదృష్టమంటూ ఏదీ లేదంటూ లభించే అదృష్టాలతోనే అదృష్టాలకు కారణాలు వెదుకుతూ వుంటారు. నాకిక్కడమాత్రం లభించిన పరిస్థితిని అదృష్టమనే చెప్పాలి. ఎందుకంటే అమాంతంగా ఏ ప్రయత్నమూ లేకుండా నే నిలాంటి నాటకాన్ని తిలకించడం అదృష్టంగాక మరేమౌతుంది. ఆ కనిపించిన దృశ్యం...అది అట్టే సాగుతుండడం నాకు కొంచెం చీకాకు కల్గించిన మాట వాస్తవమే. కానీ ఆ పరిస్థితి వెంటనే మారిపోయింది. దృశ్యమంతా పసిడికాంతులతో ముంచివేయబడింది. అప్పుడే అక్కడున్న వ్యక్తులు బాగా కనిపించారు. అందులో ఒకరిముఖంమాత్రం కొంచెం అస్పష్టంగా కనిపించింది. కొద్దిగా ఆగి సావధానంగా పరిశీలించాను. దృశ్యమంతా ఒకబొమ్మల కొలువులాగా కనిపించింది. అందులో పూర్తియైన శిల్పాలు కొన్ని...సగం పూర్తియైనవి కొన్ని, అప్పుడప్పుడే ఆకారాలను దిద్దుకొంటున్నవి కొన్ని...రంగులివ్వబడుతున్నవి కొన్ని...మెరుగులు వేయబడుతున్నవి కొన్ని—రకరకాలుగా వివిధభంగిమలతో చూట్టానికి ఉల్లాసాన్ని, ఉత్తేజాన్నిగూడా కల్గిస్తున్నాయి.

ఈ బొమ్మలు చేయబడుతున్నందుకు గల కారణాలనుగూడా నేను ఆలోచించడానికి మొదలెట్టాను. కానీ ఈ ఆలోచనకు నా కవకాశం లేకపోయింది. జారిపోయిన యవనికమీది బౌద్ధచిత్రంవేపు నా దృష్టి ప్రసరించింది.

ఆ ఆకుపచ్చని బంగారు అంచుల తెరమీద నాగార్జునుని శిల్పసౌందర్యలహరిలోని ఒక బిందుప్రమాణంగల శిల్పం మాత్రమే చిత్రించబడింది. ఆ చిత్రంలో ఎన్నో జీవకళికలు మూర్తీభవించి ఏదో అనిర్వచనీయమైన కరుణారసోద్దీపనలో ప్రకృతిని ముంచెత్తడానికి సిద్ధమౌతున్నట్టు తోస్తున్నది...ఈ విచిత్ర చిత్రరచనలలోని కౌశల్యాన్ని...ఆ చిత్రంలోని శిల్పనాచార్యుని భావనా తరంగాల కదలికల గరిమల లాలిత్యాన్ని, ఔన్నత్యాన్ని తిలకించడం వల్లనే కావాలి, ప్రేక్షకులు ఎవరూ అల్లరి చేయడంలేదు...అందరి ముఖసీమల్లోకూడా భవిష్యత్తులో జరుగబోయే...ముందు దృశ్యంలో గోచరించబోయే సంఘటనను చూడాలనే తీవ్రమైన కాంక్ష తీరని దాహంలా ద్యోతకమౌతూ వుంది.

మూడవరంగం ఏమంత ఆకర్షణీయంగా ఉంటుం దనే సందేహం కలిగింది. ఈ సందేహం ఎందుకు గల్గిందో నా కిప్పటికీ అర్థం కావడం లేదు. కానీ అనుకున్న దానికంటే... దొర్లిపోయిన దృశ్యాలకంటే అది చాలా ఆకర్షణీయంగా వుండడం నా కాశ్చర్యం వేసింది. దీనికి ప్రత్యేకమైన కారణం లేకపోలేదు... ఈ దృశ్యంలో కనిపించిన పాత్రలు అధికం.. ...యింతవరకూ కనబడినవా రంతా యిందులో కనిపించారు......వారుగూడా ఒక సమావేశాన్ని నడుపుతున్నట్టు గ్రహించడానికి అట్టే కాలం పట్టలేదు...

ఆ సమావేశభవనం ముందు ఎందరో పత్రికావిలేఖరులు గుంపులు చేరివున్నారు...ఇదేనేమో నాటకానికి జీవంపోసే ప్రధానఘట్టమని నా హృదయంలో ఒక మెలకువ ఉదయించింది. వలయాకారంగా కూచున్నవారి మధ్యలోనే ఈ బొమ్మలన్నీగూడా వరుసక్రమంలో ఉంచబడివున్నాయి. చుట్టూవున్న వ్యక్తులను తప్పించుకుని నా చూపులు మెల్లగా ఆ బొమ్మలమీదికే వాలాయి. వాటిని చూచిందే నాకు చాలా ఆశ్చర్యంవేసింది. ఈమారు వాటిలో చాలాభాగం నిండు ఆకారంతో నూత్నకళలను విరజిమ్ముతున్నాయి. ఒక్కటి రెండుమాత్రం కొద్దిగా అసంపూర్తిగా కనబడుతున్నై. ఇంకొక బొమ్మ కొంచెం పెద్దదిగా కనిపించినా సరిగా రూపొందించబడలేదు. ఆ బొమ్మ ఎవరిదో ఆ శిల్పం ఎవరి సొత్తో చూడాలని కనిపెట్టాలని నేను శతవిధాలా ప్రయత్నించాను. కానీ ఆ శిల్పాన్ని కనబడనివ్వక ఆ వ్యక్తుల్లో ఒకాయన అడ్డంగా కూచున్నాడు. నాకు ఆశాభంగం కలగడంతో ఆగక పట్టుదల ద్విగుణీకృతమేగాదు. వేయి రెట్లు పెరిగిపోయింది. వెంటనే ఉన్న స్థానాన్ని మెల్లగా ఒదిలెట్టి చడీ చప్పుడూ లేకుండా కొంచెం దక్షిణంవేపు వెళ్లి కూచున్నాను. నేను వెళ్లింది తెలుసుకొనో, లేక నా ప్రయత్నాన్ని విఫలం చేయడానికో అదే వ్యక్తి పైకి లేచి కాస్త అటూయిటూ కదలి ఆ చోటును వదలి నా కడ్డంగా కూచున్నాడు.

ఈ మారు కలిగిన విసుగుతో నా గుండెల్లో వింధ్యాచలమంతటి విప్లవం ఉడికి బద్దలై ప్రపంచాన్ని యిముడ్చుకుంటుందని నేనే భయపడ్డాను. కానీ వాస్తవాన్ని గ్రహించి ఎంత పిచ్చోణ్ణి అనుకుని మళ్లీ యథాస్థానానికి మళ్లాను...

ఈ మళ్లడంతోనే యవనిక జారిన చప్పుడు వినిపించింది. ఈమారు తెరపై ఏ శిల్ప చిత్రం నాట్యం చేస్తుందోనని గంపెడంత మాత్రమే గాదు, కొండంత. అదిన్నీ హిమాలయాలంత ఆశతో కూచోకముందే తెరవేపు చూశాను.. కానీ కారుమేఘాలకంటే నలుపుగా ఏనుగు రంగుకంటె దట్టంగా ముద్దకట్టిన చీకటి కంటే ముతకగా నల్లటితెఱ కనిపించింది. బారుమంటూ ఏడుద్దామని ఎలుగు సవరించుకున్నాను...కానీ ఏ ఎఱ్ఱిబుట్టో పసిబట్టి న్యూసెన్సు కేసు పెడితే కానీ గూడా ఖర్చుపెట్టకనే ఇంత మహోజ్వల నాటకాన్ని ధారాళంగా చూస్తున్న నేను అపరాధం వేసిన డబ్బుల్ని ఎలాగా చెల్లించుకోగలననే ఆలోచన తట్టింది. అంత వివేకం ఉదయించడం కారణంగానే ఆ నల్లటి తెరవేపు నిశ్చలంగా చూస్తూ నిలుచుకోడానికి వీలుగాక కూచోడం మరచిపోయి కుములుతూ వుండిపోయాను.

హాలంతా ఒక చీకటి కూపంలా కనబడుతున్న తరుణంలో ఆ కరుడుగట్టిన చీకటిని చీల్చుకుంటూ ఏదో గానం పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తోంది...క్షణంలోనే ఆ గొంతు త్యాగరాజ భాగవతార్ గారి దని గుర్తుపట్టినందుకు నాకు బ్రహ్మానంద మైపోయింది. కొంపదీసి యిక్కడ ఏదీ పొరబాటుగా అర్థం కాదనుకుంటాను. త్యాగరా జంటే రామాయణం గానం చేసిన త్యాగయ్యకాదు సుమా...అరవచిత్రాల్లో కదంతొక్కే భాగవతా రని తెలుసుకునే శక్తి తెలుగువారికి వుంటుం దనడంలో సందేహం లేదు. ఎందుకంటే త్యాగయ్యకంటే ఎక్కువగా విశేషంగా, విశదంగా, త్యాగరాజభాగవతార్‌ను గురించే మన తెలుగువారికి బాగా తెలుసు.

పగబట్టిన వడగండ్లవానలా... పందిరిపై కదంత్రొక్కుతూ పిట్టల్ని బెదరించడానికి ప్రయత్నిస్తున్న రైతుపడుచు ఒడిసెల దెబ్బల్లా ఆయనగారి గానంతో నా తల దిమ్మెక్కిపోతున్నది. ఇందుకు పరిహారమేమిటా అని ఆలోచించే ఓపికగూడా నాకు లేకపోవడం ఆశ్చర్యం గాదు.

నల్లటి తెఱమీద ఎఱ్ఱని కాంతిచ్ఛాయలు పడడంతో ఏదో క్రొత్త కనబడుతుందనుకున్నాను. 'వంగాయం సాంబార్.. అళాకు రెండణా' "పట్టణంప్పొడి క్కెటు వాంగు" తెలిసీ తెలియని అరవ అక్షరాల సాయంతో ఆ ప్రకటనలు తెలుసుకోడం మరీ అవస్థ కూచుంది.

ఏదో గండశిలలు మెదడులో కూరుకపోయినట్టు తలనొప్పి ఘనీభవించింది. "వంగాయం సాంబార్: వంగాయం సాంబార్...అళాకు రెండణా" చెవులు గింగురుమంటున్నాయి... జోరీగలాగా చెవిలోనే ఊదరెడుతున్నాడు కుర్రాడు. టీ కాఫీలస్థానే ఈ సాంబార్ ఎప్పుడు అవతార మెత్తిందో విస్తుపోయాను. నాలుగళాకుల సాంబారు త్రాగి రెండుపలాల పొడుమును పీలిస్తే ఈ తలనొప్పి పోతుందనే ఆలోచన తట్టకపోలేదు. సాంబారు ఘుమఘుమలతో నాలుక చెమ్మగిల్లడమే కాదు, చలానికంటే వేగంగా నాలుకనుండి నీరు వెల్లువలు గడుతోంది. కానీ జేబీలో పైసా లేదు. నా దురదృష్టాని కెంతో బాధపడ్డాను. జుర్రు జుర్రు మంటున్న శబ్దాలు హాలంతా సుడివడుతున్నాయి. ఏవో రకరకాల శబ్దాలు ...గాలిలో కలసిపోతున్నాయి. అవి త్రేన్పులో మరి యేవో ఊహించడంగూడా కష్టమైపోయింది.

ఆ మహాప్రమాదంనుండి నన్ను దరి జేర్చే శుభక్షణంకోసం ఆకాశంకేసి చూతామన్నా ఆ అనుకూలంగూడా అక్కడ లేకపోవడంతో ఖిన్నుడైపోయాను. తెరవెనుక గానంమాత్రం తుఫానుపరిణతికి వచ్చింది.

అదృష్టం బొడ్డ దనే చెప్పాలి. అంతలోనే తెఱ తొలగిపోయింది. మొదట ఏమీ కనిపించలేదు. ఎవరో ఓ మూలనుండి టార్చిఫోకస్ చేశారు. ఆ వెలుగుల వలయంలో ఒక శిలావిగ్రహం కనిపించింది.

ఆ విగ్రహాన్ని చూట్టానికే నాకు బుద్ధిపుట్టలేదు. అదొక స్త్రీ మూర్తివిగ్రహం. ఎందుకలా తయారయిందో అగమ్యగోచరంగా వుంది. ఆ విగ్రహం ఎలా కనబడిందీ చెప్పడంగూడా నాకు చాలా కష్టంగానే తోస్తున్నది. ఎందుకంటే సౌందర్యంలోని తొలకరింపులను సింగారాల్లోని చిలకరింపులను చిత్రించడం చాలా సులభమే. కానీ వికృతంలోని వంకరలను, అసంపూర్ణతలోని సంకుచితాలను సృష్టించడం చిత్రించడంగూడా చాలా కష్టమే...

ఆమెకు జుత్తే లేదు. ఇక్కడ ఆమె అంటే ఆ శిల్పమని గ్రహించడం చాలా అవసరం. ఆ శిల్పం స్త్రీమూర్తి......ఆ స్త్రీమూర్తికి జీవం పోశారు చలనముంది. అందుకనే ఆమె అంటున్నా. జుత్తులేని ఆమె తల చాలా వికృతంగా వుంది...శుభ్రమైన బోడిగుండైనా బావుండేది కానీ అక్కడక్కడా కురులు కుచ్చు కట్టుకున్నాయి.. ఆమెకు కళ్లున్నాయి కానీ, ఒకటిమాత్రం కొంచెం చిన్నదిగా కనబడుతుంది, బహుశా అది కనిపించ దనే నా అభిప్రాయం. ఎందుకంటే చూపంతా ఎడమ ప్రక్కే వాలిపోయింది. కనబడుతున్నది ఒక్క చెవ్వు మాత్రమే.. ఇంకో చెవ్వు ఉన్నదో లేదో గుర్తించడం చాలా కష్టమై ఊరుకోవలసి వచ్చింది.

తలలో వుండవలసిన మిగిలిన అవయవాలు వుండవలసినంత పటుత్వంతో ఉండకపోయినా సుమారు పాటిగా వుం దని ఒప్పుకోడం సబబనే చెప్పాలి.

ఇక కుడిహస్తం ఖచ్చితంగా త్రుంచివేయబడింది. అంచేత ఆ చేతిని గురించిన ప్రసక్తి ఎంతమాత్రమూ అవసరం లేకపోయింది. ఎడమచేయి మోచేతినుండి స్పష్టంగా అందాలు

(22 వ పేజీ చూడుడు)

యూరప్ రాజ్య సమైక్యత పూర్వాపరాలు

[సర్ హెరాల్డ్ బట్లర్]

[యూరప్ రాజ్య సమైక్యతకు మే 3-వ తేదీని పునాది పడింది. సమైక్యతా నిబంధనలు ఆమోదింపబడినాయి. పశ్చిమ యూరప్ రాజ్యాల చేరికతోనే తృప్తిపడి, ఇప్పుడు ఇట్టి సమాఖ్య నేర్పాటుచేయడానికి రష్యా దురాక్రమణభయం ఒక్కహేతువు కాదనీ, ప్రధానహేతువులు వేరే ఉన్నాయనీ ఈ బ్రిటిష్ వ్యాసకర్త చెప్తున్నాడు.]

యూరప్ రాజ్యాలు సమాఖ్యగా సమైక్యం కావడానికి అంతగా ఉత్సాహం చూపడంలేదని ఈనాడు చాలామంది విమర్శిస్తున్నారు. కాని ఈ విమర్శ న్యాయం కాదు. త్వరపడి బలవంతాన నిర్బంధించే ఐక్యత శాశ్వతంగా నిలువదు. ఐక్యత అనేది కాలక్రమేణా సహజపరిస్థితుల్లో రావలసిందే

పశ్చిమ యూరప్ రాజ్యాల ఐక్యతా భావానికి రూపం ఏర్పరచినది 1948 ఫిబ్రవరిలో. ఏటినుంచి ఈ ఉద్యమం చకచకా నడిచింది. ఫాంటెన్‌బ్లో నగరంలో మాంట్‌గామరీ ఆధిపత్యం కింద బ్రసెల్స్ సంధిరాజ్యాల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గ్) దేశరక్షణ కార్యాలయం స్థాపించబడింది. ఆతరువాత యూరోపియన్ పార్లమెంటు స్థాపనకు కార్యక్రమాలు తయారైనాయి. ఒక్క సంవత్సరంలో ఇంత కార్యం సాధించబడిందంటే, యూరప్‌ఖండం యుద్ధవినాశకాండనుంచి తేరుకుంటోందన్నమాట. ఇప్పుడు నూతన రూపం పొందుతోంది.

గతసంవత్సరం మే నెలలో హేగ్ సమావేశం నాటి వాతావరణానికీ నేటి వాతావరణానికీ చాలా భేదం ఉంది. ఆనాడు యూరప్ రాజ్యాల మధ్య ఐక్యత సంభవమేనా అని ప్రతివారిలోనూ ప్రబల సందేహాలున్నాయి. పూర్వ విరోధాలను మరిచిపోవాలనే కోరిక అందరికీ ఉంది. యూరోపియన్ జాతీయ భావం ఒకటి ఆనాడుకూడా గోచరించింది. కాని ఇది ఆచరణయోగ్యమేనా అనే సందేహాలు ఉండిపోయాయి. కాని నేటి సమావేశ సమయంలో అవి సంభవమేననే విశ్వాసం బలపడింది. ఐక్యయూరప్ ఉద్యమానికి బలమైన పునాది ఏర్పడింది. ఇదివరకే మార్షల్ ఆర్థిక సహాయ ప్రణాళికవలన పశ్చిమ యూరప్ రాజ్యాల ఆర్థిక వ్యవహారాలు ఒకరీతిగా సమరసంగా ఒకే సంస్థచే నిర్వహించబడుతున్నాయి. ఆదేశాల దేశరక్షణ కార్యక్రమాల కొక సంయుక్తసంస్థ అప్పుడే స్థాపితమయింది. ఈనాడు యూరోపియన్ పార్లమెంట్ ఏదో రూపంలో స్థాపించబడబోతున్నది.

ఈ కార్యక్రమం ఇంత చురుగ్గా ఎలా కొనసాగింది? రష్యా దురాక్రమణవలన భయం, కమ్యూనిస్టు కుట్రల భయం ముఖ్యహేతువు లని మొదట అనవచ్చును. అది కొంత కారణం కావచ్చును కాని అదొక్కటే హేతువు కాదు. గత సంవత్సరం పశ్చిమ యూరప్‌లో కమ్యూనిస్టు ముప్పు చల్లబడిపోయింది. ఇటలీ ఎన్నికల్లో కమ్యూనిస్టుల పరాజయం, ఫ్రాన్స్‌లో సమ్మెల వైఫల్యం దీనికి తార్కాణాలు. బ్రిటన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీదేశాలు ఆర్థికంగా స్థిమితపడుతున్నాయి. సాంఘికవ్యవస్థ కోలుకుంటోంది. రష్యా ముప్పు కొంత తగ్గింది. చెకోస్లోవాకియా కమ్యూనిస్టుల పరమైనప్పుడు యూరప్ అంతటా వ్యాపించిన విప్లవభీతి అమెరికా ఆర్థిక సహాయంతో తొలగిపోయింది. భయం ఇంకా ఏకొద్దో లేకపోలేదు. కాని ఆ భయంవల్లనే ఇప్పుడు యూరప్ రాజ్య సమాఖ్య ఒనగూడుతున్నదనడం సత్యంకాదు. యూరప్‌లో ప్రజలకు మరొక యుద్ధంపేరు చెప్పితే చాలు వారికి క్రోధం వస్తున్నది. ఇది తెలిసిన కమ్యూనిస్టులు యూరోపియన్ సమైక్యతా ప్రచారం మరొక యుద్ధంకోసమేనని చెప్తున్నారు.

మిలిటరీ రక్షణ ప్రాధాన్యం గుర్తించవచ్చును గాని, ఆర్థికావసరాలే ఈ ఐక్యతకు ప్రబల హేతువులని చెప్పాలి. పశ్చిమయూరప్‌లో ప్రభుత్వాలు, ప్రజలు ఈ విషయాన్ని స్పష్టంగా గుర్తించారు. మార్షల్ ప్రణాళిక ననుసరించి స్థాపించబడిన యూరోపియన్ ఆర్థిక సహకార సంస్థ ప్రయోజనకారిగా వున్నట్లు గుర్తించారు. ఆ సహకారసంస్థ లేకపోతే మార్షల్ ఆర్థిక సహాయం పశ్చిమయూరప్‌లో ఇంత సులువుగా నిర్వహణసాధ్య మయేదే కాదు. కేవలం అమెరికా ఆర్థికసహాయంవల్లనే యూరోపియన్ దేశాలను రక్షించడం సాధ్యం కాదు. ప్రస్తుత కార్యక్రమా న్ననుసరించికూడా 1952 సంవత్సరంనాటికి ఆ దేశాల ఆర్థికస్థితి చక్కబడదని పై సంస్థ ఋజువుచేసింది. యూరప్‌లోని వివిధ దేశాలమధ్య వాణిజ్యాన్ని పునరుద్ధరించి, ఆ దేశాలలోని వస్తూత్పత్తి కార్యక్రమాలను సహకార విధానంపై నడిపి అనవసరమైన పోటీలు నివారించడానికీ, యూరప్ అమెరికాల మధ్య ఎగుమతి దిగుమతుల్లో డాలర్ల లోపం తీర్చడానికి అధికకృషి అవసరం. డాలర్ల లోపం తీర్చినగాని యూరప్‌లో ఆర్థికజీవనం ప్రజలకు సుఖదాయకం కాదు. ఈ సత్యాన్ని యూరప్‌లో ప్రజలు క్రమక్రమంగా గ్రహిస్తున్నారు.

యూరోపియన్ రాజ్యసమాఖ్యను గురించి అనేకులకు అనేక రకాలైన సందేహాలున్నాయి. బ్రిటన్‌కు డొమినియన్ల అనుబంధం ఉంది. డొమినియన్లతో వ్యవహారాలు బెడిసిపోకుండా యూరోపియన్ సమాఖ్యలో బ్రిటన్ చేరగలదా? బెడిసిపోకుండా ఉండాలంటే యూరోపియన్ సమాఖ్య ఏ రీతిగా నిర్మించబడాలి? బ్రిటన్ ఈ విషయమై గట్టిగా ఆలోచించుకోవాలి. బ్రిటన్ లేని యూరోపియన్ సమాఖ్య నిరర్థకం.

యూరప్‌లో దేశాలమధ్య వాణిజ్యనిర్బంధాలన్నీ తొలగే పక్షంలో అక్కడి ప్రజల ఆర్థిక జీవనంలో ఎట్టి మార్పులు కలుగుతాయి. వేతన ప్రమాణా లే రీతిగా మారతాయి? పశ్చిమ యూరప్ దేశా లన్నిటి మధ్యనూ రవాణా నిర్బంధాలు తొలగించే పక్షంలో జీవనోపాధికై జనం ఒక దేశంనుంచి మరొక దేశానికి వెళ్లి స్థిర నివాసా లేర్పరచుకుంటారు. అన్ని దేశాలలోనూ ఆర్థిక స్థితి ఒకే రీతిని సమన్వయమవుతాయి. ఉన్నతస్థితిలో ఉన్న దేశాలలో కొంత ఆర్థిక హైన్యత, హీనస్థితిలోఉన్న దేశాలలో కొంత ఆర్థికోన్నతి రావచ్చును. లేదా అమెరికాలో వలెనే వ్యత్యాసాలు నిలిచిపోవచ్చును. వివిధ దేశాల ఆర్థిక కార్యక్రమాల్ని యూరప్ ఐక్యతకు అనుగుణంగా సంస్కరించవలసి ఉంటుంది. సహకారపద్ధతిని కొత్త కార్యక్రమాన్ని అనుసరించవలసి ఉంటుంది. పశ్చిమయూరప్ రాజ్యాలలోని ప్రజాస్వామ్యవిధానాలు ఇట్టి కార్యక్రమానికి అనువుగానే ఉండవచ్చును. ఏదేశంలోనూ వర్తకవాణిజ్యాలలో ప్రభుత్వప్రమేయం కొద్దో గొప్పో లేకపోలేదు. అయినా ఏదో కొంత వ్యాపార స్వాతంత్ర్యం ఉండనేఉంది. ఉభయమార్గాలకు మధ్యే మార్గం ఒకటి ఇట్టి సమాఖ్యలో అనుసరించవలసి ఉంటుంది. అయితే ఇదంతా సాధ్యం కావడానికి కాలం పట్టుతుంది.

యూరప్ సమైక్యతకు కారణభూతమైనవి ఆర్థికావసరాలు మాత్రమేనని కూడా చెప్పజాలం. వీనితోపాటు ముఖ్యమైనవి రాజకీయాశయాలు రెండున్నాయి. మొదటిది ఎలాగైనా సరే పశ్చిమయూరప్‌లో శాంతి స్థాపించాలనే పట్టుదల. అంటే జర్మన్ సమస్యకు శాశ్వతమైన పరిష్కారం కనిపెట్టడం. జర్మనీని శాశ్వతంగా మిత్రరాజ్య సైన్యాలు ఆక్రమించుకొనైనా ఉండాలి, లేదా యూరప్ సమాఖ్య నేర్పరచి జర్మనీని అందులో చేర్చాలి. ఎటూ కాని పక్షంలో తిరిగి జర్మనీ దురాక్రమణకు తయారవడం తథ్యం. ఇది రూర్ పరిశ్రమకోసం చెప్తున్నమాట కాదు. వాస్తవానికి యూరప్ ఆర్థిక వ్యవస్థలో రూర్ ప్రాంతంలోని బొగ్గు, ఉక్కు, రసాయనికపు ఎరువుల పరిశ్రమలు అత్యంతప్రధానమైనవి. అయినా ఇది ప్రపంచశాంతికీ, సంగ్రామానికీ సంబంధించిన సమస్య. జర్మనీ తిరిగి యుద్ధం ప్రేరేపించకుండా ఉంటుందా? ఈ ప్రశ్నకి ఎవరూ సమాధానం ఇవ్వలేరు. జర్మన్లు కూడా సమాధానం ఇవ్వలేరు. తిరిగి ఇప్పుడు జర్మనీలో జాతీయోద్యమనినాదాలు వినపడుతున్నాయి. అయితే ఈ జాతీయోద్యమానికీ 30 ఏళ్ల పూర్వపు ఉద్యమానికీ తేడా ఉంది, యుద్ధకాలంనాటి బీభత్స దృశ్యాలు ఇంకా ఈనాడు జర్మన్ల మనోవీథిలో వికటతాండవం చేస్తున్నాయి.

ముఖ్యంగా జర్మన్ స్త్రీలోకంలో యుద్ధభయం ప్రబలంగా ఉంది. ఈనాడు జర్మనీలో స్త్రీల సంఖ్య పురుషుల సంఖ్యకంటె అత్యధికంగా ఉంది. అందువల్ల జర్మన్ జాతీయ శక్తులు ఇప్పుడు యుద్ధంమాట తలపెట్టలేవు. ఇదీగాక జర్మనీకి ఇప్పుడు రెండువైపులా పెద్ద సమస్యల నెదుర్కొనవలసి వస్తున్నది. తూర్పు జర్మనీలో కమ్యూనిస్టు ముప్పుకు భీతిచెందుతున్నవారు పశ్చిమయూరప్‌వంక ఆశతో నిరీక్షిస్తున్నారు. రెండు ప్రపంచ సంగ్రామాల మధ్యనూ పోలండ్ ఇటువంటి సమస్యనే ఎదుర్కొనవలసి వచ్చింది. ఉభయపక్షాలలో దేని నవలంబించినా ధ్వంసం తప్పదు. పశ్చిమదేశాలలో జర్మనీకి ఎన్నడూ పొత్తు కుదరకపోయినా స్లావ్ వర్గంకంటె ఈ వర్గమే వారికి నచ్చుతుంది. కాని జర్మనీవైఖరి ఇతర పశ్చిమదేశాల వైఖరిని బట్టే నిర్ణయమౌతుంది. యూరప్ సమైక్యతా భావంలో చర్చిల్ ప్రకటించిన విశ్వాసంవల్ల, జర్మనీలోని దుష్టశక్తుల నెదిరించి పోరాడుతున్న వారికి ప్రోత్సాహం కలుగుతుంది. వారు నియోనాజీల జాతీయ ప్రచారాన్నీ కమ్యూనిస్టుల ప్రచారాన్నీ ప్రతిఘటిస్తున్నారు. జర్మనీ దేశాన్ని యూరప్ సమాఖ్యలో చేర్చాలని వారి అభిలాష. వారి కోరికల్ని మన్నించడం పశ్చిమ దేశాల విధ్యుక్త ధర్మం.

పశ్చిమ యూరప్‌లోని కమ్యూనిస్టు వ్యతిరేక పక్షాలన్నీ ఇటీవల సమావేశం జరిపినప్పుడు ఈ క్రింది తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు "పశ్చిమయూరప్‌లోని భారీపరిశ్రమ లన్నిటినీ సహకారవిధానంపై వృద్ధిపరిచి నిర్వహించడం అవసరం. అట్టి సమగ్రవృద్ధిపైనే యూరప్ సమాఖ్య బాగోగులు ఆధారపడిఉంటాయి. ఈ దృష్టితో చూస్తే రూర్ శాసనవిధానాన్ని తాత్కాలికమైనదిగా కాక, శాశ్వతంగా స్థాపించి, పశ్చిమ యూరప్‌లో అట్టి సహకార సంస్థల్ని స్థాపించడానికి కృషి చేయాలి." ఇటువంటి తీర్మానం పదిమాసాల క్రితమైతే ఆమోదించబడేది కాదు. ఇప్పుడు ఆమోదించబడిందంటే, పశ్చిమ యూరప్ దేశాలమధ్య విరోధాలు సమసిపోయినాయన్నమాట. ఈ విరోధాల్ని తిరిగి రెచ్చగొట్టగలవారు జర్మన్లు మాత్రమే. వారైనా యూరప్ సమాఖ్యలో చేరినట్లయితే ఆ అవకాశంకూడా ఉండదు. దీనితో శాశ్వతంగా పశ్చిమయూరప్‌లో శాంతి స్థాపించబడినట్లే.

పశ్చిమయూరప్‌లో శాంతిసాధన కాక, యూరప్ రాజ్య సమైక్యతకు మరొక రాజకీయాశయంకూడా ఉంది. ఆర్థికంగా కోలుకోవడంతో యూరప్ దేశాలలో తిరిగి ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవం పాతుకుంటున్నాయి. యూరప్ ఆర్థిక

(16-వ పేజీ చూడుడు)



అమెరికా అధ్యక్షుడు, మంత్రివర్గం: ఈ చిత్రం ఫిబ్రవరి 11 వ తేదీని తీయబడింది.

జర్మనీలో నాజీలకు తిరిగి మంచిరోజు లొచ్చాయి

జర్మనీలో నాజీలు తిరిగి తలెత్తుతున్నారని న్యూయార్కు నేషన్‌పత్రికలో 'కెరోలస్' అనే వ్యాసకర్త వ్రాస్తున్నాడు. ఇప్పుడు నాజీల ముఖ్యకేంద్రం ఫ్రాంక్‌ఫర్ట్. గెటేపూర్వం చెప్పిన వాక్యాలు తిరిగి 1949 లో సార్థక మౌతున్నాయి. గెటే 1749 ఆగస్టు 28వ తేదిని జన్మించాడు. అప్పటి కింకా జర్మనీరాజ్యమే స్థాపనకాలేదు. ఆనాడు 365 స్వతంత్ర రిపబ్లిక్‌లలో ఫ్రాంక్‌ఫర్ట్ ఒకటి. 1792 లో ప్రష్యన్ ఆస్ట్రియన్ సైన్యాలు ఫ్రాన్స్‌పై దండయాత్రకు వెడుతుండగా గెటే ఆసైన్యంతో కూడా పత్రికావిలేఖరిగా వెళ్లాడు. ఫ్రెంచి కర్షకులకు తుపాకులు చేత పట్టడం చేతగాక పోయినా దాడి సైన్యాల నెదిరించి ఓడించాయి. ప్రష్యన్ సైన్యాలు వెనుతిరిగి రైన్‌నది దాటి కాలికి బుద్ధిచెప్పాయి. దీనితో "చరిత్రలో నూతన యుగం ప్రారంభమయిం"దని గెటే తనడైరీలో వ్రాశాడు.

ఆనాటికి జర్మనీ అనే ప్రత్యేకరాజ్యం లేదు. ప్రజలో జర్మన్ జాతీయభావం లేదు. అప్పటి కింకా ఫ్రాంక్‌ఫర్ట్‌లో పట్టాభిషేకం పొందుతున్న "పవిత్రరోమన్ సామ్రాజ్యచక్రవర్తులే" పరిపాలిస్తూ ఉండేవారు. 1848 లో బూర్జువా విప్లవ సమయంలో ఈనగరంలోనే పార్లమెంట్ ఉండేది. జర్మనీ దేశ సమైక్యతకోసం ఈ పార్లమెంట్ కృషిచేసేది. కాని ప్రష్యన్ సైనికుల వాత బడి పార్లమెంట్ భగ్నమైపోయింది. ఫ్రాంక్‌ఫర్ట్ నగరాన్ని "ప్రజాస్వామ్యవాదుల రక్షణగృహం" అన్నాడు బిస్మార్క్.

1866 లో ప్రష్యన్లవాత బడి ధ్వంసమయిందీనగరం. అయిదు సంవత్సరాల అనంతరం ఫ్రాన్స్ ఓడిపోయి, ప్రష్యన్ - జర్మన్ రీచ్ ప్రభుత్వానికి ఆల్సేస్ లోరేన్ ప్రాంతాన్ని ఒప్పగిస్తూ సంధి చేసుకున్న దీ నగరంలోనే. ఆనాటినుండీ జర్మన్ రాజకీయ ప్రాబల్యం ఉన్నతికొచ్చింది. గెటే జన్మస్థానం ప్రాధాన్యం వహించింది. క్రమంగా పెద్దదయింది. హిట్లర్ పరిపాలనలో నగరం మరింత వృద్ధిపొందింది. ప్రపంచంలోకల్ల పెద్దదైన రసాయనిక వస్తూత్పత్తి పరిశ్రమ, ఐ. జి. ఫార్బెన్ సంస్థ ఇక్కడ స్థాపించబడింది. జర్మన్ యుద్ధసామగ్రి ఉత్పత్తి కిది ముఖ్యకేంద్ర మయింది. ఫార్బెన్ భవనం యుద్ధంలో చెక్కుచెదరలేదు. ఈ భవనం పైనే జనరల్ ఐసెన్‌హోవర్ అమెరికన్ పతాక ప్రతిష్ఠించాడు. ఈనాటికీ ఆ భవనం అమెరికన్ సైనిక ప్రభుత్వ కార్యాలయంగా ఉంది. పశ్చిమ జర్మన్ ప్రభుత్వాల కేంద్ర కార్యాలయంగాకూడా ఉంది.

యుద్ధకాలంలో గెటేగృహం కూలిపోయింది. అప్పటికే జర్మన్ రాజకీయ ప్రాబల్యం విదీర్ణమైపోయింది. అప్పటికే బుచెన్‌వార్డ్ శిబిరాలలో మానవక్షోభలో జర్మన్ సభ్యత ఆహుతైపోయింది.

తిరిగి గెటే చెప్పినకాలం వచ్చింది. గెటే గృహం తిరిగి నిర్మించబడగలదు. ఇప్పుడు కొత్త హోటళ్లు, సినిమా మందిరాలు, వినోదగృహాలు, ఆధునిక వస్తువిక్రయ గృహాలు ఉన్నాయి. ఇప్పుడు తిరిగి వాణిజ్యాది వ్యవహారాలు వృద్ధి చెందుతున్నాయి. ఇతర జర్మన్ నగరాలవలెనే ఇక్కడ కూడా జనసమూహం చేరింది. వ్యాపార మాంద్యం ఉన్నచోటల్లె తిరిగి వ్యాపారం చకచకా సాగుతోంది. ఇదివరలో ముక్కలూ చితుకులూ అమ్మేచోట్ల ఇప్పుడు సర్వవిధవస్తువులతో శోభయమానంగా అలంకరించబడిన పెద్దపెద్ద షాపులు వెలిశాయి. ద్రవ్యసంస్కరణతోనూ, మార్షల్ ఆర్థికసహాయ కార్యక్రమంవల్లనూ ఇప్పుడు దేశంలో తిరిగి వస్తువులు అమ్మకానికి వచ్చాయి. చాటుగా దాచబడిన వస్తువులన్నీ పైకి అమ్మకానికి వచ్చాయి. దేశంలో వస్తూత్పత్తి పెరిగింది. ఇప్పుడు ధనం వెచ్చిస్తే వస్తువులు దొరుకుతున్నాయి. ఇప్పుడు తిరిగి వృత్తి చేసుకుని ఆర్జిస్తే జీవనం గడుస్తుంది. బ్రిటిష్ వస్త్రాలు, అమెరికన్ ప్లాస్టిక్ దువ్వెన్నలు, సబ్బులు, కూరగాయలు, డచ్చి ఫలాలు, ఇటాలియన్ ఫలాలు, ఇటాలియన్ పింగాణీ వస్తువులు, ఫ్రెంచి అత్తర్లు, సిగరెట్లు మద్యాలు దొరుకుతున్నాయి.

కాని ఈ తళతళకీ, ఈ సంపదకీ లోపలేముంది ? ఏనగరం చూసినా ఎక్కడ పడితే అక్కడ, దేనికి కావలసివస్తే దానికి లంచగొండితనం, లాభాశ దురాశ గోచరిస్తున్నాయి. పరిస్థితి దుర్భరంగానే ఉంది. దేశంలోకి ఇన్ని వస్తువులు వచ్చాయి. ఇన్ని విలాసావకాశాలు వచ్చాయి. వీనిని అనుభవించేది. ఎవరు ? కొద్దిమంది ధనవంతులుమాత్రమే. అయితే ఆ కొద్దిమంది ధనవంతులూ వీనిని కొనవలసిన అవసరం లేదు. షాపులు వారివే. జనం వచ్చి నేత్రానందంగా గాజుతలుపుల వెనుక నున్న వస్తుసామగ్రిని చూస్తారు కాని కొనలేరు. జనసామాన్యానికి ఆహారం కొనుక్కోగా వేతనంగా మిగిలేది చిల్లరే. చెప్పులుకాని, దుస్తులుకాని కొనలేరు. యుద్ధంలో ధ్వంసమైన నగరాల్లో తిరిగి కొత్త ఇళ్లు చాలా నిర్మిస్తున్న మాట నిజమే. కాని సామాన్యజనం బాంబులనుంచి రక్షించుకోడానికి ప్రభుత్వం కట్టిన కట్టడాలకింద నివసిస్తారు. ఉన్నపూరి కొంపల్లో గదికి నలుగురైదుగురు చొప్పున నివసిస్తారు.

ధనం కలవారే కొనగలరు. ధనం కలవారే గృహాలు నిర్మించగలరు. అయితే ధనం ఎవరివద్ద ఉంది ? రైతులవద్ద ఉంది. వారు పండించిన పంటలోవీసమైనా సవ్యంగా వర్తకులకు అమ్మరు. విపరీతమైన ధరలకి బ్లాక్‌మార్కెట్‌లో అమ్ముతున్నారు. అందువల్లనే ఈనాడు షాపుల్లోనూ, హోటళ్లలోనూ, రహస్యస్థలాల్లోనూ రేషన్ కూపన్లు లేకుండా కావాలంటే దొరకని వస్తువు లేదు. అయితే ధరలు అపరిమితం. వీరే నాజీ పరిపాలనలో ధనవంతులైనారు. యుద్ధసామగ్రి తయారైనకాలంలో వీరే అపారంగా ధనం ఆర్జించారు. యుద్ధకాలంలో ధరల పెరుగుదలవల్లనూ, యుద్ధానంతరం కరువుపరిస్థితుల్లోనూ లాభాలార్జించింది వీరే. హిట్లర్ పరిపాలనలోనూ, తరువాత జర్మన్ ఆక్రమిత దేశాలలోనూ ధనం ఆర్జించినది వీరే. యుద్ధంలో ఎందరు నశించినా, వీరి స్థితికి లోపం రాలేదు. ఈనాడు నాజీతత్వ నిర్మూలన విధానంకూడా వీరి నంటలేదు. నాజీ పార్టీకి ప్రాపుగా ఉన్నది వీరే. నాజీ పరిపాలన కాలంలో దేశ ఆర్థిక జీవనాన్ని వీరే నిరాఘాటంగా పరిపాలించారు. తిరిగి ఈనాడు పరిపాలిస్తున్నారు. నాజీ నిరంకుశపాలనలో నిర్బంధ శిబిరాలలో శల్యావశిష్టులై రోజులు గడిపినవారీనాడుకూడా ఆర్థికదుస్థితిలో అల్లాడిపోతున్నారు. నాజీ నిరంకుశత్వాన్నెదిరించి ఆస్తిపాస్తులు కోల్పోయి, నానాహింసలకు లోనైనవారిప్పుడేమి చేస్తున్నారు. తమకు జరుగుతున్న అన్యాయానికి, వంచనకి నిస్పృహ చెంది ఉపన్యాసాలిచ్చి ఘోషిస్తున్నారు. కాని వారి గతి చూసినవారేరీ ? వారు దుర్భరదారిద్ర్యంలో నలిగిపోతున్నారు. నాజీలనుంచి ముక్తి పొందడానికి దీర్ఘకాలం నిరీక్షించి, ఇప్పుడు ఆశాభంగం పొందారు. తూర్పుజర్మనీ నుంచి పారిపోయివచ్చిన 70 లక్షలమంది జర్మన్ల గతికూడా ఈ రీతిగానే ఉంది. జర్మనీలో 1949 లో ఈ క్రింది సామెత ప్రజల్లో అనుశ్రుత మయింది. "నీ బతుకు నువ్వు బతకాలంటే నాజీఅయుండాలి."

బ్రిటిష్ ఆక్రమిత ప్రాంతంలోని ష్లీస్విగ్-హోల్‌స్టీన్ రాష్ట్రంలోమాత్రం సోషల్ డెమోక్రటిక్ పార్టీకి పరపతి ఉంది. అయితే ఈ రాష్ట్రంలో కూడా ఈనాడు న్యాయమూర్తులలో నూరింట 91 మంది. నాజీలే. అమెరికన్ ఆక్రమిత ప్రాంతంలో పరిపాలన నిర్వహించే వారిలో నూరింట 60 వంతులు నాజీలున్నారు. తిరిగి నాజీలకు మంచిరోజులొచ్చినట్లున్నాయి. ఈరీతిగానేకదా వీమార్ రిపబ్లిక్ తన గొయ్యి తానే తవ్వుకున్నది. విశ్వవిద్యాలయాలు చూస్తే, అక్కడ కూడా అధ్యాపకుల్లోనూ, విద్యార్థుల్లోనూ నూరింట 90 మంది నాజీలే.

గతానుభవంవల్ల జర్మన్లు కొత్తగా నేర్చినదేమీ లేదు. వారు మరిచిపోయిన దంతకంటే లేదు. కాని ఈ మాటలే సైనికాక్రమణాధికారులను గురించి కూడా చెప్పవచ్చును. జర్మన్ పోలీసు దళాలనిండా హిట్లర్ సైనికు లున్నారు.

ఒక సోషల్ డెమోక్రటిక్ పోలీసు అధికారి అన్నాడు: "మేము ఫలానాపార్టీకి చెందినట్లు చెప్పుకోడానికి కూడా ఇప్పుడు ధైర్యం చాలడంలేదు. ఏదో మిషపెట్టి పోలీసు పరిశ్రమల్లో మమ్మల్ని తోసివేస్తారు." దేశం అంతటా ఇదే పరిస్థితి. సోషలిస్టుడెమోక్రాట్లు అధికారంలో ఉన్నచోట తెల్లవారి చుట్టూ నాజీలే ఉద్యోగాల్లో ఉంటాడు. జాతీయోద్యమం తిరిగి తీవ్రంగా జరుగుతుంది.

అమెరికన్ సైనికాధికారుల అనుమతిపై ప్రచురించబడుతున్న సోషల్ డెమోక్రటిక్ పత్రికలో ఆ పార్టీ కార్యదర్శి పార్టీ సభ్యులకు నూత్న సంవత్సర సందేశ మిస్తూ ఈక్రిందిరీతిగా వ్రాశాడు

"తిరిగి యస్. యస్. దళసభ్యులు (నాజీ పోలీసుదళసభ్యులు) బహిరంగంగానే మన పార్టీ సభ్యుల్ని కొట్టగలిగిన పరిస్థితులు తిరిగి ఏర్పడ్డాయి. వారా విషయమై గర్వంగా చెప్పుకుంటున్నారుకూడా. బాండ్లు తిరిగి నాజీ జాతీయగీతాలు వాయిస్తున్నాయి. అనేక ప్రాంతాలనుంచి నాజీల దౌర్జన్యాలను గురించిన వార్తలు వస్తున్నాయి. అటువంటి వారి ఉద్యమాల్ని ఆక్రమణసైన్యాధికారులు చూస్తూ ఊరుకుంటున్నారు. అనేక చోట్ల నాజీలు, పూర్వజర్మన్ సైనికాధికారులు పురపాలక సంస్థల్లో ప్రాబల్యం స్థాపించుకున్నారు.

"సాంఘిక జీవనంలో, కూలివల్ల, వృత్తివల్ల జీవనోపాధి ఆర్జించుకునేవారు దురాశాపరులు, గొప్పిడివర్తకుల దురన్యాయాలకు లోనౌతున్నారు. అన్యాయ వ్యాపారంవల్ల కొందరు ఇట్టే కోటీశ్వరులౌతున్నారు. ఇదివరలో జనసామాన్యాన్ని పీడించి ధనార్జన చేసినవారే తిరిగి ఇప్పుడు బహిరంగంగా తమ వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇప్పుడు వారి వ్యాపారం మరింత లాభదాయకంగా ఉంది.

పరిశ్రమ చేసి జీవించేవారికి పూర్తిఫలం దక్కకుండా చెయ్యాలని వారు పన్నాగాలు పన్నుతున్నారు. ఆర్థిక పునర్నిర్మాణం సక్రమంగా నిర్వహించడం వారి కిష్టంలేదు. దానివల్ల వారి లాభాలు తగ్గుతాయి. 1933 లోనూ, 1945 లోనూ ఇప్పుడూ పరిస్థితులు గమనిస్తే మార్పు లేమీ లేనట్లే కనిపిస్తోంది. ఈనాడు జర్మనీలో ప్రజాస్వామ్య విరోధులే తిరిగి పరిశ్రమల్లోనూ, ప్రభుత్వంలోనూ చేరి దేశాన్ని నడుపుతున్నారు. ఈ విషయం చెప్తే అన్యదేశాలవారికి ఇప్పుడు అర్థం చేసుకోవడం కష్టం కావచ్చును. ఈ పరిస్థితికి మూలం ప్రజాస్వామ్యవాదులని చెప్పుకొంటున్నవారు తమ దౌర్బల్యాన్ని గ్రహించలేక దాక్షిణ్యం, సహనం అనే మాటలు చెప్పి నాజీలకు తావిస్తున్నారు. ఇటువంటి పరిస్థితు లేర్పడినాయంటే, బ్రిటిష్ అమెరికన్ ఆక్రమణాధికారుల బాధ్యత కూడా కొంత ఉంది."

ఈ వాక్యాలు చాలు; పరిస్థితి విస్పష్టపరచడాని కింకా వివరాలు అనవసరం. అన్ని రాష్ట్రాల్లోకీ బవేరియా నాజీలకు బలమైన స్థావరమయింది.

జర్మనీలో నాజీలకు తిరిగి మంచిరోజులొచ్చాయి. ప్రజల్లో చాలామంది కిది ఇష్టం లేదు: కాని వారు నిస్సహాయంగా చూస్తూ ఊరుకోవడంకన్న చేయగలిగిన దేమీ లేదు.

జర్మనీలో పరిస్థితిని పరిశీలించడానికి 'టైమ్' పత్రికా విలేఖరి దేశం పర్యటనచేసి, పరిస్థితి అయోమయంగా ఉందని వ్రాశాడు. జర్మన్ రాజకీయాలు, వ్యాపారంమొదలైనవన్నీ రహస్యంగా జరుగుతున్నాయి. ఒక జర్మన్ దేశీయుడు టైమ్ పత్రికావిలేఖరితో ఇలా చెప్పాడట.

"ఇదంతా అయోమయంగానే ఉంది. మూడు సంవత్సరాలక్రితం నేను రష్యను విమర్శించి ఉంటే, అమెరికన్లు నన్ను నాజీకింద జమ కట్టేవారు. ఇప్పుడు అవిమర్శ గట్టిగా చెయ్యకపోతే నన్నిప్పుడు కమ్యూనిస్టుకింద జమకడతారు. మాదేశం భవిష్యత్తుగురించి ఇక్కడ ప్రజలు అసంతైనా ఆలోచించడం లేదన్న సంగతి నాకు తెలుసును. కాని ఎరెన్ ఫాక్టరిలని ఉంచుతారో ఊడతీస్తారో ఎటూ తెలియక నిరీక్షించే 30 వేల కార్మికులు దేశ భవిష్యత్తును గురించి ఏ మాలోచించగలరు ? చిన్న చిన్న చేపలబోట్లు తప్ప నౌకలు నిర్మించరాదని జర్మనీపైనిషేధం ఉండగా హాంబర్గ్ నౌకానిర్మాణ కార్మికు లేమి యోచించగలరు ? వచ్చే ప్రపంచయుద్ధంలో మొట్టమొదటి యుద్ధరంగం కాగల దేశంలో ఉండి ప్రజ లేం ఆలోచించగలరు ?"

ఈ అయోమయానికి ఆనందించేది కమ్యూనిస్టులొక్కరే. ఈ అయోమయంలో కార్ల్ రాడెక్ మాటలు స్ఫురణకొస్తున్నాయి. ప్రథమ ప్రపంచ సంగ్రామానంతరం జర్మనీలో కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఖ్యాతి కెక్కాడు. రాడెక్. నేషనల్ బోల్షెవిజం అనే మాటను సృష్టించాడితను. జాతీయోద్యమం ద్వారా కూడా కమ్యూనిస్టు పార్టీలు ఆశయసిద్ధికి కృషిచేయవచ్చని సిద్ధాంతీకరించాడు. మాస్కో ఇతన్ని పార్టీవిద్రోహానికి శిక్షించినా, చివరికి ఇతని సిద్ధాంతమే ఇప్పుడు కమ్యూనిస్టుల కుపయోగపడుతోంది. ఐక్యజర్మనీ రాజ్యస్థాపనకు కమ్యూనిస్టు లాందోళన చేస్తున్నారు. ప్రజల్లో జాతీయభావోద్దీపనకు ప్రచారం తీవ్రంగా చేస్తున్నారు. పశ్చిమజర్మనీ ప్రభుత్వస్థాపనను ప్రతిఘటిస్తున్నారు. ఇప్పుడు పశ్చిమ జర్మనీలో ప్రజలు కమ్యూనిస్టుపార్టీకి విరోధులైనప్పటికీ, జర్మనీని పశ్చిమ తూర్పు జర్మనీలుగా విభజించకూడదని పట్టుదలగా ఉన్నారు. జర్మనీఐక్యతను సాధించగలరని కమ్యూనిస్టులు ప్రజలకు వాగ్దాన మిస్తున్నారు. జర్మనీ కంతకీ ఒకే ప్రభుత్వం స్థాపించే పక్షంలో రష్యన్లని ఒప్పించి తూర్పుజర్మనీని పశ్చిమజర్మనీతో చేర్చగలరని కమ్యూనిస్టులు చెప్తున్నారు. ఐక్యజర్మనీ నినాదాన్ని కమ్యూనిస్టులు రెచ్చగొట్టారు. క్రిస్టియన్ డెమోక్రటిక్ పార్టీ మొదలైనవి వారికి సహాయపడ్డానికి సిద్ధమౌతున్నారు. ఇప్పుడు జర్మన్ యూనియన్ పార్టీ ఒకటి స్థాపించబడింది. వీరు జర్మనీనుంచి పరాయిరాజ్యాల సైన్యాలన్నీ తొలగిపోవాలనీ, రష్యాతో 50 సంవత్సరాల వర్తకపు టొడంబడిక చేసుకోవాలనీ ఆందోళన చేస్తున్నారు. వీరికి కమ్యూనిజం అక్కరలేదు. కాని ఐక్యజర్మనీ స్థాపన కావాలి. దానికిగాను రష్యాతో మైత్రి కోరుతున్నారు. దీనివల్ల జర్మనీ తిరిగి కోలుకోగలదని వీరి విశ్వాసం.

సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాయకుడు షూమేకర్ ప్రస్తుత పరిస్థితిని గురించి ఈ క్రింది విధంగా చెప్పాడు. "బిస్మార్కు కాలంనుంచీ జర్మనీలోని జాతీయవాదులు రష్యా మైత్రినే కోరుతూవచ్చారు. తిరిగి ఈనాడు నేషనల్ బోల్షెవిజం దేశంలో వ్యాపిస్తోంది. మితవాదపక్షాలు తిరిగి పాతతంత్రాలకే మొగ్గుతున్నాయి సోవియట్ గూఢచారిదళాలుకూడా చురుగ్గా పనిచేస్తున్నాయి. "పరాజయం పొంది ఆత్మగౌరవహాని పొందిన సైనిక నాయకులకూ, పారిశ్రామికులకూ "మీకు మంచిరోజులు తిరిగి వస్తాయి. మాతో మైత్రి చెయ్యగలరోజులొస్తాయి"అని వారు చెపుతున్నారు. అందువల్లనే నిన్నగాక మొన్న హంగేరి క్రైస్తవ మతాచార్యుని శిక్షకు కన్నీరొలికించిన క్రిస్టియన్ డెమోక్రాట్లు కమ్యూనిస్టుల్తో, పొత్తు కలుపుతున్నారు."

షుమేకర్ అనుచరుడైన కార్ల్ స్మిత్ ఇలా అన్నాడు: "యూరప్ భవిష్యత్తు అంతా జర్మన్ కార్మిక జనంపైనే ఆధారపడి ఉంది వారే కాని కమ్యూనిజం వైపు మొగ్గారంటే, ఇంక ఫ్రెంచికార్మికులమాట చెప్పనక్కరలేదు. అట్లాంటిక్ ప్యాక్టులన్నీ గంగను కలిసినట్లే. ఇంక స్టాలిన్ ఎవరి సహాయం కోరనక్కరలేకుండానే యూరప్ అంతటా బోల్షివిజం వ్యాపించిపోతుంది."

నేటి ప్రపంచం

★ పశ్చిమ యూరోపియన్ పార్లమెంట్

★ బెర్లిన్ దిగ్బంధంతొలగింపు, రష్యా ఎత్తులు

★ ఇండొనీషియాసమస్యపై సమాధానం

పశ్చిమ యూరప్ రాజ్యాలు పది చేరి "యూరోపియన్ కౌన్సిల్" స్థాపించడానికి నిర్ణయించాయి. పదిరాజ్యాలనుంచీ ఒక్కొక్క మంత్రి చొప్పున ఈ కౌన్సిల్ నిర్మించబడుతుంది. ఈ "యూరోపియన్ మంత్రివర్గానికి" తోడు ఒక "యూరోపియన్ పార్లమెంటు" కూడా స్థాపించడానికి నిర్ణయమైంది. ఈ పార్లమెంటుకు సభ్యులుగా, ఆయా ప్రభుత్వాలు, వారివారి పార్లమెంట్లు సభ్యులనుంచి ఎంచి నియమిస్తారు. పార్లమెంటులలోని వివిధపక్షాలకు ప్రాతినిధ్యం ఇవ్వగలరు.

యూరోపియన్ కౌన్సిల్ను పార్లమెంటునూ స్థాపించడానికి ఈ వారంలో లండన్లో పది దేశాల విదేశాంగమంత్రులూ ఒడంబడికపై సంతకం చేశారు. ఆ దేశాలు బ్రిటన్, ఫ్రాన్సు, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గ్, ఇటలీ, నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఐర్. కౌన్సిల్ ఆగస్టులో స్ట్రాస్‌బర్గ్‌లో (ఫ్రాన్సు) ప్రథమ సమావేశం జరుపుతుంది. పార్లమెంటులో 87 మంది సభ్యు లుంటారు. సభ్యత్వం వివిధ దేశాల మధ్య ఈ క్రిందిరీతిగా విభజించబడుతుంది: బ్రిటన్ 18, ఫ్రాన్సు 18, బెల్జియం 6, హాలెండ్ 6, లగ్జెంబర్గ్ 3, డెన్మార్క్ 4, నార్వే 4, స్వీడన్ 6, ఐర్ 4, ఇటలీ 18.

మంత్రుల కౌన్సిల్‌కు నిర్వహణాధికారాలు గాని, పార్లమెంట్‌కు శాసనాధికారాలుగాని ఉండవు. మంత్రుల కౌన్సిల్ యూరోపియన్ రాజ్యాలకు సంబంధించిన సమిష్టి విషయాలను చర్చించగలదు. పార్లమెంటు సలహా లిస్తుంది. వీనిపై కౌన్సిల్ నిర్ణయాలు చేసి ఆయా ప్రభుత్వాలకు సూచనలు చేస్తుంది. మంత్రుల కౌన్సిల్‌లో ఏ నిర్ణయమైనా జరగాలంటే ఏకగ్రీవామోదం ఉండాలి. లేకపోతే నిర్ణయం జరగనట్లే. పార్లమెంట్‌లో నివేదికలు, సలహాలు మూడింట రెండువంతులమంది సభ్యుల ఆమోదం పొందాలి.

దేశరక్షణ సైనిక విషయాలను ఆలోచించి చర్చించే హక్కు పార్లమెంటుకు గాని కౌన్సిల్‌కుగాని లేదు. ఆర్థిక విషయాలు చర్చించవలసిన అవసరం కూడా ఉండదు. మార్షల్ ఆర్థిక ప్రణాళిక అమలు జరపడానికిగాను వివిధ యూరోపియన్ దేశాలమధ్య సహకారం సాధించడానికి ఇదివరకే యూరోపియన్ ఆర్థిక వ్యవహార సహకార సంస్థ ఒకటి (ఒ.ఇ.ఇ.సి.) ఆయా దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో స్థాపించబడింది.

యూరప్ దేశాల సమిష్టి ఆర్థిక సాంఘిక పురోభివృద్ధికిగాను ఈ పార్లమెంటు స్థాపించబడిం దని బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ అన్నాడు. ఇది యూరప్ చరిత్రలో అపూర్వఘట్ట మని రాజకీయవేత్త లన్నారు. యూరప్ రాజ్యాల సమాఖ్య స్థాపించాలని ఇదివరలో కలలుగన్న మహామహుల ఈప్సితం ఈ డేరుతున్న దన్నారు. ప్రపంచ వ్యవహారాలలో అమెరికా ఆసియా దేశాల ప్రాధాన్యం, ప్రాబల్యం వృద్ధిచెంది, యూరప్ వెనుకబడుతున్నందువల్ల పోయిన ప్రతిష్ఠ కాపాడుకోడానికిగాను యూరోపియన్ "గాపజాస్వామ్య" ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయి. రెండు ప్రపంచయుద్ధాల్లో ఆర్థికం "గానూ సాంఘికంగానూ సర్వనాశనమైన యూరప్ రాజ్యాలకు అమెరికా దాక్షిణ్యం అవసరమయింది. అమెరికా ఆర్థికసహాయంవల్ల తిరిగి కాలూనుకుంటున్న ఈదేశాలు ప్రపంచవ్యవహారాల్లో తాము కోల్పోయిన ప్రతిపత్తిని స్థాపించుకోవా లని ప్రయత్నిస్తున్నాయి.

యూరోపియన్ సమాఖ్య స్థాపించడానికి నేడు జరుగుతున్న కృషికి మరొక ప్రబలకారణం ఉంది. రెండు ప్రపంచయుద్ధాలకు కారకులైన జర్మన్ జాతీయవాదుల్ని, జర్మన్ పారిశ్రామిక వాదుల్ని తిరిగి తలెత్తకుండా చెయ్యాలి. ప్రథమప్రపంచ సంగ్రామానంతరం జర్మనీలో జాతీయపక్షాలకూ కమ్యూనిస్టులకూ మధ్య సంఘర్షణ వచ్చింది. సామ్యవాదప్రజాసామ్యవాదాలు పై రెండుపక్షాల దౌర్జన్యాలకూ తట్టుకోలేక పీగిపోయినాయి. చివరికి కమ్యూనిస్టు పక్షాన్ని అణిచివేసి జాతీయపక్షం తిరిగి తలెత్తింది. ఆ కారణంవల్లనే రెండోప్రపంచ యుద్ధం సంభవించింది. ఇప్పుడు తిరిగీ రెండు పక్షాలూ తలెత్తాయి. ఇప్పుడు కమ్యూనిస్టుల బలం హెచ్చుగా ఉంది. తూర్పుజర్మనీలో కమ్యూనిస్టులకు బలీయమైన సైన్యం కూడా ఏర్పడింది. జాతీయవాదులూ, కమ్యూనిస్టులూ కూడా పశ్చిమజర్మనీని తూర్పుజర్మనీ నుంచి విడగొట్టరా దనీ, ఉభయప్రాంతాలనూ ఏకంచేసి ఐక్యజర్మనీరాజ్యం స్థాపించా లనీ ఆందోళన చేసున్నాయి. పశ్చిమజర్మనీలో బ్రిటిష్, అమెరికన్, ఫ్రెంచి సైనికప్రభుత్వాల మధ్య కలతలు వీరికి మరింత ప్రోత్సాహమిచ్చాయి. నాలుగుసంవత్సరాలు సైనికప్రభుత్వమున్నప్పటికీ పశ్చిమజర్మనీలో జాతీయవాదుల నణచలేకపోయినాయి. తిరిగి ఐక్యజర్మనీ రాజ్యం ఏర్పడితే ఈ యూరు ప్రభుత్వం కమ్యూనిస్టుల చేతిలో పడటం తథ్యం. అప్పుడు అట్లాంటిక్ ఒడంబడిక వ్యర్థమే అవుతుంది. రైన్‌నదీ తీరాన దక్షిణశ్రేణి నిరర్థకం అవుతుంది. ఇంక స్పెయిన్‌కు తూర్పున పిరానీస్ పర్వతాలు మాత్రమే రక్షణశ్రేణిగా మిగులుతాయి. ఫ్రాన్సు ఇటలీ మొదలైన దేశాలను అట్లాంటిక్ ఒడంబడిక రక్షించలేదు.

ఐక్యజర్మనీప్రభుత్వం జాతీయవాదుల చేతిలో పడితే, తిరిగి ఆంగ్లో-అమెరికన్ రాజ్యాలకూ ఫ్రాన్సుకూ శత్రువులైన నాజీలు రష్యాతో సఖ్యంచేసుకుని వారిపై శత్రుత్వం స్థాపించేడానికి మరొక యుద్ధం ప్రారంభించగల అవకాశం ఉంది.

అందువల్ల జర్మనీని ఏరీతిగానైనా ఆంగ్లో అమెరికన్ రాజ్యాలతో బంధించవలసిన అగత్యం వచ్చింది. యూరోపియన్ జాతీయ భావం ఒక్కటే దీనిని సాధించగలదు. జర్మనీలో బ్రిటిష్ ఫ్రెంచి జాతీయులపట్ల గల విరోధభావాన్ని తొలగించా లంటే యుద్ధాలు సాధనాలు కావు. పూర్వజర్మన్ రాజకీయవేత్తలు బిస్మార్క్ మొదలైనవారు యత్నించిన యూరోపియన్‌రాజ్య సమాఖ్యవలన సాధ్యం కావచ్చును. రూర్ పరిశ్రమలే జర్మనీ యుద్ధబలానికి మూలం. వీనిని యుద్ధానికి ఉపయోగపడకుండా చేయా లని ఫ్రాన్సు ఎంత యత్నించినా ఇంతవరకూ ఫలించలేదు. యుద్ధాలకు ముందు వీనిని జర్మన్లు ఉపయోగిస్తుంటే చూస్తూ ఊరుకోవలసివచ్చింది. యూరోపియన్‌రాజ్య సమాఖ్యద్వారా ఈ సమస్యని పరిష్కరించాలని అమెరికన్ బ్రిటిష్ ఫ్రెంచి ప్రభుత్వాలు యత్నిస్తున్నాయి.

పశ్చిమ జర్మనీ రిపబ్లిక్:

ఈ లక్ష్యం సాధించడానికిగాను కమ్యూనిస్టుల ఆటంకాలను లక్ష్యం చెయ్యకుండా పశ్చిమ జర్మనీ రిపబ్లిక్‌ను మే 8 వ తేదీ రాత్రి స్థాపించారు.

హంగేరీ క్రైస్తవ మతాచార్యుని దండించినందుకు కమ్యూనిస్టుల్ని దుమ్మెత్తిపోసిన జర్మనీలోని క్రిస్టియన్ డెమోక్రాట్లు ఇప్పుడు జాతీయవాదులతోనూ, కమ్యూనిస్టులతోనూ చేయికలిపి ఐక్యజర్మనీ స్థాపనకు ఆందోళన చేస్తున్నారు. జర్మనీలో పరిశ్రమల్ని నిర్దాక్షిణ్యంగా పడగొట్టి లక్షలాది కార్మికుల జీవనోపాధిని పోగొట్టిన పశ్చిమ ప్రభుత్వాల పట్ల ప్రజలకు ద్వేషం పెరిగింది. తూర్పు జర్మనీలో రష్యన్ల ఆధ్వర్యంకింద పరిశ్రమలు పునరుద్ధరించబడేనందువల్ల జర్మన్ల ఆసక్తి ఆ వైపుకే మొగ్గిఉంది. పూర్వనాజీలను తిరిగి అధికారంలోకి తెచ్చిన పశ్చిమ ప్రభుత్వాలపట్ల ప్రజల్లో సంశయద్వేషాలు వ్యాపిస్తున్నాయి.

పశ్చిమప్రభుత్వాలమధ్య గల అభిప్రాయభేదాలు వీనికి తోడైనాయి. బ్రిటిష్‌వారు తమ ప్రాంతంలో యూదులపై విద్వేషం రగుల్కొలుపుతున్నారు. "ఆలివర్ ట్విస్ట్" సినిమాను అమెరికన్ ప్రాంతంలో నిషేధిస్తే, బ్రిటిష్ ప్రాంతంలో అధికారులే ఆ సినిమాకు ప్రోత్సాహ మిస్తున్నారు. పూర్వజర్మన్ వలసలు తిరిగి జర్మనీ కివ్వాలని హెర్ షాఫ్ట్ చేస్తున్న ప్రచారానికి బ్రిటిష్ అధికారులు ప్రచ్ఛన్నంగా తోడ్పడుతున్నారు. అమెరికన్లు షాఫ్ట్ ప్రచారాన్ని నిషేధించారు. పరిశ్రమల పునరుద్ధరణకు అమెరికనులు ప్రోత్సాహమిస్తున్నారు. బ్రిటిష్ ఫ్రెంచి ప్రాంతాలలో ఆటంకాలు పెడుతున్నారు.

ఈ పరిస్థితిలో జర్మన్ ప్రజల ప్రాపు పొందడానికీ, రష్యా ఎత్తులు భగ్నం చెయ్యడానికీ పశ్చిమ సైనిక ప్రభుత్వాలు పశ్చిమ జర్మనీలో రిపబ్లికన్ ప్రభుత్వాన్ని స్థాపించాయి.

బాన్‌లో రాజ్యాంగపరిషత్తు చాలా వారాలుగా సమావేశ మౌతోంది. మొదట ఈ పరిషత్తు తయారు చేసిన రాజ్యాంగం సైనిక ప్రభుత్వాలకు నచ్చలేదు. వారు కొన్ని సవరణలు సూచించారు. చివరికి సవరణల నంగీకరించి 187 నిబంధనలు గల రిపబ్లికన్ రాజ్యాంగం ఒకదానిని బాన్ రాజ్యాంగపరిషత్తు తయారు చేసినది.

తూర్పు జర్మనీ రిపబ్లిక్‌లో చేరటానికి అవకాశం ఉంటుం దని బాన్ పరిషత్తు ప్రకటించినది. ఈ రాజ్యాంగాన్ని కమ్యూనిస్టులు అంగీకరించబో రని జర్మన్ కమ్యూనిస్టు నాయకుడు మాక్స్ రైమన్ ప్రకటించాడు. ఈ రాజ్యాంగం కమ్యూనిస్టులకు అంగీకారయోగ్యంగా లేదు. జెకోస్లొవాకియాలో మాదిరిగా కమ్యూనిస్టులు ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకోగానికి అనువుగా లేనందువల్ల వారు ప్రతిఘటిస్తున్నారు. తూర్పుజర్మనీ ఈ రాజ్యాంగాన్ని ఆమోదించకపోవచ్చును. కాని దీనివిషయమై విదేశాంగ మంత్రుల సమావేశంలో రష్యన్ ప్రతినిధి ఆక్షేపణ తెలపవచ్చును. విదేశాంగ మంత్రుల మధ్య సమాధానం కుదరా లంటే ఈ రాజ్యాంగాన్ని సవరణచేయడానికి అవకాశం ఇవ్వవలసివస్తుంది కూడా.

పశ్చిమ జర్మన్ రిపబ్లిక్ పరిపాలనాధికారాల్ని కొన్నిటిని, కొంత దేశస్వాతంత్ర్యాన్నీ అంతర్జాతీయ సంస్థలకు ఒప్పగించగల అవకాశం ఉంటుం దనీ, దేశరక్షణాది విషయాల నిమిత్తం రాజ్యకూటాలలో చేరడానికి వీ లుంటుం దనీ ఈ రాజ్యాంగపరిషత్తు ప్రకటించింది. అంటే యూరోపియన్ కౌన్సిల్‌లోనూ, అట్లాంటిక్ ఒడంబడికలోనూ పశ్చిమ జర్మనీ త్వరలోనే చేరిపోగల దని అర్థమౌతున్నది. కొంత స్వాతంత్ర్యాన్ని అంతర్జాతీయ సంస్థలకు ఒప్పగించవచ్చు ననే వాక్యంలో, రూర్ ప్రాంత పారిశ్రామిక విషయాల నిర్ణయాల్ని యూరోపియన్ కౌన్సిల్‌కు ఒప్పగించగలదని అర్థం. తూర్పు జర్మనీనుంచి రష్యన్ సైన్యాలు విడిచి వెళ్లిపోయి, పశ్చిమ ప్రభుత్వ సైన్యాలుకూడా విడిచిపెట్టి వెళ్లవలసిన అగత్యం వస్తే ఫాంటెన్‌బ్లోలోని మాంట్‌గామరీ దేశరక్షణ కమిటీవల్ల పశ్చిమ జర్మనీ దేశరక్షణ వ్యవహారాలను నిర్వహించుకొనగల అవకాశం ఉంటుం దన్నమాట.

బెర్లిన్ దిగ్బంధం తొలగింపు:

ఈ ఎత్తులికి రష్యా ఎదురెత్తు వేసింది. పశ్చిమ జర్మనీ ప్రభుత్వం స్థాపించకుండా చెయ్యాలి. రైన్‌నదీతీరాన రక్షణశ్రేణి నిర్మించకుండా చెయ్యాలి. జర్మన్ ప్రజల ప్రాపు పొందడానికి యత్నించడంలో పశ్చిమ ప్రభుత్వాలు అనవసరంగా ఆత్రుతపడినందుకు ఫలితంగా నాజీల ప్రాబల్యం తిరిగి హెచ్చింది. జర్మన్ రాజకీయాలు తిరిగి జాతీయ దురభిమానంతోనూ, దౌర్జన్యంతోనూ కలుషితమైపోయాయి. జర్మన్ రాజ్య సమైక్యతానినాదం మొదట కమ్యూనిస్టులే ప్రారంభించారు. దానితో జర్మనీలో అగ్రరాజ్య సంఘర్షణలో రష్యాకు ప్రథమ విజయం లభించింది.

అట్లాంటిక్ ఒడంబడికపై సంతకాలు జరిగే వరకూ బెర్లిన్ గురించిన సంప్రదింపుల సమాచారాన్ని అమెరికన్ ప్రభుత్వం రహస్యంగానే ఉంచింది. స్టాలిన్‌తో అమెరికన్ వార్తాసంస్థ విలేఖరి ఇంటర్వ్యూ ఫలితంగా, బెర్లిన్ దిగ్బంధన తొలగింపుకు తిరిగి సమాలోచనలకు అవకాశం వచ్చింది. అమెరికా రహస్యంగా సంప్రదింపు లారంభించింది. బెర్లిన్‌పై రష్యా దిగ్బంధం తొలగించా లంటే ఏమి షరతులు కోరుతున్నదని అమెరికన్ రాయబారి ఫిలిప్ జిసప్ రష్యా రాయబారి గ్రొమైకోను అడిగాడు. అప్పు డారంభించిన సమాలోచనల ఫలితంగా ఈ వారం సమాధానం కుదిరింది. ఉభయ పక్షాలూ మే 12 వ తేదీ గురువారంనాడు దిగ్బంధం తొలగించడానికీ, మే 23 వ తేదీని జర్మనీ భవిష్యత్తును గురించిన సమస్య చర్చించడానికీ నాలుగు అగ్రరాజ్యాల విదేశాంగ మంత్రుల సమావేశం జరపడానికీ నిర్ణయమయింది. విదేశాంగ మంత్రుల సమావేశంలో జర్మనీ ద్రవ్యసమస్యకూడా చర్చించబడుతుంది. జర్మనీ భవిష్యత్తునుగురించీ, జర్మనీతో సంధి షరతులగురించీ, తిరిగి చర్చ జరుగుతుంది.

జర్మనీపై విదేశాంగ మంత్రుల చర్చ ప్రారంభించినట్లయితే పశ్చిమజర్మనీ ప్రభుత్వస్థాపన ఒకవిధంగా నిలిచిపోయినట్లే. అందువల్లనే "తాత్కాలిక ప్రభుత్వం" మాత్రమే ఇప్పుడు స్థాపించబడింది. విదేశాంగ మంత్రుల చర్చలో రష్యా ఐక్యజర్మన్ ప్రభుత్వ నిర్మాణం జరగాలనీ, సైనికప్రభుత్వాలు రద్దుపరచాలనీ కోరవచ్చును. జర్మనీనుంచి సైన్యాల్ని తొలగించమని కోరినా కోరవచ్చును. ఈ కోరికల్ని పశ్చిమప్రభుత్వాలు మన్నించినట్లయితే జర్మనీ యూరప్ రాజ్యసమాఖ్యతో కూడ గట్టుకు రావడం అసంభవ మౌతుంది. తూర్పు పశ్చిమ జర్మనీలు కలిసినట్లయితే జర్మనీలో కమ్యూనిస్టు బలాధిక్యతగల ప్రభుత్వం ఏర్పడవచ్చును. ఐక జర్మనీ ఎన్నడూ అట్లాంటిక్ ఒడంబడికల

(16వ పేజీ చూడుడు)

సాహిత్యమీమాంస:

'కవీ-కవిత్వం'

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

సకలసహృదయ మనోహరమైన కవిత్వమును సామాన్యముగా ఒక పరిభాషలో యిముడ్చుడ మసాధ్యము. వివిధదేశములలోని ప్రజలు తమ ప్రత్యేక సంస్కృతికి వాతావరణమునకు తగినట్లుగా కవిత్వాదర్శములను నిర్మించుకొనుచున్నారు. కవియొక్క ప్రకృతి ప్రేమనుబట్టి స్వాభిరుచినిబట్టి కవిత్వ మనేకవిధములుగా రూపొందుచుండును. ప్రాచీనులు ఉదాత్తవిషయ చిత్రణకూ, మధ్యకాలంలోని అనేక కవులు ఆశ్రయదాతల మనోరంజనమునకూ కవిత్వము నుపయోగించిరి. ఆశ్రయదాతలకోసమై వ్రాయబడిన గ్రంథములలో కూడా అద్వితీయమైనవి లేకపోలేదు. నేటికవులు సాంఘిక పరిష్కారములకూ, నిత్యజీవితముతోని సమస్యాచిత్రణమునకు కూడా కవిత్వము నుపయోగించుచున్నారు. పండితులు ఛందోబద్ధమైన శైలిలో, పామరులు జానపదగేయములలో కవిత్వశక్తి ప్రేమను ప్రకటించుచుందురు. ప్రాచీనకాలంలో పండితులు సంస్కృతములో పామరులు ప్రాకృతాపభ్రంశ భాషలలో తమ కవిత్వశక్తిని ప్రకటించుచుండిరి. కవిత్వంపై అభిలాషయున్నా కల్పనా చమత్కారమున్నా ప్రతిమానవునకూ నైజగుణములు. విద్యావంతులు భాషసహాయముతో తమ కవిత్వ శక్తిని ప్రకటింతురు. పామరుల కట్టి సహాయం లేకున్ననూ గట్లు తెంచికొని ఉప్పొంగు కవిత్వావేశమును పల్లెపదములద్వారా ఏదో విధముగా వ్యక్తీకరించుచుందురు.

కవిత్వం స్వర్గంగా వీచికలవలె పవిత్రమైనది. తన్నిర్మాత కూడా, తదనురూపముగా ఉండవలెననుటలో అనౌచిత్యము లేదు. తర్కము జ్యోతిష్కము వ్యాకరణము రాజనీతి రత్నపరీక్ష మొదలగు సమస్తవిద్యలలోనను ప్రవీణుడే కవిత్వరచనార్హుడని పూర్వీకులు శాసించిరి. మహాకవియైన క్షేమేంద్రుడు కవిత్వము నేర్చికొనుటకు అనేకపద్ధతులు తెలిపినాడు. కొందరికి సహజంగా కవిత్వం సాధ్యమగు ననియు మరికొందరికి ప్రయత్నసాధ్య మనియూ, రోగులకూ తర్కవ్యాకరణ పీడిత శుష్కమస్తిష్కుల కసాధ్య మనియూ నిర్ణయించినాడు. మంత్ర జపముల ద్వారా కవిత్వమును సాధించవచ్చు నని అతడు చెప్పిన విషయ మీనాటి పరిస్థితుల కసాధ్యమైననూ అతడు తెల్పిన సామాన్యలౌకిక పద్ధతులు మాత్రం ప్రశంసనీయమైనవి. ప్రతిభా వ్యుత్పత్తులూ భావనాప్రాబల్యం లేనివారు షట్శాస్త్రములను చదివినంతమాత్రమున కవిత్వం చేయజాలరు. కవిత్వమునకూ శుష్కమైన విజ్ఞానమునకూ ఏమాత్రం సంబంధముండజాలదు. అప్పకవీయ సులక్షణసారములను చదివి యతిప్రాసల నియమము తెలిసికొనినంత మాత్రమున ఎవ్వడూ కవిత్వం చేయజాలడు. భావుకహృదయం విశ్వప్రకృతిప్రేమ మొదలగు సాత్త్వికగుణములు కవి కత్యవసరములు. కేవలం పద్యబద్ధమైన ప్రతిశుష్క విషయం కవిత్వ మనబడదు. రసనిష్పత్తిని కల్గించి పాఠకులను సాత్త్వికాలోకికానందమున ముంచునది కవిత్వమనబడును. కానీ బుద్ధిగమ్యమైన తార్కిక సిద్ధాంతములనూ కొన్ని యింగ్లీషు ముక్కలనూ యిరకించి అల్లినదంతయూ కవిత్వము కాజాలదు. సహజప్రతిభ లేనివారు స్వచ్ఛమైన గద్యమున వ్రాయవచ్చునుగానీ అదే విషయమునే పద్యములలోనికి మార్చి కవిత్వ మనిపించడం "చాకలి పద్దులకూ చంపకమాల" అన్నట్లుండును.

కవిత్వంలోని మహత్తరశక్తిని గురించి చెప్ప నవసరం లేదు. నిజమైన కవిత్వం పాఠకులపై ప్రభావమును కల్గించి వశంవదుల నొనరించును. చారణోత్తేజిత కవిత్వవశీభూతులై అనేక రాచపుత్ర యువకులు శరీరములను తుచ్ఛముగా భావించి ముసల్మానులతో పోరాడిరి. చందబరదాయి మొదలగు రాచపుత్రస్థాన కవులు కల్గించిన ఉత్తేజన, చూపించిన సాహసముల నెవ్వరూ మరువలేరు. రాజపుత్రస్థాన సాహిత్య చరిత్రలు చదివినవారందరి కీవిషయం సువిదితమే. యీనాడు ఆంగ్లపాండిత్యావిష్టములైన రిక్తహృదయములను కవిత్వం స్పృశించలేకున్ననూ ఒకనాడు "సోలన్" కవియొక్క కవిత్వపూరితోత్తేజనయే ఏథెన్సు పురవాసులను చేబలగర్వితులైన "మెగారా" వాసుల నోడించునట్లు చేసినదని మనకు తెలియును. అసాధ్యమైన విషయములు కూడా కవిత్వశక్తి ద్వారా సాధ్యమయినవి. తెలుగు మొదలగు భారతభాషలలో దీనికనేకోదాహరణములున్నవి. అరబ్ పర్షియన్ సాహిత్యముల అనువాదముల చదివినవారికైననూ ఆయా దేశాలలో కవిత్వం అనేకాసాధ్య కార్యములను సాధ్యముచేసినదని తెలియకలదు. శుష్కహృదయాలకూ శూన్యమస్తిష్కములకూగాక భావపూరితులకు అమాయకులకు కవిత్వం కల్గించు చైతన్యం, ఉత్తేజనా అపారమైనది.

కల్పనా (*Imagination*) కౌశలం అనురాగప్రవృత్తి, కవికి తప్పనిసరిగా ఉండవలెను. నిత్యనూతనమైన రమణీయత (క్షణే క్షణే యన్నవతా ముపైతి త దేవ రూపం రమణీయతాయాః) సూక్ష్మప్రవృత్తులను చిత్రించుటకు తగిన విహంగమదృష్టి కవికి ఉండవలెను. ప్రపంచములో ప్రకృతిచిత్రణలేని కావ్యమే లేదు. ప్రాచీనులకే గాక ఆధునికులకుకూడా ప్రకృతిచిత్రణ ప్రముఖమైనదియే. కవిత్వమునకూ ప్రకృతికీ అవినాభావసంబంధం వున్నది. కవిత్వమంతయూ ప్రకృతిచిత్రణకే అని భావించువారు లేకపోలేదు. సృష్టిలోని కోమలత్వం, మాధుర్యం అంతయూ ప్రకృతిలోనే ఉన్నది. మానవకల్పితమైన దంతయూ కృత్రిమమే. అకృత్రిమమైన ప్రకృతిరణీయతకూ, దానిని చిత్రించు కవిత్వమునకూ మందాకినికీ దాని వీచికలకూ ఉన్న తాదాత్మ్య సంబంధ మున్నది. అది కావ్యమైన రామాయణంలోని విశదప్రాకృతిక దృశ్యచిత్రణ, ప్రకృతిపై మమతయూ అపూర్వమైనది. సంస్కృతములో కాళిదాస యుగంధరకూ ప్రకృతిచిత్రణకత్యంత ప్రాధాన్య మున్నది. కుమారసంభవములో ఆరంభములోననే హిమాలయమును అత్యంతవిశదంగా వర్ణించడం కాళిదాసుయొక్క ప్రకృతిపై ప్రగాఢప్రేమను తెలియజేయుచున్నది. చమత్కార పదబంధముల కత్యంతప్రాధాన్య మిచ్చు పండితుల కీ విషయం రుచించక పోవచ్చును. ప్రాచీనకవులు ప్రకృతిచిత్రణలో లీనమై కావ్యక్రమాన్ని కూడా మరచిపొయ్యేవారు. ప్రకృతిచిత్రణద్వారానే కవిత్వప్రేరణకల్పనాశక్తి లభించగలదు. రివాజుకోసం కాక ప్రకృతిలో పరవశుడైన కవియే ఉత్తమోత్తమ కావ్యసృష్టి చేయగలడు. కాళిదాసు తరువాత విరచితమైన అనేక సంస్కృత కావ్యములలో జీవప్రకృతి చిత్రణ లేదు. అనేక సంస్కృత కావ్యములలోననూ తెలుగుకావ్యములలోననూ నాయికానాయకుల సురతోద్దీపనకే ప్రకృతిచిత్రణ చేయబడినది. ఋతువర్ణనలోననూ ఉదయాస్తమయములలో కూడా అనేకకవులు శృంగారము నిరికిస్తుంటారు. మనుచరిత్రలోని ప్రకృతిచిత్రణ ఎంత హృదయంగమమైననూ అది వరూధినీప్రవరుల ఉద్దీపనకే చేయబడినది. సృష్టిలోని అనంత సౌందర్యమును, భగవన్నిర్మాణములోని రమణీయమును హృదయంగమము చేసికొనునట్టివాడే కవిత్వమును సాఫల్యంగా నిర్మించగలడు. హిస్టరీని వికృత మొనరించి వ్రాసినదియంతయూ కవిత్వం కాజాలదు.

మనోవిజ్ఞానము కూడా కవిత్వమునకు ముఖ్యమైనదే. ఫ్రాయిడ్ చెప్పు వైజ్ఞానిక తథ్యములే గాక మన స్వానుభూతులను సకలజనానుభూతులుగా చిత్రించగల కుశలుడే కవిగాగలడు. హిస్టరీ మనకు ముఖ్యసంఘటనలనూ, వాటి కాలక్రమమున్నూ తెలియజేయును. ఆసంఘటన లట్లు జరగడమునకు హేతువైన మన స్తత్వములను సాహిత్యముయథార్థముగా చిత్రించును. హిస్టరీ జరిగిన విషయమును తెలియజేయును. సాహిత్య మెట్లు జరిగినదో తెలియజేయును. మనోవైజ్ఞానికులు నిర్దేశించు మానసికప్రవృత్తులను హిస్టరీ తెలియచేయు సంఘటనలనూ కవిత్వంద్వారానే రమ్యముగా చిత్రించుట కవకాశ మున్నది. స్వానుభూతులనూ కళనూ సంకలనం చేసి కళకూ భావుకత్వమునకూ సమన్వయం చేసినప్పుడే నిజమైన కవిత్వ ముద్భవించును. ఔరంగజేబు, అశోకుడు ఐతిహాసిక వ్యక్తులే కదా. హిస్టరీలో చెప్పబడిన అశోకుని అమానుషత్వమును మహాత్వకాంక్షనూ ఔరంగజేబుయొక్క మతవిభ్రమజనితహింసా ప్రవృత్తినీ, విచిత్రమానసిక తత్వమునూ ఒకకవి కావ్యంద్వారా వర్ణిస్తే ఆకావ్యం ఐతిహాసిక వ్యక్తులకంటే ఎక్కువ ఆకర్షకం కాగలదు. మామూలు సంఘటనలనే అనుభవజన్య పరిజ్ఞానముతో చిత్రించిన అవి యెక్కువ ఆకర్షకం కాగలదు. మన స్తత్వాన్నీ అనుభవములనూ సహృదయ జనరంజకముగా చిత్రించినప్పుడే సాహిత్య మనబడును. అట్లు చిత్రించగలవాడే కవి.


దేశకాలపరిస్థితుల ప్రభావం కూడా కవిత్వంలో కన్పించును. దేశకాలము నుబట్టి, కవియూ, కవిత్వం కూడా మారగలరు. దేశకాలపరిస్థితులకు పూర్తిగా అతీతమైన రచన అసంభవం. జయదేవుని రచనలలో ఆనాటి విలాసప్రవృత్తి కృష్ణలీలల ప్రాధాన్యతత్వం, భవభూతిరచనలలో కరుణాతత్వం కన్పిస్తున్నది. తపోవనంలో రచించబడిన రామాయణం కవిత్వ మెరుగులు లేక సరళంగా ఉన్నది. దేశమూ ప్రజలూ నిర్వీర్యులై అకర్మణ్యులైన తరుణంలో శుకసప్తతిమీగ కామరాజకథలవంటి రచనలు వెలువడినవి. గు రాజుల ధనధాన్య సమృద్ధమైన రాజ్యం, రాజుల ఆశ్రయం లేకున్న యెడల కాళిదశ్రీనాథుల పరమోత్కృష్ట కావ్యప్రకర్షయంతగా వికసించియుండజాలదు. దేశకాలపరిస్థితులనుబట్టియే ముసల్మాన్ రాచరికంలో ఉత్తరదేశంలో కేవలం మహాత్ముల ధార్మిక రచనలే వెలువడడం దక్షిణదేశంలో ఉన్నత సాహిత్యము సృష్టించబడడం సంభవించినది. ప్రతి రచనలో నా దేశ కాలప్రభావం స్పష్టంగా కన్పించుచుండును

యిది కల్లోలపూరితమైన సమయము. సమయానుగుణ్యమై కూడా శాశ్వతత్వమును విడువని రచన ఉత్తమమైన దని మనకు తెలియును. పూర్వం ఉన్నతోద్దేశములతో రచింపబడిననూ నేడు నాయికానాయకుల లక్షణములనూ విటనట విదూషకుల విపరీత కృత్యములనూ వర్ణించు సమయము కాదు. కావ్యప్రకాశ సాహిత్యదర్పణములలో వివరించబడిన అనేక దోషములు నేడు దోషములుగా ఎంచబడజాలవు. ముగ్ధనాయికలనూ ప్రౌఢనాయికలను, ధీరోదాత్తధీరలలిత ధీరప్రశాంతనాయకులను వర్ణించడం బాలికల సురత సౌఖ్యమునూ ప్రౌఢల పురుషాయితకేళీ విలాసములనూ వర్ణించడం అపహాస్యాస్పదముగా నుండును. ఆధునిక కాలమునకు తగినట్లు కవిత్వరచన జరగడం అవసరమేకానీ శుష్కమైన గద్యంవంటి పద్యమును వ్రాసి ఆధునికకవిత్వ మనడం అన్యాయం. చిరసత్యం చిరనూతనత్వం కలిగి కాలానుగుణ్యమైన కవిత్వం ఎల్లప్పుడూ అవసరమే. ప్రతిభావంతు లిట్టి కవిత్వరచనకే కృషి చేయవలెను.



విజయవాడలో కుర్తాళసిద్ధేశ్వరపీఠాధిపతి శ్రీ శ్రీ విమలానందసరస్వతి స్వాములవారి గజారోహణోత్సవము.

కథానిక:



శ్రీ వీరమాసునేని సంగమేశ్వరరావు

అర్ధరాత్రి సమయం. గదిఅంతటా నిశ్శబ్దం. ఒకమూలనుంచీ రోగి మూలుగు మాత్రమే వినబడుతూఉంది. దీర్ఘఉచ్ఛ్వాస, నిశ్వాసాలు ఊర్పులుమాత్రం వినబడుతూ ఉన్నాయి. హీనస్వరంలో మరణశయ్యపైఉన్న మాతృదేవిమంచానికి, అటు కూతురూ, ఇటు కొడుకూ కూర్చొని ఉన్నారు. వారి హృదయాల్లో ఉండే వేదన; బాధ, కట్టతెగిన కన్నీటి ప్రవాహపు వేగంలో కొంతవరకూ ఈది, ఈది అలిసిపోయ్యారు. ఏశ్చేళక్తిగాని, బాధను మరచిపోయే, ధైర్యంగాని వారిలో లేదు. లోలోపల తెలియకుండానే, తల్లిహృదయం మీద చెరోవేపునుండీ తలల నానించుకొని, కుమిలి, కుమిలిపోతున్నారు. అంత్యదశలో తీరుగతికి వచ్చిన పరిస్థితుల్లోఉన్న ఆ మాతృహృదయానికి, బిడ్డల యీ స్థితి గుర్తించే అవకాశం గాని, ఓదార్చే స్మృతి గాని లేదు.

రోగి కొంచం కదిలి, లేని ఓపికతో "అమ్మా!..." అంది.

"ఆ...ఇక్కడే ఉన్నా! ఎందుకమ్మా?" అంది కూతురు.

వెంటనే "బాబూ!" అంది రోగి మళ్లీ.

"ఆ...ఎందుకే అమ్మా!" అన్నాడు కొడుకు.

రోగి మాట్లాడలేదు. కూతురుచేతిని హృదయం మీదకు లాక్కుంది. కొడుకుచేతిని, కూతురు చేతిలో ఉంచి "అమ్మా! ఇదుగో నా పదేళ్ల నారాయుణ్ణి నీకు అప్పగింత పెడుతున్నా. అంతా భారం నీది. ఏంచేస్తావో?..." అంది.

"బాబూ! ఇహ నీకు అక్కయ్యే, అమ్మ... అన్నీను..." అంది.

ఈ మాటలకు పదేళ్ల నారాయణ పెద్దగా ఏడ్చాడు. అక్క మూగచూపులతో నారాయణ వంక చూచి, తన దివ్యహస్తంతో వెన్ను నిమిరింది. అదే మొదలు. నారాయణకు ఇప్పటికీ, అక్క అలా వెన్ను నిమురుతూ ఉన్నట్లే ఉంటుంది. వొళ్లు ఉప్పొంగుతుంది.

రోగి, కూతురు, తమ్ముడి పట్ల చూపుతున్న అనురాగ, సానుభూతులకు ఎంతో సంతోషపడింది. తృప్తిపడ్డట్టుగా, తల్లి ముఖంలోని ఆనందఛాయలు, అక్కా, తమ్ముళ్లు ఇద్దరూ, గ్రుడ్డిదీపపు వెలుగులో చూచారు. అంత దుఃఖంలోనూ, మాతృహృదయంలోని తృప్తినిచూడగానే, ఇద్దరూ ఎంతో దివ్యసౌఖ్యానుభూతిని పొందినట్లు సంతోషపడ్డారు.

రెండురోజుల తరువాత తల్లి చనిపోయింది. తమ్ముడు నారాయణ్ణి తీసుకొని అక్క సీత తన ఇంటికి వచ్చింది. సీతకు, పెళ్లిఅయిన తొమ్మిదేళ్లకు గర్భంవచ్చి కొడుకు పుట్టి, పురిట్లోనే పోయాడు. మళ్లీ సంతానం కలగలేదు. సీత భర్త అంత సజావైన మనిషి కాదు. సహవాసదోషం వల్లనైతేనేం, దుర్బలహృదయంతో ఆత్మవంచ కుడగుటవల్ల నైతేనేం, త్రాగుడు, జారత్వం యిత్యాది దురభ్యాసాలు అలవడ్డాయి. భర్తను దురభ్యాసాలనుండీ, త్రిప్పాలని సీత ఎన్నో రాత్రిళ్లు ఆయనపాదాలదగ్గరకూర్చొని ఏడ్చింది, ప్రతిమాలింది, భంగపడ్డది. భార్యవేదన చూచి నప్పుడు మాత్రం, ఆయన కొంతి చలించి "ఇహ రేపటినుంచీ మానేస్తా"అని వాగ్దానంచేసేవాడు." అంతవరకే...క్రియలోమాత్రం మామూలుగానే ఉండేవాడు. పదహారు సంవత్సరాలు అహో రాత్రాలు ఏడ్చి, ఏడ్చి హృదయాన్ని ఎలాగో రాయిచేసుకొని జీవితకాలాన్ని వెళ్లదీయటం అలవాటు చేసుకొన్నది సీత. కొన్ని సంవత్సరాలుగా జీవితంలో దూరమైపోయిన ఆనంద సంతోషాలు, మళ్లీ సీతకు, తమ్ముడు నారాయణుడు, తన ఇంట్లో తిరుగుతూ, ప్రొద్దస్తమానం చీరకొంగు వదలకుండా ఏపని చెయ్యబోయినా వెంబడి వెళ్తూఉంటే, క్రమంగా కలుగ మొదలు పెట్టాయి. ఈ చనువూ, సాహచర్యం రెండు సంవత్సరాల్లో, అక్కా, తమ్ముళ్ల మధ్య, ఆభావాన్ని మరపించి, తల్లీ, బిడ్డసంబంధాన్ని వృద్ధి జేయమొదలుపెట్టింది.

నారాయణముఖంలో ఏ క్షణాన కొద్ది విచారపు చిహ్నాలు కనుపించినా, సీత వెంటనే చేతిలో పని వొదిలేసివచ్చి ఆ బాధ కనుక్కొని ఓదార్చి, ఆ లేతహృదయాన్ని ఉపశమింపజేసి, వాడి భారాన్ని తగ్గించటానికి, ఆప్యాయతతో తన పరిష్వంగంలోకి లాక్కొని, కన్నీళ్లు తుడిచి, వాణ్ణి నవ్వించి, తాను నవ్వి కాని అవతలకు వెళ్లేది కాదు. అలాగే, అక్క సీత ముఖంలో ఏ రోజు, ఏమాత్రపు విషాదఛాయలు కనుపించినా, నారాయణ బాధపడి "ఎందుకే? అమ్మా! అట్లా ఉన్నావ్?" అనేవాడు. నారాయణ ఆ ప్రశ్న అడగటంతోటే, సీత ఎంతటి దుఃఖాన్ని అయినా ధైర్యంతో దిగ మ్రింగుకొని, మళ్లీ నవ్వుముఖంతో ఆదరంగా వాణ్ణి తన వొళ్లో కూర్చోబెట్టుకొని, అనిర్వచనీయఆనందాన్ని అనుభవించేది.

పదేళ్ల నారాయణ తల్లిలేని కొరత, బాధ అనేది ఎరగకుండా, పదిహేనుఏళ్ల వాడయ్యాడు అక్కసీత హృదయానురాగంవల్ల.

భర్తయొక్క దమననీతివల్ల, సంఘంలో, ముఖ్యంగా స్త్రీ సమాజంలో తలఎత్తుకొని తిరగటానికి, గడపదాటి బయటకు వెళ్లటానికి సీత భయపడుతూ ఉండేది. అందువల్ల ఇల్లు కదిలేది కాదు. నారాయణతో కాలం గడపటం అలవాటుఅయ్యాక, ఎట్టి పరిస్థితుల్లోకూడ, మరీ తప్పనిసరి అయితే దప్ప ఎవ్వరింటికీ వెళ్లేదికాదు. అథవా వెళ్లినా ఆమెకు అక్కడ హాయిగా కాలం గడిచేది కాదు. ఇంటిదగ్గర ఉన్న నారాయుణ్ణి గురించే ఆలోచిస్తూ ఉండేది. నారాయణ కూడ, అక్క ఇంటిదగ్గర లేకుండా ఏరోజుఅన్నా ఎక్కడికైనా వెళ్లితే, కాలం గడవక ఒక్కడూ ఎంతో బాధపడేవాడు, ఏడ్చేవాడు. మరో గంటలో మళ్లీ అక్క వచ్చి ఓదారిస్తేనే మామూలుమనిషి అయ్యేవాడు.

వారిద్దరి హృదయాల్లోనూ, ఒకరిపట్ల ఒకరి కున్న స్థానాన్ని, అనురాగాన్ని, సానుభూతిని, కరుణను, ఆప్యాయతనూ, అర్థంచేసుకోవాలన్నా, గుర్తించాలన్నా, అనుభూతిలోకి తెచ్చుకోవాలన్నా సాధారణ వాతావరణంలో జీవించేవారికి, శక్తికి మించిన పని అని చెప్పవచ్చు.

భర్తకు ఎన్నిదురభ్యాసాలున్నా, ఎల్లాంటి హృదయశూన్యుడై ప్రవర్తించినా, ఎంతో ఓర్పుతో, సీత తన హృదయంలో ఆయన పట్ల గల పూజ్యభావాన్ని, సానుభూతిని మాత్రం కించిత్తుకూడ, లవలేశంగానైనా తరుగుపడనిచ్చేది కాదు ఏ సమయంలోనూ. ఏనాడూ సీత భర్తను నిరసించి ఎరగదు.

తన జీవితానికి నారాయణే సర్వస్వం అని జీవితం చేస్తున్న సీతకు, అనుకోకుండా గర్భం రావటం, ఆడపిల్ల పుట్టడం జరిగింది.

జీవితంలో ఎప్పుడు ఏ సంఘటన వస్తుందో, దాని పరిణామ మేమిటో, మానవ ప్రకృతిని కూలంకషంగా అర్థంచేసుకోవటం మనకు తలకు మించిన పని.

ఇప్పుడు సీతకు, తమ్ముడు నారాయణుడు ఒక కన్నూ, కూతురు శాంతి మరొక కన్నూను. వారిద్దరే తమ భవిష్యత్ జీవితానికి వెలుగు బాటను చూపి, తన జీవితానికి అండ కాగలరని ఆమె దృఢ విశ్వాసంతో కాలం గడుపుతూ ఉంది.

* * *

సీతసంసారపు స్థితిగతులూ, జీవిత సంఘటనలూ ఎరిగిన వాళ్లు, భగవంతుడు మెచ్చాడనీ, సీత కష్టాలను మరచి కొంతైనా భవిష్యత్తులో సుఖపడే అదృష్టం ఉండబట్టే "శాంతి" ప్రసాదింపబడిం దనీ అనుకోసాగారు.

సీతహృదయంలోకూడ ఆ భావాలు, ఆశ నిండుగా ఏర్పడి ఉన్నమాట యథార్థం.

పొత్తిళ్లలోనుంచీ, పదేళ్ల పిల్ల అయ్యేవరకూ, "శాంతి" మేనమామ చేతుల్లోనే పెరిగి పెద్దదయింది. శాంతితో నారాయణ, సమవయస్కుడి మాదిరిగానే, ఆడుకొంటూ, కేరింతలు కొడుతూ, పోట్లాడుకొంటూ ఉండేవాళ్లు. అప్పుడప్పుడూ తగువులాడుకొని సీతదగ్గరకు తీర్పుకు వెళ్లేవాళ్లు. ఇద్దర్నీ దగ్గరకు లాక్కొని సమానంగా లాలించి, బుజ్జగించి, సమాధాన పరచేది సీత.

అక్కా, తమ్ముళ్లు అలా ఒకరి ఆశ్రయంలో ఒకరు, ఒకరి అండలో ఒకరు ఒకరిమాటలో, ఒకరు, ఒకరి నడకలో ఒకరు, కలిసీ, మెలసీ, ప్రశాంతంగా జీవితం గడుపుతున్న సమయంలో లోకం ఒక తుపాను, రేప మొదలుపెట్టింది.

"తల్లీ, తండ్రీ దిక్కూ ఎవ్వరూ లేకపోవటం వల్లే నారాయణకు పాతికేళ్లు వచ్చినా పెళ్లికాలేదనీ, కూతురు పుట్టింతరవాత సీతకు తమ్ముడి మీదశ్రద్ధపోయిందనీ, పిల్ల ఎలాగూ ఈడుగాదు, మనకు కలిసే యోగంలేదు, వాడెట్లా పోతే మనకేం అని నిర్లక్ష్యంతో ఉంటూ ఉందనీ" లోకంలో బాగా ప్రచారం జరిగిపోయింది. ఈవిషయం సీతచెవిదాక ప్రాకిపోయింది. లోకనిందకు బాధపడ్డది. తన భావి జీవితపు అండను ఆలోచించుకొని, తమ్ముడిజీవితాన్ని దానికి ఆహుతిచెయ్యా లనుకోవటం ఆమెకు అన్యాయమనీ తోచింది.

ఆరోజు దీపావళి. "అక్కయ్యా! కళ్లుమంటలుగా ఉన్నాయి. తలంటి పోసుకోవాలని ఉంది" అన్నాడు నారాయణ ఆ ఉదయం. తొందరగా పని తెముల్చుకొని సీత చేతిలో ఆముదం పోసుకొచ్చి "బాబూ! రా! మాడుకు ఆముదం పెడతాను." అంది.

అక్క ఆముద మంటి, దొడ్లో నీళ్లూ అవీ సిద్ధం చేసేటప్పటికి, "శాంతి" కుంకుళ్లు కొట్టి, నురుగు సిద్ధంచేసి తీసుకొనివచ్చింది. నారాయణ వెళ్లి పీటమీద కూర్చొని, సీతముఖంలోకి చూస్తూ "అక్కా! నువ్వు నురుగుపొయ్యి. నే రుద్దుకొంటాను." అన్నాడు.

"వద్దు. బాబు! అలవాటులేని నువ్వు రుద్దుకోలేవు. చేతులు నొప్పులు పుడతాయి. శాంతి నురుగుగిన్నె పట్టుకొని నిలుచుంటుందిలే. నే ఒక చేత్తో నురుగు పోసుకొంటూ రుద్దుతాను." అని అలాగే సీత తల అంటిపోసింది. తమ్ముడికి, ఏ క్షణాన, ఎక్కడ బాధ కలుగుతుందోనని సీత అంత శ్రద్ధతో, జాగ్రత్తగా ఉండేది. అలాగే, నారాయణకూడ బజారుపనిగాని, బయటిపని గాని అక్క చెప్పిందే తడవుగా, అగ్గరాన, ఆన బట్టి చేసేవాడు.

ఆ సాయంత్రం శాంతి టపాకాయలు కాల్చింది. సీత, నారాయణ ఒకరు వొత్తులు వేస్తే, ఒకరు చమురుపోసి దీపారాధనలు, అక్కా, తమ్ముడూ కలిసి చేశారు.

ఆరాత్రి భోజనా లయ్యాక 'శాంతి' తండ్రి మంచంమీద పడుకొని కబుర్లు చెబుతూ ఉంది. లోకంలో ఎవ్వరితోనూ చనువుగా ఉండని మాట్లాడని శాంతితండ్రి కూతురువిషయంలో మాత్రం ఎంతో శ్రద్ధగా, చనువుగా ఉండేవాడు.

ఎట్టి ప్రకృతి గల మనిషికైనా, ఒక్కొక్కప్పుడు, ఒకొక్క వ్యక్తిమీద అలా అనురాగ, సానుభూతులు ఏర్పడటం మానవసృష్టియొక్క సహజస్వభావం. అందులోనూ ఎన్నో సంవత్సరాల అనంతరం కలిగిన బిడ్డ. తండ్రీ, కూతుళ్లు అలా మాటల్లో ఉండగా, సీత నారాయణ పడుకొన్న మంచంమీదకు వెళ్లి కూర్చొని "బాబూ! మాఘమాసంలో పెళ్లి..." అంది.

నారాయణ అదిరిపడుతూ "అక్కా! పెళ్లి ఎవరికే?" అన్నాడు.

"బాబూ! నీకే"

"నాకా?"

"అవును."

నారాయణ కొంతసేపు మాట్లాడలేక పొయ్యాడు. తరువాత తెప్పరిల్లి దీనంగా అక్కముఖంలోకి చూస్తూ "పిల్ల ఎవరే?" అన్నాడు.

"ఇంకా వ్యవధి ఉందిగా.........ఆలోచించాలి."

"అక్కా! నీ నారాయుణ్ణి అన్యాయం చేస్తావా? నీ నీడను వొదిలి, నేనీ ప్రపంచంలో బ్రతకలేను. ఇంకా నాలుగేళ్లు ఓర్చుకొంటే 'శాంతి'..." అని ఆపాడు.

"బాబూ! ఇప్పటికే పాతికేళ్లు వొచ్చాయి. జీవితంలో అనుభవించాల్సిన కాలం అంతా అయిపోతూ ఉంది. ఇంకా నాలుగేళ్లు...అబ్బ! ఎంత అన్యాయం?" అని బాధపడింది అక్క సీత.

"అక్కా! నిన్ను వొదిలి నేను మరో వాతావరణంలో జీవితం చెయ్యలేను."

"బాబూ! ఎంత పిచ్చివాడివి. నీ అక్కయ్య బ్రతికున్నంతవరకూ ఎప్పుడూ నిన్ను తన చేతుల్లోనుంచి జారవిడుచుకోలేదు. పెళ్లిజేసి, నిన్ను ఒకళ్లకు బానిసగా వొదిలేసి, నేను మాత్రం బ్రతకగలనా?" అంటూఉంటే, ఆమె కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

కొంతసేపటికి సీత తెప్పరిల్లి "బాబూ, నీ సుఖం, క్షేమం కోరే, నేను పెళ్లిచెయ్యాలని సంకల్పించుకొన్నాను. నా జీవితంలో నే దాంపత్య సౌఖ్యాన్ని పూర్తిగా అనుభవించిన రోజు ఒక్కటీ లేదు. నువ్వూ, నీ భార్యా, అయినా నా కండ్ల ఎదుట అన్యోన్యంగా దాంపత్యంచేస్తూ, హాయిగా కాలం దొర్లిస్తూ ఉంటే, చూడాలని నా కోరిక" అంది.


"అక్కా! నువ్వెన్ని చెప్పినా 'శాంతి' ని దప్ప...క్షమించు. ఇహ పెళ్లిమాట ఎత్తవద్దు" అని ఆమెరెండుచేతులూ పట్టుకొని నారాయణ భోరున ఏడ్చాడు. సీతకూ, తమ్ముడిముఖంలోకి చూస్తే ఆగకుండా దుఃఖం పొంగి పొర్లింది. "భగవంతుడు ఇచ్చేవాడు, ఆ నలుసునే, ఇంకా నాలుగేళ్లు ముందివ్వకూడదూ?" అనుకొని భాధపడింది.

తమ్ముణ్ణి ఏం చెయ్యాలో, లోకానికి ఏం సమాధానం చెప్పాలో అర్థంగాక ఆలోచనా సముద్రంలో మునిగిపోయింది సీత. కాల ప్రవాహంలో మరో సంవత్సరం గడిచిపోయింది.

* * *

లోకపు పోరు మరీ ఎక్కువైంది. మన జీవితావసరాలు, కష్టాలు, బాధలు, మన కొరతలు వీటిని గుఱించి ఆలోచించి సానుభూతి చూపే హృదయం లేకపోయినా, మనలో ఏ లేనిపోని వెలితినో వెతికి చూపెట్టి, దాని ఆధారంతో మన జీవితాల్ని విమర్శించి, వెక్కిరించి, వేళాకోళంచేసి, అపహాస్యంతో గేలిచేసి లోకం వంచిస్తుంది. మానవుడు బానిసై ఆ వంచనకు తల వొగ్గుతాడు. అలా తలవొగ్గక ఆత్మవిశ్వాసముతో ఎవరైనా ధైర్యంచేసి నిలబడితే, వారు సంఘానికి క్షమించరాని ద్రోహం చేసినవాళ్లుగాను, పొగరుబోతులుగాను, అవినీతివర్తనులుగాను, చీడపురుగులుగానూ చూడబడతారు. ఈ పరిస్థితులకు తట్టుకొని బ్రతికే శక్తిలేకపోవటం

(18 వ పేజీ చూడుడు)



దక్షి
వైమా
ప
బ హూ

రాయల్ ,ఇండియన్ వైమానికదళ సభ్యులు ఎయిర్ కమోడర్ సింగ్ గారికి సైనికాభివాద మిచ్చారు.




పతకం బహూకరించిన ఎయిర్ కమోడర్ ఆర్. హెచ్. డి. సింగ్, పతకంపొందిన గ్రూప్ కెప్టెన్ ఆర్. రాజారాంగార్లు.

ఎయిర్ కమోడర్ సింగ్, గ్రూప్ కెప్టెన్ రాజారాంగార్లతో పత్రికా విలేఖరులు.




గ్రూప్ కెప్టెన్ రాజారాంగారికి ఎయిర్



ద్వితీయప్రపంచసంగ్రామంల
గస్తీలోనూ, అపూర్వ సావ
గ్రూప్ కెప్టెన్ ఆర్. రాజ
క్రాస్ మే 5 వ తేదీ ఉదం
బడింది. దక్షిణ భారతవైమా
వారు వీ రొక్కరే. వీరు ఇప
నింగ్ స్కూలులో రెండవ
పనిచే

భారత
కునికి
త్రక
కరణ




ఎయిర్ కమోడర్ సింగ్ సైనికాభివాదం స్వీకరించారు.



మోడర్ సింగ్ గారు పతకం అలంకరించారు.

పతక బహూకరణోత్సవం నిమిత్తం ప్రత్యేకవిమానంలో బెంగుళూరు నుంచి తాంబరం వచ్చిన ఎయిర్ కమోడర్ ఆర్. హెచ్. డి. సింగ్, వారి సతీమణి.



సైనికాభివాదం సమాప్తి.



ో బర్మాపై విమానదాడిలోనూ, ాసం, చాకచక్యం ప్రదర్శించిన రాంగారికి డిస్టింగ్విష్డ్ ఫ్లైయింగ్ ుం తాంబరంలో బహూకరించ నికులలో ఈ పతకం పొందిన ుడు. తాంబరం గ్రౌండ్ ట్రెయి కమాండింగ్ ఆఫీసరుగా స్తున్నారు.






పప్పుగిన్నె మాట్లాడుతుందా?

శ్రీ నేమాని వీరభద్రరావు

ఒక బీద బ్రాహ్మణుడు పుదయమంతా బిచ్చమెత్తుకొని, పన్నెండు గంటల సమయానికి ఒక పేదరాసి పెద్దమ్మ యింటికి చేరాడు. "పెద్దమ్మా, తిరిగి, తిరిగి వచ్చేను; నాదగ్గర ఒక పప్పు గిన్నె వుంది. దానినిండా అత్తెసరు వేసి పెడతావా? నీ ఋణం ఎన్నటికీ మరువను." అన్నాడు. పెద్దమ్మ వంట కూడా ఆ దినం ఆలస్యమయింది. "నాయనా, అదెంత పని. నా వంటతో పాటే నీదీను. పెడపొయ్యి మీద యిద్దరికీ ఒక్కసారే వుడికి పోతుంది." అంది. బ్రహ్మణుడు స్నానం చేసి యిద్దరికి విస్తళ్లు కుడుతున్నాడు. మధ్య మధ్య ముసలమ్మ ఏమి చేస్తూందో చూస్తున్నాడు ఓరకంటితో. అతని అనుమానానికి తగినట్లుగానే ముసలమ్మ అతని గిన్నెలో అన్నం రెండు గరిటెలు తీసి తన గిన్నెలో వేసుకుంది. బ్రాహ్మణుడు విషయమంతా కనిపెట్టి వూరుకున్నాడు. యిద్దరూ భోజనాలు ముగించేరు. బ్రాహ్మణుడు తన గిన్నెను నూతివద్దకు పట్టుకుపోయి దానిని తోమటం ప్రారంభించేడు. గిన్నెను తోముతూ "ఓసి పాడుముండా, యీపాటి భాగ్యానికే నాతో చెప్పాలా? ఎదుట మనిషి పెద్ద మనిషి అని అని అయినా ఆలోచించావా? అంటూ ఆ గిన్నెను తిరగవైచి కొట్టడం ప్రారంభించేడు. పెరట్లో మాటలు విని పెద్దమ్మ "ఏమిటి నాయనా, ఎవళ్లతో మాట్లాడుతున్నావు?" అని అడిగింది. అవుడు యింకా లేని కోపాన్ని తెచ్చిపెట్టుకొని "అమ్మా, మీతో చెప్పవలసిన విషయం గాదు. యిలాటివాళ్లతో మర్యాదలు నిలుస్తాయా? మర్నాడు ఎక్కడైనా యింత ఆశ్రయం లభిస్తుందా?" అనేసరికి పెద్దమ్మకి మరీ జిజ్ఞాస ఎక్కువై పోయింది. "చెప్పు నాయనా, నాకు చేతనైతే ఏ లోపాన్ని అయినా సరే సరిదిద్దడానికి ప్రయత్నిస్తాను" అంది. "అమ్మా, చెప్పుకుంటే సిగ్గు, సిగ్గు, యీ గిన్నె చూసింది చూసినట్లు వూరుకోక, మీరు రెండు గరిటెల అన్నం తీసుకొని మీ గిన్నెలో పడవేసుకున్నారని నేరాలు చెప్పటానికి సాహసించింది. నాకు వుపకారం చేసిందే కాకుండా, మీమీద యిటువంటి నేరాలు కూడా మోపటం ధర్మమా? యింతకీ ఎన్ని అంటే మాత్రం యీ గిన్నెకు బుద్ధి లేదు." అని బ్రాహ్మణుడు అనగానే ముసలమ్మ ఆశ్చర్యంతో "నాయనా, యీ గిన్నె మాట్లాడుతుందా?" అంది. "అమ్మా, ఒట్టినే మాటలాడటమే గాదు, దీనికి స్వామిభక్తి ఎక్కువ. యజమానికి ఏ మాత్రం అన్యాయం జరిగినా వెంటనే చెప్తుంది. ఆ విషయం మెచ్చదగ్గదే గాని, ప్రస్తుత మీ విషయంలో నిజం చెప్పినా, నాకు దీనియందు మహా కోపంగా వుంది" అన్నాడు. "నాయనా, ముసలిదాన్ని; దక్షత లేక యిబ్బందులు పడిపోతున్నాను. ఏ వస్తువు పోయినా కనుక్కొనేవారు ఎవరూ లేరు. నీగిన్నె దయవుంచి నాకిస్తివా నీకు, నా కవకాశం వున్నంతలో ముట్టజెప్పకపోను" అంది. గిన్నె వెల రూపాయి మొదలు వెయ్యి రూపాయిల వరకు పెరిగింది. బేరం చెడకుండా బిగువు సడలకుండా బ్రాహ్మణుడు వెయ్యి రూపాయిలు పుచ్చుకొని సాగిపోయేడు. యిక పెద్దమ్మ తానొక ఘనకార్యం చేసినట్లు సంతోషిస్తూ పప్పు గిన్నె తన యింట్లో వున్నంతకాలం తనకు ఏ భయమూ లేదని గుండె దిట్టపరుచుకుంది. మరుచటి దినంనుండీ యింటి తలుపు లన్నీ తీసివేసి పనున్నా లేకపోయినా యిరుగింటికి పొరుగింటికి వెళ్లి బాతాఖానీ ప్రారంభించింది. యిదే సమయమని బారుగా తలుపు తీసి యుండుటచేత యింట్లో సరుకులన్నీ పైకి నడవటం ప్రారంభించేయి. సరుకులు కనిపించక పోవటంచూసి పెద్దమ్మ గిన్నెను నూతి దగ్గరకు తీసుకెళ్లి బోర్లించి తోముతూ, కొడుతూ 'సరుకు లెవరు తీశారో చెప్పు' అని గట్టిగా కొట్టడం ప్రారంభించింది. కాని ఏ జవాబూ రాలేదు. యిలాగే యింట్లో సరుకులుపోతూ వుండటం, పెద్దమ్మ గిన్నెను అడుగుతూండటం కొన్నాళ్లు జరిగింది. కొంతకాలం అయేసరికి యింట్లో సరుకులు డబ్బా పూర్తిగా పోయేయి. పెద్దమ్మ భోరుమని రాగం పెట్టింది. యిరుగుపొరుగు వాళ్ళంతా వచ్చి జరిగిన దంతా విని ఆశ్చర్యపడి ఆమె తెలివితక్కువ తనానికి నిందించారు.

ఒకరోజున వెనకటి బ్రాహ్మడు ఆ దారినే పోవటం తటస్థించింది. పెద్దమ్మకి అతన్ని చూడగానే పట్టరాని కోపం వచ్చింది. "ఏమయ్యా బ్రాహ్మడా, ముసలిముండని యింతగా మోసం చెయ్యటం ఏం న్యాయంగా వుంది. యిలా ఎంతకాలం నీ దొంగతనం సాగుతుంది." అని కడుపులో కోపమంతా బ్రాహ్మడిమీద క్రుమ్మరించింది. బ్రాహ్మణుడుకూడా పెద్దమ్మని చూడగానే సగం క్రుంగిపోయాడు. కాని తన భయాన్ని పైకి కనబడనీయకుండా "అమ్మా, చాలా పొరపాటు జరిగింది. ఒక మాట చెపుదామనుకుంటూనే మరిచిపోయాను." అన్నాడు. ముసలమ్మ యీ మాటలు విని కొంత శాంతించి "ఏమాటో త్వరగా చెప్పు. సరుకులన్నీ పోయినతరువాత యీ గిన్నె వున్నా ఒకటే. వీధులో పారేసినా ఒకటే. అయినా వింటాను; చెప్పు." అంది. బ్రాహ్మణుడు "అమ్మా, మరేమీ లేదు యీ గిన్నె లక్షణమే చెప్పటం మరిచేను. నువ్వు కూడా నాలాగే యింటింటా తిరిగి, ముష్టియెత్తి ఆ బియ్యం, ఆ గిన్నెతోనే వండి, ఆ అన్నంతిని, గిన్నె తోముతూ అడిగితేనే తప్ప నీకు సమాధానం యియ్యదు" అన్నాడు. "అబ్బో పెద్ద తంతే వుంది. విషయం సరిగా చెప్పకపోతే నేను ఎలాగ చావను నాయనా?" అంది పెద్దమ్మ. బ్రాహ్మణుడు బ్రతికి బయలు పడ్డానని, పులి నాకి విడిచి పెట్టినట్లు భావించి వెనక్కి తిరిగి చూడకుండ పారిపోయాడు.


పెద్దమ్మ, తనకి కలిగిన నష్టమంతా నిమిషంలో కూడదీసుకొనే అవకాశం లభించిందని, పప్పు గిన్నె చేత్తో పట్టుకొని, తెల్లని పంచె కట్టి, ముష్టికి బయలు దేరింది. ఆ వేషం చూసి వూళ్లోవాళ్లు "దీనికి పిచ్చి ఎత్తిందేమో" అనుకుని "ఏమమ్మా వూరందరూ, నీ యింట్లో బంగారపు యిటికలు వున్నాయని అనుకుంటూంటే, నీకీ ముష్టి కర్మ మేమిటని గట్టిగా అడిగేరు. నిజం చెప్తే అందరికీ రహస్యం తెలిసిపోతుందని భయము. ప్రశ్నలడిగిన వాళ్లనందరినీ తిట్టడం ప్రారంభించింది పెద్దమ్మ. "దీనికి నిజంగా ఏదో పిచ్చే వుండ వచ్చునని, గుప్పెడు బియ్యం వేసి పంపేస్తున్నారు. ఆ బియ్యం యింటికి తెచ్చి బ్రాహ్మణుడు చెప్పిన నియమాలు అన్నీ పాటించి, భోజనం చేసి, గిన్నెను తోముతో అడగడం ప్రారంభించింది. గిన్నె ఏ జవాబూ యియ్యలేదు. గిన్నె చిల్లు పడేటట్లు కొట్టినా, లాభం లేకపోయింది. పెద్దమ్మ పెద్ద కేకలు పెడుతూ ఏడవటం ప్రారంభించింది. చుట్టు ప్రక్కల వారందరూ విషయ మేమిటో కనుక్కుందామని మూగారు. పెద్దమ్మ జరిగిన కథంతా చెప్పకుండా వుండలేకపోయింది. అందరూ ఆశ్చర్య పోయారు. గుంపులోనుండి ఒక అనుభవశాలి "పెద్దమ్మా, పప్పు గిన్నె ఎక్కడైనా మాట్లాడటం ఎరుగుదువా?" అన్నాడు. యింకొకాయన "ఒకసారి మోసపోతే బాగుండును, రెండు సార్లు మోసపోయిన పెద్దమ్మకి 'దురాశ' అని చెప్పక తప్పదు" అని ఆమెలో గుట్టును బయట పెట్టాడు. "వస్తువులు జాగ్రత్త విషయమై తాపత్రయ పడ్డాను గాని, యిందులో 'దురాశ' ఏముంది?" అని పెద్దమ్మ అంది. "యింతకీ మోసగాళ్లు ఎక్కువయ్యారు లోకంలో" అన్నాడు ఒక ముదుసలి.



అద్దమువల్ల ఆరు వేలు

శ్రీ గుడివాడ వెంకటసుబ్బారావు

అనగా అనగా ఒక వూరిలో ఒక మంగలి గంగయ్య ఉండెను. అతడు నట్టి సోమరి. ఏ పనీ చేయడు. పాపము అతని భార్య చాల మంచిది. పాపము ఏదో ఒక విధముగా గుట్టుగా ఒక పూట తిని ఒక పూట తినక సంసారము గడుపుకొనుచున్నది. పాపము తనకి నలుగురు పిల్లలు. ఎన్నాళ్లని ఆమె ఆ విధముగా పెంచగలదు! ఒక రోజున భర్తతో "ఏమండీ, ఈ విధముగా ఏమీ సంపాదించకుండా వుంటే ఎట్లాగండి? పిల్లలు చూస్తే పస్తువుండలేరు. ఏదో ఒకలాగ నాలుగు డబ్బులు సంపాదించాలిగాని ఈ ప్రకారముగా వుంటే ఎట్లాగండి?" అని అతనిని చాల బాధ పెట్టెను. అతను ఆ బాధ పడలేక తన దగ్గర వున్న మంగలిపొది తీసుకొని బయలుదేరి పోవుచుండెను. మధ్యదారిలో ఒక అరణ్యము వచ్చెను. అక్కడకు పోవు సరికి చీకటిపడిపోయెను. అక్కడ ఒక చెట్టుక్రింద సంచి పరచుకొని దానిమీద పండుకొనెను. కొంత సేపటికి ఆ చెట్టు ఊగుచూ పెద్ద ధ్వని చేయుచుండెను. ఇతనికి నిద్రపట్టుట లేదు. అతను కూర్చుని అటూ ఇటూ చూచుచుండెను. కొంత సేపటికి ఆ చెట్టు నుండి ఒక రాక్షసి దిగి ఈతని వైపు వచ్చుచుండెను. ఈ గంగయ్యకు భయము ఎక్కువయ్యెను. దాని నుండి తప్పించుకొనుట ఎట్లా అని ఆలోచించుచుండెను. కొంత సేపటికి ఆ దెయ్యము దగ్గరకు వచ్చుచుండెను. వెంటనే ఒక ఉపాయము తట్టెను. తన పొదిలో వున్న ఒక అద్దమును తీసి దాని ముఖముదగ్గరగా చూపి ఈ ప్రకారముగా పలికెను: "నేను నీలాంటి దెయ్యములను చాలా వాటిని పట్టి ఈ పెట్టెలో పెట్టుచుంటిని ఈ చెట్టు దగ్గర నువ్వు వున్నావని తెలిసి ఇక్కడకు వచ్చితిని. నిన్నుకూడ పట్టి ఈ పెట్టిలో పెట్టేస్తా" నని చెప్పెను. అంత దాని ముఖము అద్దములో చూచుకొని అది ఇంకొక దెయ్యమని భావించి చాల భయపడి "నన్ను వదలి పెట్టు నీకు కావలసినవి ఇస్తాను" అని ఆ మంగలి గంగయ్యను బ్రతిమిలాడుకొనెను. అంత నాతనికి మరీ లోకువ చిక్కినది. డబ్బు కావలె నని కోరుకొనెను. అంత నా దెయ్యము వెంటనే ఆరువేల కాసుగల ఒక పెట్టెను ఇచ్చి తన ప్రాణములు రక్షించుకొంటిని గదా యని పారిపోయెను. ఈ మంగలి గంగయ్య చాల సంతోషముతో ఇంటికి పోయి భార్యకు చూపి జరిగిన కథ అంతా చెప్పెను. నాటినుండి వారి బాధలు పోయినవి. హాయిగా జీవించుచుండిరి.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

౨౬

అన్నమయ్యగారి రచన: (సంపు ౨; ప.౩౬౧)

శ్రీరాగం - రూపకతాళం

[పల్లవి]

(౧) రి రి రి రి రి | సా , రి గా రి రి స | సా గ రి స ని నీ ప రి స రి , ,
తెలియదు నీ మనసు దే వో త్తమా

(౨) రి రి రి రి రి రి మ పా మా రి గ రీ స | సా రీ గ రి స గ రి స నీ ప ,,
తెలియదు నీ మ నసు దే వో త్త

(౩) రి రి రి రి రి మ ప ని నీ నీ ప మ రి గ రి స ,, ,,
తెలియదు నీ మ న సు

(౪) రి రి రి రి రి మ ప ని స రి గ రి స ని ప మ రి గ రి స | సా రి గ రి స గ రి స నీ ప ని స రి గా , రి రీ ,
తెలియదు నీ మ న సు దే వో త్త మా

(౧) రి స రి మా రి రి మ ప ప ప ప | ప మ పా నీ ప మ ప ని ప మ రీ గ రి సా
సులభుం డ వ ని వి ని ని ను చౌర బా రీ మ న సు

(౨) రి స రి మా రి రి మ పా ప ని ప ని మ ప | ప ని సా , రి స ని ప మ రి మ పా ధ ప ప మ రి రీ గ రి సా
సులభుం డ వ ని వి ని ని ను చౌ ర బా రీ మ న సు

(౩) రి స ని స రి మ రి మ పా ప ని ప ని స ని ప మ పా | ప ని స రి రీ గ రి సా రి స నీ స ని ప మ ,,
సులభుం డ వ ని వి ని ని ను చౌ ర బా రీ ,, ॥ (తెలియ)

[చరణం]

(౧) , ప మ ప మ రి గా రి రి స స | సా రి రి స స ని ని ప ని స రీ స రి రి రి
మాతు ను నీ మూ ర్తి ని చొప్ప గా క న్నె దుట

(౨) , ప మ ప రి రి మ ప ధ నీ ప మ రీ గ రి సా | ,, ,,
మాతు ను నీ మూ ర్తి ని

, రి మ మ రి మ పా , ని పా , ని ప మ రి స | , ని స రి మ రి మ రి మ పా ,
ఆతుమ ద ల పో సే న ను చు అలవరు చు కొం గు ను

, ప ప పా ప ప మ రీ మ ప ని ని | , ని మ మ ప ని ప ని స రి గా రీ రి
నీ తి యెం చి చూ చి తే ను నీ వెం త నే నెం త

(౧) , , ప గ రి సా సా ని ప ని స | సా , రి స ని పా ప మ రి మ ప ధ నీ ప మ రి గ రి సా
ఈ త ల నా య గ్గ లి క కు నే మ ను చు న్నా డ వో

(౨) , ప గ రి స రి ప మ రీ గ రి సా స ని పా ని స రీ | సా , రి స ని ప మ రి మ ప ని సా , ని ప మ రి గ రి రి సా॥
ఈ త ల నా య్య గ్గ లి క కు నే మ ను చు న్నా డ వో ॥ (తెలియ)

ఇట్లే క్రింది చరణములు :

(౨) నెట్టుకొన బూజింతు- నీవు నా వాడవే యంట ;
పెట్టెలోన నుంచి చక్క - బెట్టుకొందును ;
ఎట్టిది నా సాహసంబు - యేమిట నిను మెప్పించితి ?
నట్టనడుమ నన్నెట్లు - నవ్వుతా వున్నాడవో ! (తెలియదు)

(౩) నొడిగి నిన్ను బిలుతు - నోరు నిండ పేరుకొని ;
యెడయ కెం దున్నాడవో ! - యెక్కడెక్కడ ?
అడరి శ్రీ వెంకటేశ - అలమేలుమంగపతివి
వడి నన్నేలితి వటు - వంటి సుకృతివో ! (తెలియదు)

లఘుటీక : చౌరబారీ=చౌరబారీని ; చొప్పగా=స్పష్టముగా ; ఆతుమ=ఆత్మ ; ఈతల=ఈ ప్రక్క ; అగ్గలిక=సాహసము ; నెట్టుకొనక=స్థిరపడునట్లు ; నొడిగి=ఉచ్చరించి ; సుకృతివో=పుణ్యాత్ముడవో.

ముద్రిత పాఠములు : చౌరంబారి ; ఆత్మ ; నినుం బిలుచు.

నేటిప్రపంచం

(9 వ పేజీ తరువాయి)

చేరదు. యూరోపియన్ పార్లమెంటులో అప్పుడు జర్మనీ చేరినా చేరకపోయినా ఆ పార్లమెంటుకు విఘాతమే. కమ్యూనిస్టులు అందులో చేరినా చేరకపోయినా జర్మనీ ఐక్యమయితే పశ్చిమయూరోపియన్ పార్లమెంటును భగ్నం చెయ్యగలరు. జర్మనీ ఐక్యమయితే అట్లాంటిక్ ఒడంబడిక ఫ్రాన్సు, ఇటలీ, బెల్జియం, హాలండ్ లగ్జెంబర్గ్, నార్వే దేశాలకు సంబంధించినంతవరకు నిరర్థక మయినట్లే.

స్పెయిన్:

రైన్ నదీతీరంలో రక్షణ శ్రేణి నిర్మించే పన్నగడ ఈరీతిగా భగ్నమయ్యే పక్షంలో బ్రిటిష్, అమెరికన్ రాజ్యాలు యూరప్‌లో మరొకశ్రేణిని నిర్మించవలసి ఉంటుంది. అది స్పెయిన్ తూర్పునున్న పిరనీస్ పర్వతప్రాంతంలోనే సాధ్యపడుతుంది. అందువలన స్పెయిన్‌ను అట్లాంటిక్ ఒడంబడికలోనూ యూరోపియన్ కౌన్సిల్‌లోనూ చేర్చవలసిన అగత్యం కలుగుతుంది. ఐక్యరాజ్యసమితి రాజకీయసంఘ సమావేశంలో ఈ వారం స్పెయిన్‌పై రెండు తీర్మానాలు ప్రతిపాదింపబడినాయి.

స్పెయిన్‌కు అమెరికా మొదలైన దేశాలు ఆయుధసామగ్రిని సప్లయి చేస్తున్నవని ఆరోపిస్తూ, ఆదేశానికి ఆయుధాల రవాణాను నిషేధించాలని ఒక తీర్మానాన్ని పోలండ్ ప్రవేశపెట్టినది. ప్రజాప్రభుత్వాలపై యుద్ధం పురికొల్పడానికి గాను ఆంగ్లో అమెరికన్ సామ్రాజ్యవాదులు, స్పెయిన్ నియంత ఫ్రాంకోను బలపరుస్తున్నారని రష్యా నిందించింది. స్పెయిన్‌కు ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు రాయబారుల్ని పంప కూడదని 1946 లో చేయబడిన తీర్మానాన్ని రద్దుపరచాలని కోరుతూ, స్పెయిన్‌తో రాయబార సంబంధాలు తిరిగి ప్రారంభించే విషయమై ఆ దేశాలకు నిర్ణయాధికారం విడిచిపెట్టాలని బొలీవియా ఒక తీర్మానం ప్రతిపాదించింది. పోలండ్ తీర్మానం వీగిపోయింది. బొలీవియా తీర్మానం ఆమోదించబడింది. బొలీవియా తీర్మానాన్ని భారతదేశం ప్రతిఘటిస్తూ ఫ్రాంకో పరిపాలనలో గాని స్పెయిన్ పరిస్థితిలో గాని 1946 సంవత్సరానికీ ఇప్పటికీ మార్పు ఏమీ లేనందువలన, ఇప్పుడు స్పెయిన్‌పై నిషేధం తొలగించవలసిన అగత్యం లేదని వాదించింది. కాని బొలీవియా తీర్మానం నెగ్గింది. అమెరికా నిషేధం తొలగించ నక్కరలేదని సభలో వాదించినా, రహస్యంగా బొలీవియాను ప్రోత్సాహపరచిందని కొందరు పత్రికావిలేఖరులు వ్రాశారు.

ఈవార్త నమ్మతగినదిగానే ఉంది. స్పెయిన్‌లో ఏదో పైపై మార్పులు సృష్టించి, అమెరికా ఆర్థికసహాయమిచ్చి, ఐక్యరాజ్య సమితిలో చేర్చడానికి యత్నాలు జరుగుతున్నాయని కూడా వార్తలు వస్తున్నాయి. స్పెయిన్‌ను అట్లాంటిక్ ఒడంబడికలో చేర్చుకోడానికి యత్నాలు జరుగుతున్నాయి.

అరబ్బు పెట్రోల్:

రష్యా అమెరికా రాజకీయ చతురంగంలో జర్మనీ కెంత ప్రాధాన్యత ఉందో అరబ్ దేశాల కంత ప్రాధాన్యత ఉంది. యూరోపియన్ కౌన్సిల్‌లో టర్కీ, గ్రీస్ దేశాలను చేర్చడానికీ, టర్కీతో అరబ్ దేశాలను చేర్చి ఒడంబడికలు కుదర్చడానికి బ్రిటన్ అమెరికా ప్రయత్నం చేస్తున్నాయి. యూరోపియన్ కౌన్సిల్‌లో మధ్యధరాప్రాంతం అంతా చేరాలని బ్రిటన్ అమెరికాల ప్రయత్నం. అయితే అరబ్ దేశాల విషయంలో పెట్రోల్ కంపెనీల మూలంగా బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికాలమధ్య సఖ్యం కుదరడం లేదు. సిరియా లెబనాన్‌లకు ఫ్రెంచిప్రభుత్వం, ట్రాన్స్‌జోర్డాన్‌కు బ్రిటిష్ ప్రభుత్వం, ఇజ్రాయిల్‌కు అమెరికా ప్రభుత్వాలు మద్దతు ఇస్తున్నాయి. ఇజ్రాయిల్‌పై కత్తిగట్టిన అరబ్ దేశాలన్నిటికీ బ్రిటన్ ఫ్రాన్సులు తోడ్పడుతున్నాయి. ట్రాన్స్‌జోర్డన్ రాజు అబ్దుల్లా బ్రిటన్ చెప్పినట్లల్లా ఆడుతున్నాడు. సిరియా, ఇరాక్, ట్రాన్స్‌జోర్డాన్లను చేర్చి విశాల సిరియా రాజ్య స్థాపనకు అబ్దుల్లా యత్నం చెయ్యడానికి బ్రిటన్ మూలకారణమని ఫ్రాన్సు నిందిస్తోంది. ఫ్రాన్సు ప్రాపుగల సిరియా ఈ కార్యక్రమాన్ని ప్రతిఘటిస్తోంది.

పశ్చిమ యూరప్ రాజ్యాల ఆర్థిక పునరుద్ధరణకు తయారుచెయ్యబడిన మార్షల్ ప్రణాళిక పూర్తిగా అరబ్ పెట్రోల్‌పైనే ఆధారపడి ఉంది. అరబ్ పెట్రోల్ గాని, ఆసియా వలస రాజ్యాల ముడిసరుకులుగాని యూరప్‌కు అందని పక్షంలో మార్షల్ ప్రణాళిక వ్యర్థమేనని ఫార్ట్‌నైట్‌లీ పత్రికలో ఒక యూరోపియన్ రాజకీయవేత్త నిరూపించాడు. బ్రిటన్, ఫ్రాన్సు దేశాలకు అరబ్ పెట్రోల్ లభింపచేయడానికీ, తమ స్వంతకంపెనీలకు పెట్రోల్ లభింపచెయ్యడానికీ అమెరికా తోడ్పడుతోంది. బ్రిటన్, ఫ్రాన్సు, హాలండ్ దేశాలు తూర్పుఆసియా వలస దేశాల్లో తిరిగి తమ ప్రాభవం స్థాపింపచేసుకోడానికికూడా అమెరికా సహాయపడుతోంది. లోకాన్ని వంచించడానికి ఆసియా దేశాల జాతీయోద్యమాలపట్ల అమెరికా ఎంత కపటఆదరం ప్రకటించినా అక్కరసమయాల్లో తప్పక అమెరికా తోడ్పడుతుందని బ్రిటన్, ఫ్రాన్సు, హాలండ్ దేశాలు అనుభవపూర్వకంగా గ్రహించాయి. ఇండోనీషియాలో డచ్చివారు అమెరికన్ ఆయుధాల్ని ఉపయోగిస్తున్నా, ఇండోచీనాలో ఫ్రెంచివారు అమెరికన్ విమానాలనుపయోగించి బాంబులు వేస్తున్నా అమెరికా ఆ దేశాల్ని వారించడంలేదు. కమ్యూనిజం వ్యాపిస్తుందేమోనన్న భయంకొద్దీ, జాతీయోద్యమాలపట్ల కపటసానుభూతి చూపుతున్న దేకాని రహస్యంగా సామ్రాజ్యబలాలను బలపరుస్తోంది. యూరోపియన్ రాజ్యాలు నాలుగు సంవత్సరాలలోగా ఆర్థికపునర్నిర్మాణం నెరవేర్చుకోవాలంటే వలసదేశాల్లో వాని ప్రాబల్యం స్థాపించుకోక తప్పదని యూరప్ రాజ్యాలు అమెరికాకు స్పష్టపరిచాయి. అట్లాంటిక్ ఒడంబడిక పర్యవసానంగా ఇప్పుడు ఆ దేశాల దౌర్జన్యాల్ని అమెరికా వారించడంలేదు.

తూర్పు ఆసియా దేశాల్లో కమ్యూనిజం వ్యాపిస్తున్న తీవ్రగతికి సంతృప్తిపడిన రష్యా తన దృష్టిని జర్మనీపైనా, అరబ్ దేశాలపైనా సారించింది. పర్షియాలో అమెరికనులు విమానాశ్రయాలు, నౌకాశ్రయాలూ నిర్మిస్తున్నారనీ, అమెరికన్ సైనిక నిపుణులచేత పర్షియన్ సైనికులకు శిక్షణ నిప్పిస్తున్నారనీ, ఇవి రష్యా పట్ల విరోధ చర్యలుగా పరిగణించగలదనీ రష్యా పర్షియన్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అజర్బయిజాన్ సరిహద్దులో రష్యన్ టాంకు దళాలు కేంద్రీకరించబడినాయని వార్తలు వస్తున్నాయి. ఇజ్రాయల్‌లో కమ్యూనిస్టులు బలపడుతున్నారు.

పశ్చిమ యూరోపియన్ దేశాలు అరబ్ దేశాలగురించి ఏదో నిర్ణయానికి వచ్చేలోగా రష్యా ఊరికే చూస్తూ కూర్చోదు. త్వరలో అరబ్ దేశాల్లో ట్రాన్స్‌జోర్డన్ రాజుకు వ్యతిరేకంగా ప్రారంభించబడిన ఉద్యమం తీవ్రతరం కావచ్చును. ఆఫ్ఘనిస్థాన్‌పై కూడా రష్యా అమెరికాలు రెండూ దృష్టి కేంద్రీకరించాయి. పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్‌పై శత్రుత్వం సాధించడానికి సమయం వచ్చింది.

ఇండొనీషియా:

ఇండొనీషియాలో డచ్చి-రిపబ్లికన్ రాయబార వర్గాల మధ్య సమాధానం కుదిరిందని ఐక్యరాజ్యసమితి కమిషన్ ప్రకటించింది. జోగ్జకర్తా నగరాన్ని రిపబ్లికన్లకు ఒప్పగించి, వారి ప్రభుత్వాన్ని తిరిగి స్థాపించుకోడానికి డచ్చి ప్రభుత్వం అంగీకరించింది. హేగ్‌లో సర్వవర్గాల రౌండ్ టేబిల్ సమావేశంలో పాల్గొనడానికి రిపబ్లికన్ రాయబారవర్గం అంగీకరించింది. ఇండొనీషియా అంతటా యుద్ధం విరమించడానికి ఉభయపక్షాలూ అంగీకరించాయి. ఇంక కమిషన్ ఆధ్వర్యంక్రింద యుద్ధవిరమణ వివరాలపై ఒడంబడిక జరగవలసిఉంది. ప్రస్తుతం రిపబ్లికన్ ఆక్రమిత ప్రాంతాలలో రిపబ్లికన్ పరిపాలన కొనసాగవచ్చునని డచ్చివారు అంగీకరించారు. రిపబ్లికన్ గొరిల్లాలచేత యుద్ధం విరమింపచెయ్యడానికి రిపబ్లికన్ నాయకులు బాధ్యత వహించగలరు. ఒడంబడిక జరగడానికి ముందు ఇండొనీషియాలో పరిస్థితినిగురించి కమిషన్ తయారుచేసిన నివేదిక చూస్తే, యుద్ధవిరమణ వివరాలపై సమాధానం కుదరడం కష్టమని తోచకమానదు. జావా సుమత్రాలలో నగరాలు డచ్చివారి అధీనంలో ఉన్నాయికాని, మిగతాప్రాంతమంతా రిపబ్లికన్ల అధీనంలో ఉన్నదనీ, ఆ ప్రాంతంలోకి డచ్చివారు అడుగు పెట్టలేకుండా ఉన్నారని నివేదికలో చెప్పబడింది. ఇండొనీషియాలో రిపబ్లికన్ ప్రభుత్వానికి ప్రజల తోడ్పాటు ఉన్నప్పటికీ, వారి సైన్యాలు అమెరికా ఆయుధసహాయం పొందుతున్న డచ్చివారి నెదిరింపలేకుండా ఉన్నాయి. ప్రజల విరోధం తెచ్చిపెట్టుకున్న డచ్చివారు దేశంలో కాలూనలేకుండా ఉన్నారు. అందువల్ల ఉభయపక్షాలమధ్యనూ యుద్ధం తేలేది కాదు. అందువల్లనే ఉభయపక్షాలూ ఇప్పుడు యుద్ధవిరమణకు అంగీకరించాయి. ఇదివరలో ఈ కారణంవల్లనే ఉభయపక్షాలకూ మధ్య లింగ్‌జతిలో సంధి కుదిరింది. కాని డచ్చివారు కొంత బలం చేకూర్చుకోగానే, వారికి అమెరికా సహాయం లభించగానే తిరిగి దురాక్రమణ ప్రారంభించారు. కొత్తగా వచ్చిన బలం హెచ్చించుకున్నాక, జోగ్జకర్తా ఆక్రమించుకోవడంతో వారికి కాళ్లు చల్లబడ్డాయి ఆ తరువాత ఎన్నివారాలు గడిచినా, గొరిల్లా ఇండొనీషియన్లని ఊరితియ్యడం తప్ప వేరేమీ చెయ్యలేకపోయినారు. ఒక్క అడుగు ముందు వెయ్యలేకపోయినారు. ఇప్పుడు తిరిగి సంధికి అంగీకరించారంటే, అమెరికన్ కాంగ్రెస్ ఒత్తిడివల్లనే అర్థమనస్కంగా చేసుకున్న సంధిని డచ్చివారెంతకాలం పాటిస్తారు? బ్రిటిష్, ఫ్రెంచి సామ్రాజ్యవాదుల రీతినే మిత్రభేదోపాయాన్ని ప్రయోగించి ఫెడరలిస్టుల్ని బలపరిచి తమ కీలుబొమ్మలుగా చేసుకోడానికి యత్నిస్తున్నారు. ఫెడరలిస్టుల ఉనికికే డచ్చివారు కారకులు. ఇంక రౌండ్ టేబిల్ సమావేశం వీరందరితో ఎలా నడుస్తుందో వేరె చెప్పనక్కరలేదు. భారతదేశంగురించి లండన్ రౌండ్ టేబిల్ సమావేశాల ద్వారైనా పడుతుంది. లేదా అక్కడొక పాకిస్థాన్ (పశ్చిమ జావా) సృష్టించబడుతుంది. ఇవన్నీ తెలిసిన రిపబ్లికన్లు హేగ్ సమావేశాల్లో పాల్గొన్నప్పటికీ తమ ప్రధానలక్ష్యాల్ని విడిచిపెట్టరు. ఫెడరలిస్టుల్ని బోటుగాపెట్టి డచ్చివారు నాటకం ఆడదలిస్తే అది భగ్నం కాక తప్పదు. అందువల్ల ఇది శాశ్వత సమాధానం కాజాలదనీ, తాత్కాలిక యుద్ధవిరమణే ననీ సందేహం కలుగుతుంది.

యూరప్‌రాజ్య సమైక్యత పూర్వాపరాలు

(7 వ పేజీ తరువాయి)

పునర్నిర్మాణానికి అమెరికాకు ఎంత ఋణపడి ఉంటుందో అందరూ గ్రహించినదే. ఈఋణం తలకు మించింది. అమెరికాపై ఈ రీతిగా ఆధారపడిఉండడం ఋణపడి ఉండడం ఎవరికీ ఇష్టం లేదు. అలా ఉండాలని అమెరికన్లూ కోరడం లేదు. బ్రిటిష్ పార్లమెంట్‌లో మే హ్యూ ఉపన్యాసఫలితంగా అమెరికాలో వచ్చిన వ్యాఖ్యానాలు విమర్శలు గమనిస్తే, యూరప్‌ను స్వయం కృషికే విడిచిపెట్టాలనే భావం వారిలో స్పష్టంగా కనపడుతోంది. పశ్చిమ యూరప్ దేశాలన్నీ సహకరించి కృషిచేస్తేగాని అమెరికాపై ఆధారపడకుండా ఆర్థికస్వాతంత్ర్య స్థితి పొందడం అసంభవమని యూరోపియన్ ఆర్థికసహాయసహకార సంస్థ (ఓ. ఇ. ఐ. సి.) స్పష్టంగా చెప్పింది. ఏ దేశానికా దేశం స్వయంగా ఆర్థిక స్వాతంత్ర్యం లభింపచేసుకోవాలంటే అది అసాధ్యం. ఈకారణంవల్లనే ఇప్పుడిప్పుడే దేశాలలో ఆర్థిక సమస్యల్ని జాతీయావసరాల దృష్ట్యా కాకుండా యూరప్‌ఖండ అవసరాల దృష్ట్యా పరిశీలించనారంభించారు. యూరప్ సమైక్యతా భావం కొత్తగానూ వింతగానే ఉంది కాని అది క్రమంగా ప్రజల్లో రూపొందుతోంది. యూరప్ పూర్వ ఔన్నత్యాన్ని పునరుద్ధరించి నూత్న ప్రపంచానికి (అమెరికాకు) గుణపాఠం చెప్పాలనే కోరిక, ఆత్మాభిమానం యూరప్‌లో వ్యాపిస్తోంది.

అయితే బెల్జియన్ ప్రధాని చెప్పినట్లు యూరప్ దేశాలకు సమైక్యత తప్ప వేరే ముక్తిసాధనం లేదనే విషయం తథ్యమే కాని, దీన్ని సాధించడానికిగాను ఆ దేశాలు కొంత త్యాగాలు చెయ్యవలసి ఉంటుంది. జాతీయాభిమానం ఒక్కటే గాదు. సిరిసంపదల్లోకూడా కొంత త్యాగం చెయ్యవలసి రావచ్చును. సైనికరంగంలో స్థాపించబడిన అయిదురాజ్యాల సంయుక్తసంస్థ ఏపనికీ నచ్చడంలేదు. ఆ దేశాల మధ్య వైషమ్యాలు ద్వేషాలు నశించిపోలేదు. కాని సహకార సమైక్యతలు ఇంకా అలవడవలసి ఉన్నాయి. రెండు ప్రపంచయుద్ధాలలో సైనిక ఆర్థికాది విషయాలలో సహకారం చక్కగా నెరవేరింది. మార్షల్ ప్రణాళికను అమలు జరపడానికిగాను వివిధదేశాల మధ్య ఆర్థికసహకారం నెరపడానికి స్థాపించబడిన యూరప్ ఆర్థిక పునర్నిర్మాణ కార్యక్రమ సహకారసంస్థ (ఓ. ఇ. ఇ. సి.) చక్కగానే పనిచేసింది. అక్కడకూడా సంఘర్షణ సంభవించకపోలేదు. అదే రీతిగా ముందుకు సహకార ఐక్యతలు సాధ్యం కాలవు.

వింతలు: విశేషాలు

తిరుగుడు కండ్లు

కాకికండ్లు ప్రక్కకుండుటవలన, ముందువైపు ఎక్కువభాగము కనుపించదు. ఏదైన చూడవలెనన్న ఆ భాగమునకు తలత్రిప్పిచూస్తుంది. అందువలననే ఒకకన్ను గుడ్డిఅని సామాన్యంగా అనుచున్నారు. ఊసరవల్లికి ఒక కన్నుతో ముందుకు, మరొక దానితో వెనుకకు చూడగల అమోఘశక్తి కలది. గుడ్లగూబకు, కండ్లకుడ్లు ముందుకు నెట్టి చూడగల శక్తి కలదట!

సాలీడు విందు

బరాజుసాలీళ్లవల - గూడుకాదు. ప్రణయకాల మయినతరువాత, చాల సాలీడులలో, పాపం, ఆడసాలీడులు ప్రేమపట్టలేక, మగవాటిని మింగివేస్తయట మగసాలీడులు చిన్నవిగా ఉండుటలో ఇది వీలగునట!

ఎండ్రకాయ బరువు

ఎండ్రకాయలు చిన్నపిల్లలుగ నున్నప్పుడు నీళ్లలో ఈదుతూ కాలము గడుపును. పైపెంకు బరువెక్కకొలది క్రిందికి దిగిపోతుంది. చివరకు ఒడ్డుకు చేరి ప్రక్కప్రక్కకు పరుగెత్తుతూ కాలము గడుపుతుంది.

ఒకే మంచినీటికి అనేకరుచులు

గోధుమరొట్టె నమిలితే తియ్యనగును. ఉసరికాయ తిని నీరు త్రాగితే తియ్యగుండును. వాకింజకాయ తిని నీళ్లు త్రాగితే చేదు అనిపించును.

చెట్టురసానికి ఒత్తిడి కలదు

ఆముదపుచెట్టుకు ఒకప్రక్క కొమ్మకోస్తే, మరొకప్రక్కకు వంగును. ఈ వంగిన చెట్టును, మంచినీళ్లలో పెడితే, వంకర ఎక్కువగునట. ఉప్పునీళ్లలో పెడితే నిటారుగా వచ్చునట! వీటికి కారణము చెట్టులోని రసపు ఒత్తిడే.

చలికి మనమే కాదు కాళ్లు ముడుచువారము

రాత్రులు చెట్లు ఆకులను ముడుచుట, చింత తంగేడు, దురిసెన మొదలైనవాటిలో చూడగలము. చలిబారినుండి తప్పించుకొనుటకే ఈలా ముడుచుకుంటవట.

హిమాలయ - పసిఫిక్

నీటిలో శబ్దవేగము సెకండుకి 4,900 గులు. నీటిపైనుండి శబ్దము పంపితే ప్రతిధ్వని ఎంతకాలానికి వినుపిస్తుందో సరిగా కొలచి, సముద్రపు అడుగుభాగ దూరమును కనుగొనవచ్చును. ఈ విధంగా కొలిస్తే పసిఫిక్ సముద్రములోని లోతు, చందమామలోని కొండలఎత్తు ఒకటేనట. అందువలన చందమామ పసిఫిక్ మహాసముద్రములోని చీలిపోయిన భాగమంటారు. హిమాలయపర్వతాల ఎత్తంతో అంతకు కొద్దిగ లోతుగానే ఉన్నదట పసిఫిక్ అగాధము.

మావో సీ-టంగ్

చైనా కమ్యూనిస్టు నాయకుడు

శ్రీ శిష్ట్లా

మప్పది లక్షుల చైనా కమ్యూనిస్టులకు నాయకుడై తద్వారా పదహారు కోట్ల ఎనభై లక్షుల ప్రజలకు పెద్దయైన మావో సీ-టంగ్ యాభైయైదు సంవత్సరాల యీడున గూడా అధికారమదమునకు గాని ప్రతిష్ఠా ఉన్నతతకు గాని లోబడినవాడు కాడు. కనులకట్టే దుస్తుల ధరించడు. సౌధాంతఃపురాలలో నివసించడు. అతను వసించే ప్రదేశము యెనాన్ నదీతీరాన గుహావాసములలో మామూలు ప్రజలు వసించే మాదిరిగనే ఉండును. అతని అనుచరులు ధరించే వడుకు నూలుచే తయారైన దుస్తులనే ఆతనూ ధరిస్తాడు. అతను కమ్యూనిస్టుల మిలిటరీ నాయకుడే గాక రాజకీయ నేతృత్వమందునూ మానసికౌన్నత్యమందునూ నిపుణతగలిగి గ్రంథకర్త యని గూడ పేరుబడిసినవాడు. చైనా దేశ కమ్యూనిస్టులు ఆదిలో పడిన సాధకబాధకాలు ఇతనూ పడినా, ఆయాదిలో కమ్యూనిస్టులు పొందిన ఓటమికి ఇతను వశ్యుడు కాక ఇప్పటి యీ సర్వోన్నత్యత పొందినా డంటే దానికి కారణము అతనిది ఒక ప్రత్యేక కమ్యూనిస్టు దృక్పథము కావటమే. అనగా పాశ్చాత్య కమ్యూనిజము చైనాకు పనికి రాదనియూ చైనాయొక్క ముఖ్యావసరము స్వచ్ఛమైన మార్క్సిజమునే బహుళ ప్రజయైన రైతుల సంప్రదాయానికి అనుకూలముగా మార్చి అభ్యుదయమును కలిగించు చేయవలెనియూ తెలుసుకున్నవాడు మావో సీ-టంగ్.

మిలిటరి నాయకుడనియూ రాజకీయవేత్తయనియూ, రచయిత యనియూ మావో సీ-టంగ్ పొందిన పేరునకు పునాదులు ఘట్టివే వున్నాయి. అతని ఫలదాయకక్రియలే అట్టి పునాదులను వేశాయి. 1927 సంవత్సరమందు మావో యున్నూ నేటి సైన్యాధ్యక్షుడైన ఘూ తే యున్నూ మూడువేలమందేయైన కమ్యూనిస్టు దళాలను అంతకు ఎన్నోరెట్ల ధికసంఖ్యాకులైన కోమింటాంగ్ సైన్యములమీదికి నాయకించి వారిని ఓడింపజేశారు. ఆతర్వాతే వరుసగా అయిదు సంవత్సరాలు కమ్యూనిస్టు ఉద్యమము నిరాఘాటంగా పెరిగింది.

ఆతర్వాత 1934 సంవత్సరమందు చియాంగ్ కాయి షేకుకు సలహాదారుడు, జర్మనీ యుడు, వాన్ సెక్టు అనే అధికారిక్రింద ప్రభుత్వ సేనలు కమ్యూనిస్టులను దక్షిణ చైనా దేశములో మట్టుముట్టి ఒత్తిడించాయి. అప్పుడు మావోయున్నూ ఘూ తేయున్నూ ఎకరేసేనలలోంచి బారబడి తప్పించుకుని 6,000 మైళ్లు మజిలీలుచేసి ఉత్తర చైనాకుపోయారు.

అసలు మావో జీవితము అతని ఆరవయేట, 1893 సంవత్సరములో హునాన్ పరగణాలో తండ్రి వ్యవసాయమందు పాల్గొనుట నుంచీ ఆరంభమైనదని చెప్పవచ్చు. 1911 వ సంవత్సరమందు ఇతను లి యువాన్-హుంగుయొక్క విప్లవ కక్షతో చేరాడు. అప్పుడే అతను సోషలిజమును గురించి తెలుసుకోనారంభించాడు. రష్యాలో 1917 లో విప్లవ మారంభమయేసరికే ఇతను చైనాలో ఒక రాజకీయనాయకుడైనాడు. తన చుట్టూ "సీన్ మిన్ స్యూ హుయ్" అనే ఒక కూటమిని చెర్చుకున్నాడు. "ప్రజానీకము ప్రజాస్వామికానికై ఎదురుచూస్తోంది. ఆదుర్దా పడుతోంది. మన కక్షు ప్రజానీకంతో యేకీభవించాలి. మందితో మనం కలియాలి. కలిసి, వాళ్లను తయారుచేయాలి" అని అతడప్పుడన్న వాక్యాలు నేడు నిజమని రూఢియౌతున్నాయి.

ఇతను మొదట ప్రచురించింది "చీనా దేశమందు వివిధ తరగతి ప్రజానీకమూ - వాటి సమీక్ష" అనే గ్రంథము. ఇతని సూత్రాలు కమ్యూనిస్టు సూత్రాలైనా రైతుదృష్టి కలిగినవి. వాటిని చివరకు మాస్కో వారు గూడా ఆమోదించారు.

అప్పటికప్పుడే కోమింటాంగువారు కమ్యూనిస్టులపై యుద్ధానికి పూనుకున్నారు. ఆ కారణాన మావో కమ్యూనిస్టు 4 వ సైన్యానికి పరిపాలకుడైనాడు. ఇతని ముఖ్య స్నేహితుడు మిలిటరీ ప్రముఖుదూ అయిన చూతే సైన్యాధ్యక్షుడైనాడు. క్యాంగ్సీలో ప్రభుత్వాన్ని ప్రత్యేకపరచి రైతు సాముదాయక ప్రభుత్వాన్ని నెలకొల్పారు.

క్యాంగ్సీ ప్రభుత్వానికీ కోమింటాంగుకూ వైరము విచ్ఛలవిడియై పోయింది. కాని జపాను వారు చైనాను దండెత్తడములో వారిని సంయుక్తంగా అరికట్టుదామనే సందేశాన్ని మావో తెలియజేశాడు. దానికి చియాంగు ఒప్పుకోక చైనాకు ముఖ్యవిరోధులు కమ్యూనిస్టులే అన్నట్లుగా వారిపైకే దాడిపోయాడు. దైవవశంగా ఈయుద్ధంలో కమ్యూనిస్టులే విజయం పొంది చియాంగునుగూడా పట్టుకున్నారు. కాని కమ్యూనిస్టునాయకులలో మూడవ ముఖ్యుడైన చౌ ఎన్ లాయి చియాంగును రక్షించాడు. ఇది కారణంగా జపానును ఎదిరించడములో రెండు పక్షాలూ ఏకీభవించాయి.

ఇదే సమయాన రెండవ ప్రపంచ యుద్ధము ఆరంభమైనది. ఈయుద్ధాన్ని "పిచ్చికుక్కలు తమ గొంతులకు తామే ఉరిపోసుకుంటున్నాయి" అన్న రీతిగా మావోజీ వర్ణించాడు. ద్విగుణీకృతోత్సాహంతో ఉద్యమం చలాయించాడు. ఒక వైపున జపానుతో పోరాటం. ఇంకొక వైపున విప్లవపథాన్ని మంది కందజేయుట. ఇదే ఇతని కార్యక్రమం. అయితే విప్లవ విషయంలో మాత్రం చియాంగుకు ఇతను విరోధియైనాడు.

ఆంగ్ల పక్ష సైన్యాలు జపానువారిని ఓడించగలుగుతాయని లాటరీ యాడిన చియాంగు కాయి షేకు తలంపులు రూఢియైనాయి. అమెరికా వారి సాయంగూడ అట్లే అఘాతంగా వస్తూంటుంది అనికూడా ఇతను వేసుకున్న లాటరీబల్ల ఫెల్లు మన్నది.

ఇటీవల ప్రభుత్వ సైన్యాలకూ కమ్యూనిస్టులకూ జరుగుతున్న యుద్ధాలలో కమ్యూనిస్టులు పొందుతున్న విజయాలను చూస్తే చియాంగుయొక్క రాజకీయ వ్యూహంలో పొరబాట్లను గ్రహించగలుగుతాము. ఈ యిరుకక్షులవారికీ 1927 సంవత్సరమునుంచీ జరుగుతున్నది యీ అధికారయుద్ధం. 1911 లో ఆరంభమైన విప్లవం 1949 సంవత్సరంలో రెండవ అధ్యాయం అంగుకున్నది.

నేడు మావోకు 56 సంవత్సరాలు. అయినా, వెనకటికన్న మనిషి కొంచెం లావుబారినా దిట్టతనం పోలేదు. శారీరదార్ఢ్యం సన్నగిల్లక పోగా మానసికపటుత్వం మంచి చావలో వున్నది. 1893 సంవత్సరమున జన్మించిన యితడు పుట్టిన నాటి రైతు ప్రకృతిని రైతుగా యెరిగిన వాడు. నూటికి 80 వంతున రైతులైన చైనా దేశీయులలో ఇట్టివానికుండే పరపతి ప్రతిష్ఠలు మన మూహించుకోవచ్చు.

రైతుప్రకృతిగలవాడు మావో అనుటలో అతను విద్యలో తగ్గినాడా? స్వయంకృషిచేత, ఆధునిక దేశాలగురించీ, ఆధునిక సమస్యలగురించీ యితనూ ఎంతో చదువుకోవడమేగాక, చైనా దేశపు పురాతన గ్రంథాలను పరించి పురాతన విషయాల నెన్నో గ్రహించాడు. విద్యాధికుడే కాదు, విజ్ఞానాధికుడు కూడా అయినాడు. ఈయన రచించిన గ్రంథాలను, ముఖ్యంగా మిలిటరీ విషయాలగురించి రచించిన వాటిని జపాను, రష్యను, ఇండియా, బర్మా, ఇంగ్లాండు దేశ భాషలలోకి తర్జుమా చేశారు.

ఈనాడీయనను చైనీయులు "ఘూసి", అనగా సర్వ అధ్యక్షుడు అని సర్వసాధారణంగా పిలుస్తారు. ఈయన కమ్యూనిజములోని రహస్య సూత్రం ఒకటే: పాశ్చాత్య కమ్యూనిజమును అదే పోతగా చైనాలో వ్యాపింపచేయడములో ప్రయోజనము లేదు. చైనీయుల రైతుసాంప్రదాయతో దానిని మిళితపరిస్తేనే అభ్యుదయం కలుగుతుంది.

దక్కనుశిల్పం (వినోదయాత్ర):

హైందవ దేవాలయాలు

శ్రీవసంతరావు రామకృష్ణరావు

దక్కను పీఠభూమిలో హైదరాబాదు, నైజాము, బీరారు రాజ్యప్రాంతాలలో ప్రాచీన హైందవ కళాప్రావీణ్యతను, శిలానిర్మాణ వైభవాన్ని వెల్లడిచేసే దేవాలయాలు చాలా ఉన్నవి. ఆకారంలో, నిర్మాణప్రాభవంలో, బుద్ధయుగంనాటి శిల్పవైభవాన్ని ఈ దేవాలయాలు చాటుతున్నవి. ఎత్తయిన మండపాలతో, వర్తులాకారంగా, గుహాకారంగా నిర్మింపబడిన దేవాలయాలు ఈ ప్రాంతాలలో విశేషంగా నున్నవి. దక్కను శిల్ప నిర్మాణ ప్రావీణ్యతలో ద్రావిడులు కడు ప్రాచీనులు—కాని ద్రావిడ దేవాలయాలు క్షీణించి పోయినవి—నేటిదేవాలయాలు 'చాళుక్య' నిర్మాణ పద్ధతిలో ఉన్నవి. దక్షిణోత్తర శిల్పాల మిశ్రమ నిర్మాణమే చాళుక్యుల నిర్మాణవిధానం. ఇట్టి దేవాలయాలలోని విగ్రహాలు విశేషమైన శిల్పకళాసౌష్ఠవంతో నిండి ఉన్నవి.

'వరంగల్' జిల్లాలోని పల్లంపేటలో చాళుక్యపద్ధతిలో నిర్మింపబడిన దేవాలయాలు అనేకం ఉన్నాయి. అచట ఒక ప్రధానదేవళం గోడలపై, దేవతలు, సైనికులు, గాయకులు విగ్రహాలు రమణీయంగా చెక్కబడిఉన్నవి. నల్లరాతితో తయారైనప్పటికీ విగ్రహాలు కన్నులపండువుగా కనుపిస్తవి. శృంగారరసప్రధానమైన భంగిమలతోను, దృశ్యాలతోను నిండిన దేవాలయాల శిల్పవైభవం ఊహాతీతంగా గోచరిస్తుంది.

హైదరాబాదుకు వాయువ్యదిశగా వినోదయాత్ర చేసేవారికి దాక్షిణాత్యుల శిల్పవైభవం లెక్కగా ప్రస్ఫుటమవుతుంది. ఈ శిల్పం పదమూడవ శతాబ్దంనాటిది. "బీద్" అనబడే పట్టణంలో ప్రత్యేకతను వ్యక్తీకరించే దేవాలయం ఉన్నది. ఈపట్టణం చారిత్రక ప్రసిద్ధమైన సైనికకేంద్రస్థానము. ఇచ్చట దక్కను దేశమంతటికి ప్రసిద్ధిచెందిన విశిష్ట శిల్పకళా విన్యాసరేఖలు, దేవాలయాలలో, మసీదులలో, గోరీలలో గోచరిస్తవి. ఇచ్చట 200 అడుగుల ఎత్తుగల దేవాలయం ఉన్నది. ఎత్తయిన గోపురాలు, అష్టభుజాకారంలో మలచబడిన మండపం, దక్కనుశిల్పకళావిశేషాన్ని వెల్లడిచేస్తాయి. దేవాలయనిర్మాణంలో పాలగచ్చు విశేషంగా ఉపయోగింపబడినది. ఈశిల్పం పదునేడవ శతాబ్దంనాటిది. ఆకారంలో గంభీరంగాను, కళావైభవంలో సౌమ్యంగాను నిర్మింపబడిన శిల్పవిన్యాసం చూపఱులకు అపూర్వానందాన్ని కలిగిస్తుంది!

నిజాము రైలుమార్గంలో చొండిస్టేషనుకు 8 మైళ్ల దూరంలో నున్న జొండ పట్టణంలో చాళుక్యపద్ధతిని నిర్మింపబడిన దేవాలయం ఉన్నది. ఈ దేవాలయం వెలుపలి గోడలపై సమూహంగా విగ్రహాలు చెక్కబడినవి. గర్భాలయంలో నక్షత్రాకారంగల మండపం ఉన్నది. ఉన్నతమైన స్థూలమైన స్తూపములతో చూడటానికి అందంగా ఉంటుంది. దాక్షిణాత్యుల శిల్పచాతుర్యానికి ఈ దేవాలయం ప్రాముఖ్యమైనది.

మనదేశంలోని ద్వాదశ ప్రధానలింగములలో నొకటి పైన వివరించిన దేవాలయంలో ఉన్నది. ఆ పవిత్రత కారణంగా ప్రతియేడు "శివరాత్రి" మహోత్సవం వైభవోపేతంగా సాగుతుంది. ఈ వుత్సవానికి నలుమూలలనుండి యాత్రికులు వస్తారు.

దక్కను శిల్పంగూర్చి ఫెర్గూసను ఈవిధంగా వ్రాశుచ్చాడు: "శిల్పనిర్మాణానికి ఓర్పు అవసరం. దక్కను దేవాలయాలు నిర్మాణవైభవంలో "గోథిక్" శిల్పవిన్యాసాన్ని ధిక్కరిస్తున్నవి. దక్కను శిల్పకళ ప్రశస్తమైనది, ప్రశంసార్హమైనది. దక్కనులోని హైందవదేవాలయాలు ఈ విషయాన్ని ప్రత్యక్షంగా నిరూపిస్తాయి."

గవర్నర్ జనరల్ అధ్యక్షతను రాష్ట్రగవర్నరుల సమావేశం



ఢిల్లీలో మే 8, 9 తేదీలందు రాష్ట్రగవర్నరుల సమావేశం జరిగింది. హెచ్. పి. మోడి (యు. పి.), భవనగర్ మహారాజా (మద్రాసు), యం. యస్. అణె (బిహార్), పక్వాసా (సి. పి.), త్రివేది (తూ. పంజాబ్), పండిట్ నెహ్రూ, శ్రీ సి. రాజగోపాలాచారి, సర్దార్ పటేల్, కట్జూ (ప. బెంగాల్), మహారాజ్ సింగ్ (బొంబాయి), అసఫ్ అలీ (ఒరిస్సా), శ్రీ ప్రకాశ్ (అస్సాం).

అనురాగం

(11వ పేజీ తరువాయి)

వల్లనే, వ్యక్తిత్వంగల మానవులు కూడ హృదయాన్ని చంపుకొని, జీవించాల్సిన దుర్గతి పడుతుంది.

నారాయణ వివాహవిషయంపై పెరిగిపోయిన విషప్రచార ప్రచండ వాతావరణానికి, సీత, సీతభర్తకూడ తట్టుకోలేక పోయ్యారు.

గత్యంతరం లేక, భర్త మరీ పట్టుదల పట్టడం వల్ల ఒకరాత్రి సీత నారాయణ ప్రక్కలో కూర్చొని "బాబూ! వొప్పుకోవూ!" అని బ్రతిమాలింది.

అక్కమనోవేదన గుర్తించి, ఆమెను తృప్తి పరచటానికి నారాయణ "సరే! అక్కా, మీయిష్ట మెచ్చినట్లే చేసెయ్యండి" అన్నాడు.

సీత తమ్ముడి సమాధానానికి కొంత తృప్తి పడి "బాబూ! మనం మానవులం. మానవులుగానే పుట్టి, మానవులుగానే జీవితం గడుపుకొని, మానవులుగానే అంతం కావాల్సినవాళ్లం. మానవుడు పరిస్థితుల కెప్పుడూ బానిసే. ఈ ఒక్క విషయంలో నీ కోర్కె తీర్చేశక్తి లేకపోయి నందుకు అక్కని మన్నించు. నీకు వచ్చే భార్య గుణంకలదైతే, నీ జీవితానికి ఏమీ లోటు ఉండదు. వీలైనంతవరకూ ఆ విషయం ఆలోచించే, సంబంధం ఖాయం చేస్తాలే!" అంది.

"సరే!" అన్నాడు నారాయణ.

ఆ రాత్రే సీత తమ్ముణ్ణి పెళ్లికి సమాధాన పరచినతరువాత, భర్తతో సంబంధం విషయమై సంప్రదించింది. రెండు రోజులు జరిగాక ఆ రాత్రి అన్నం వడ్డిస్తూఉంటేగా భర్త, సీత ముఖంలోకి చూస్తూ "నారాయణకు సంబంధం ఖాయంచేశాను" అన్నాడు.

సీత ఆశ్చర్యంతో "పిల్ల ఎక్కడ?" అంది.

"ఆ మెరకవీధి రంగయ్యకూతురు" అన్నాడు.

ఈ మాటలు వినేటప్పటికె సీతకు వొళ్లు జలదరించింది.

"వొద్దండీ! ఆ సంబంధం" అనేసింది కొంచం ఘట్టిగా. మెరకవీథి రంగయ్యవాళ్ల వంశం, వాళ్ల గౌరవాలు, వాళ్ల ప్రవర్తనలూ, వాళ్ల బుద్ధులు, వాళ్ల గుణగణాలు, ముఖ్యంగా ఆ పిల్ల దొంగబుద్ధి కలదనీ, అదరగణ్ణపు దనీ, అనాకారి అనీ అందరికీ తెలిసిన విషయం.

భర్త, సీతముఖంలోకి తీక్ష్ణంగా జూస్తూ "ఆ.. వద్దా!...అయితే నాకేం తెలియదు' నామాట నిలపనివాళ్లు నామీద భారం ఎందుకు వెయ్యాలి? అయినా యీ దిక్కులేని వెధవకి అసలు పిల్ల నెవరిస్తారు? ఏదో వాళ్లు దయదలిచి ఇస్తామంటే, నీలుగు దేనికి? ఆ పిల్లని చేసుకొంటేనే, వాడికి నా వాకిట్లో స్థానం ఉంది. లేకపోతే దిక్కున్నచోటుకి పొమ్మను తక్షణమే" అన్నాడు కఠినంగా. భోజనాలగదిలో జరిగిన సంభాషణ వరండాలో ఉండి అంతా నారాయణ విన్నాడు. "అంతకాలం ఆశ్రయం యిచ్చినందుకు కృతజ్ఞతగా, బావమాట నిలపటానికి తన నూరేళ్లజీవితం బలి చేద్దామా!" అనిపించింది నారాయణకు ఆ క్షణంలో. కానీ పాతికేళ్లవయస్సూ, అక్క దగ్గరనుండి పొందిన విజ్ఞానం, సంస్కారం, జీవితాన్ని సుఖాంతం చేసుకోవాలనే కోరిక, బలవత్తరమై బావ అన్నమాటలకు హృదయం అభిమానంతో చచ్చి, ఆరాత్రే ఇల్లు వొదలిపెట్టడానికి నిశ్చయించుకొన్నాడు. "అక్క సీతకు తన నిశ్చయాన్ని చెబుదామా!" అని ఆలోచించాడు. అక్క వింటే, ఆమెగొంతులో కొన ఊపిరి ఉన్నంతవరకూ తన్ను గడప దాటనివ్వదు. ఆకారణంగా అక్కకు చెప్పకుండానే, ఆ గాఢనిశీధిలోనే నారాయణ వెళ్లి, నిద్రిస్తూ ఉన్న అక్క పాదాలకు మ్రొక్కి తలుపు తెరచుకొని వెళ్లాలని బయటి గేటుదాక వెళ్లాడు. గేటుకు చేరగిలబడి అక్కసమక్షంలో అంతవరకూ మధుర స్వప్నంలా గడిచిపోయిన, పదహారుసంవత్సరాల జీవితాన్ని తలచుకుని వెక్కి, వెక్కి ఏడ్చాడు. మళ్లీ చెదిరిపోయిన మనోధైర్యాన్ని కూడ తీసుకొని, పదే పదే ఆ అంధకారంలో వెనక్కి తిరిగి ఇంటివంక చూస్తూ నారాయణ సాగిపొయ్యాడు.

* * * *

తెల్లవారేసరికి నారాయణ ప్రక్కమీద లేకపోవటం చూడగానే, సతహృదయం "గుభేలు" మంది. ఆమె కుడికన్ను అదరటంతో ఏదో అపాయం జీవితానికి జరుగనున్నదని ఊహించింది ప్రొద్దెక్కింది, మధ్యాహ్నమయింది, సాయంకాలమయింది, చీకటిపడింది. అర్ధరాత్రి అయింది. నారాయణ ఇంటికి రాలేదు. సీత హృదయం దుఃఖంతో బ్రద్దలు కాజొచ్చింది.

కాలప్రవాహంలో ఒక రోజు గడిచింది. క్రమంగా వారాలు, నెలలు, దాటిపోయినై. గుబులు, గబులుగా సీత రాత్రిళ్లు లేచి తమ్ముణ్ణి తలచుకొని ఏడ్చేది. ఏ పని చెయ్యబోయినా, నారాయణ తనకొంగుపట్టుకొని వెనకాలేఉన్నాడని భ్రమతో, పదే పదే తృళ్లిపడి వెనక్కి తిరిగి చూస్తూ ఉండేది. మరుక్షణంలో కనపడక నిరాశతో మ్రగ్గిపోతూ కన్నీళ్లు కార్చేది. నారాయణ దూరమైనా వున్న బాధలో సీతకు, కూతురు "శాంతి" మీద క్రితం గల ప్రేమ, అనురాగాలుకూడ సన్నగిల జొచ్చాయి. నారాయణ ఆ ఇల్లు వొదలిపెట్టడానికి కొంత "శాంతి"కూడ కారకురాలని ఆమెమనస్సులో ఉంది. రెండు మూడుసార్లు నారాయణ తలుపుకు వచ్చి ఏడుస్తూ "శాంతి, పుట్టకపోయి నా బాగుండేది." అనుకొన్నది సీత.

"భగవంతుడా! నాబిడ్డని నాకు దూరం చేశావా? ఈ జీవితంలో అన్నీ శూన్యమనే ఒకప్పుడు నిరాశతో కృంగిపోతూ, మొండిగా, మోడుగా బ్రతకటం అలవాటుచేసుకొన్నాను. ఇహ యీ నూరేళ్ల జీవితంలో ఆశ, వెలుగు అనేవి లేవనుకొన్నాను. అలాగే బ్రతక నివ్వక పోయావేం? మళ్లీ నారాయుణ్ణి నాదగ్గరకు ఎందుకు చేర్చావ్? శూన్యహృదయంలో నా నారాయుడిచేత మళ్లీ జ్యోతిని ఎందుకు వెలిగింపజేశావ్? మళ్లీ శాంతిగా అలా అన్నా బ్రతక నివ్వలేక పోయావేం? వాణ్ణి వొళ్లో బెట్టుకొని హృదయానికి హత్తుకొని ఎన్నో కలలు కన్నాను. నా జీవితానికి యీ విశాలవిశ్వంలో నా తమ్ముడు—కాదు, నాబిడ్డ నారాయణ ఒక్కడే ఆధారమని, వాడి చేతుల్లోనే, వాడి కళ్లల్లోకి చూస్తూనే, శాంతిగా యీ జీవితాన్ని చాలిద్దామనుకొన్నాను. ఆఖరిక్షణాల్లో అయినా నేనీ ప్రపంచాన్ని ఆనందంతో శాంతిగా వీడిపోవటం నీ కిష్టంలేదా? ఈ దౌర్భాగ్య జీవి జీవితపు ఆద్యంతాలు యిలా విషాదాంతంతోనే ముగియాలా? హృదయంలో సంతానాపేక్ష నశించి, విరక్తిగాఉన్న సమయంలో మళ్లీ "శాంతి"ని ఎందుకు ప్రసాదించావ్? "శాంతి" వల్ల శాంతి ఏర్పడకపోగా, ప్రబల అశాంతే జీవితానికి ఏర్పడ్డది. పైగా ఇప్పుడు దాన్ని అన్ని విధాల ఆడపిల్ల, సమర్థించి ఒక అయ్యచేతిలో పెట్టాలి? మళ్లీ దాని జీవితాన్నిగురించి ఆందోళన..." ఈ విధపు మానసిక వేదనతో సీత మనిషి నీరసించి పోసాగింది. ఎప్పుడు ఆమెముఖంలోకి చూచినా కనుకొలుకుల్లో నీరు చెక్కిళ్లపై కన్నీరు ప్రవహించి, అవి శాశ్వతంగా ఏర్పరచుకొన్న చారలు, మన హృదయాలను దహించేందుకు సిద్ధంగా ఉంటై.

మేనమామ ఇల్లు వొదలి పోవటం పదకొండేండ్ల "శాంతి" హృదయానికి కూడ ఎంతో దెబ్బకొట్టింది. వెనకటి లాగ ఆడుకోవాలనిగాని, పాడుకోవాలనిగాని బుద్ధి పుట్టదు. అన్నానికి వెళ్లితే, ప్రక్కన ఎవ్వరూ కనబడేవారే కాదు. అదివరకు సరసన కూర్చొని మేనమామ కబుర్లు చెబుతూ, ఎంతో ఆనందంతో ఉత్సాహంగా అన్నం తినేది. 'శాంతి'కి ఇప్పుడల్లాంటి మధుర అనుభవాలు లేవు. మామయ్యలేని కొరత ఒకటి, ఇంట్లో అమ్మ మామయ్యకోసరం కుమిలిపోతూ ఉండటం ఒకటి; ఇవి రెండూ ఆ పసిహృదయానికి తీరని వ్యధను కలిగించాయి.

మొదట్లో సీత భర్తకు బావమరది ఇల్లు విడచి వెళ్లాడనే బాధే లేకపోయింది. వాడి ఊసు, పేరు తలవకూడ దనుకొన్నాడు. కానీ క్రమేణా భార్య, కూతురు నిర్జీవంగా అహోరాత్రాలు, తన కళ్లయెదుట అలా కుమిలిపోవటం చూచి, ఆయనకూడ బాధపడ మొదలుపెట్టాడు. ఎప్పుడైతే ఆయన హృదయంలో బాధ రేకెత్తిందో, తాను, తన ప్రవర్తనే కొంత భార్యయొక్క యీ విషాద జీవితానికి కారణ మనే సంగతి గ్రహించాడు. ఆయనలో క్రమంగా భార్య సీతపట్ల సానుభూతి ఏర్పడ మొదలు పెట్టింది.

నారాయణకు పుస్తకాలు, పత్రికలు చదవటంలోగల రుచిని చూపించింది అక్క సీత. ఆ రుచి అనుభవించడానికి అలవాటు పడ్డాక, నారాయణ కనపడ్డపత్రికల్లా, పుస్తకమల్లా తెచ్చి అక్క దగ్గర కూర్చొని చదివి, ఆయా కథల్లో వ్యాసాల్లో నాటకాల్లో, ఆయా పాత్రలు అనుభవించిన అనుభవాలను, ఇద్దరూ ఏకరవు పెటుకొని విషాదాంత మైతే ఏడ్చి, సుఖాంత మైతే ఆనందంతో నవ్వుకొని పుస్తకాలు ముడి చేసేవాళ్లు. అలా నారాయణ సేకరించిన పుస్తకాలు, పత్రికలూ, రెండు అలమరాలు నిండి ఉన్నాయి. అందులో ఒక్కటీ నారాయణ పట్టు కెళ్లలేదు. ఒక రోజున ఆ అలమరాలు తీసి, చిందరవందరగా ధూళితో నిండి ఉన్న పుస్తకాలు దులుపుతూ ఉంటే, సీతకు, ఆ పుస్తకాలమధ్య నిరాశ్రయుడై, దిక్కులేక దీనంగా తనకోసరం ఎదురు చూస్తున్నట్లుగా నారాయణ కనుపించాడు. ఆమెహృదయంలోని దుఃఖభాండం పగిలింది. కన్నీరు వరదలై పారింది. 'శాంతి' పుట్టకముందు, నారాయణ ఒంటరిగా తన చేతుల్లో పెరుగుతున్న రోజుల్లో ఏ ఒక గంటన్నా, అవసరం కొద్దీ నారాయణ్ణి వంటరిగా ఇంటిదగ్గర వొదిలేసి వెళ్తే, మళ్లీ తను తిరిగి వచ్చేటప్పటికి కన్నీళ్లతో ఎలా ప్రత్యక్షమయ్యేవాడో ఆ దృశ్యాలన్నీ కళ్లల్లో మెదిలి సీత ముఖం రెండు చేతులతో కప్పుకొని భోరున వెక్కి, వెక్కి ఏడుస్తూ కూర్చుంది.

పుస్తకాల మధ్య కూర్చొని యీ స్థితిలో దుఃఖసముద్రంలో మున్కలువేస్తున్న సీతను భర్త చూచాడు. అప్పుడప్పుడే క్రమంగా ఆయన హృదయంలో ఏర్పడుతూ ఉన్న సానుభూతి ఆ రోజు పైకి ఉబికింది. ఉండబట్టలేక పోయాడు. క్షణంలో భార్య దగ్గరకు వెళ్లి ఎంతో చనువుతో, గాఢతతో ఆమెకన్నీళ్లు తుడుస్తూ "క్షమించు. జీవితంలో ఏఒక్కరోజూ ఇంతవరకూ నిన్నూ, నీ కష్టాల్నీ, నీ హృదయాన్నీ గుర్తించలేకపోయాను. సానుభూతిగా పలుకరించనైనా పలుకరించ లేక పొయ్యాను. నిన్ను ఇన్ని సంవత్సరాలు ఉసూరుపెట్టి, ఏడ్పించిన దానికి ప్రతిఫలంగా నాకు శిక్ష తప్పదు." అని భర్త పశ్చాత్తాపంతో కన్నీరు కారుస్తూ ఉంటే సీత హృదయంలో అంత దుఃఖంలోనూ, ఏదో తెలియని ఆనందానుభూతి కలిగింది. తన భర్త హృదయశూన్యుడు కాడనీ, ఆ హృదయంలోకూడ ఎక్కడో మానవజ్యోతి ఆరకుండానే వెలుగుతూ, ఇంతకాలం మరుగున పడి ఉన్నదని, ఇప్పటికి దాని కాంతి కిరణాలు పైకి వచ్చాయని గుర్తించి సంతోషించింది.

ఆనాటినుండీ సీత కొంత భర్త సానుభూతితో, తన హృదయభారాన్ని తగ్గించుకో మొదలుపెట్టింది.

కాలప్రవాహంలో నాలుగు సంవత్సరాలు దొర్లిపోయాయి. "శాంతి" పెద్దపిల్ల అయ్యింది. నారాయణ మళ్లీ సీతకు దృష్టిలో అహోరాత్రాలు కనబడసాగాడు. "ఎక్కడున్నాడో? ఎలా ఉన్నాడో? ఒక్కసారి నా గడపలోకి రాకూడదా?" ఈ నిరీక్షణతోనే ఆమె జీవిస్తూ ఉంది.

* * *

బావమాటలు చాటునుండీ విన్న నారాయణ, ఆత్మాభిమానం నిలుపుకోవాలనే పట్టుదలతో అక్క అనురాగానికిగూడ దూరమై, ఇల్లు వదలిపెట్టి వెళ్లాడు. రెండురోజులు రాత్రిళ్లు నడుస్తూ, పగలు చాటుగా విశ్రాంతి తీసుకొంటూ, నలభైమైళ్ల దూరంలో ఉన్న నెల్లూరు చేరాడు. అక్కడ ఒక అభ్రకపుగనిలో నెలకు పదిహేను రూపాయిల జీతంమీద, అభ్రకపురేకులు చీల్చేపనికి కుదిరాడు.

పదిహేనురోజులు చేసేటప్పటికే ఆ పని విసుగుపుట్టింది. మానేద్దామనుకొన్నాడు. మానేసి మళ్లీ తాను చెయ్యగలపని ఏమిటో, ఎవరిఆశ్రయంలోకి వెళ్లాలో తోచలేదు. బలవంతంగా మనస్సును సమాధానపరచి మరో పదిహేనురోజులు పనిచేశాడు. ఆ నెలకు పదిహేనురూపాయిలు జీతం ఇచ్చారు. ఆ జీతపుడబ్బులతో పట్నం చేరాడు. నారాయణకు అక్కసీత అలవాటుచేసిన పుస్తక కాలక్షేపం బాగా కొరవడిపోయి, ఏ పుస్తకాల షాపులోనన్నా, ప్రెస్‌లోనన్నా పనికి కుదిరితే, రోజు మొత్తంమీద ఒక అరగంటన్నా, ఏపుస్తకంతోనైనా, పత్రికతోనైనా కాలక్షేపం చెయ్యటానికి వీలవుతుందేమో ననుకొన్నాడు. హృదయంలో పొడసూపిన యీ కోరిక బలవత్తరమై, పుస్తకాలషాపుల చుట్టూ తిరిగాడు. ఎక్కడా ఖాళీ దొరకలేదు. ఎవ్వరూ అతణ్ణి పనిలోకి తీసుకోలేదు. పట్నంలో దిగేటప్పటికి జేబులో ఉన్న పది రూపాయిలూ, వారంరోజుల్లో హరించిపోయాయి. బజారుపంపులదగ్గర దాహం తీర్చుకొంటూ, సముద్రపువొడ్డున నకనకలాడుతూ రెండురోజులు దుర్భరంగా కాలం గడిపాడు. ఈ రెండురోజులూ, అక్కసీత బాహువుల్లో అనుభవించిన పదహారేళ్ల జీవితం, కళ్లల్లో మెదలసాగింది. "మళ్లీ అక్కవాకిట్లోకి వెళ్దామా!" అని ఆలోచన వచ్చింది. అభిమానం మనస్సుని పీకింది. "తీరా వెళ్తే, బావ ఏమంటాడో? లోకమేమంటుందో? వాటికన్నా ఈ గుక్కెడు ప్రాణాలు ఇక్కడ వదిలితే యేం?" అనుకొని, ఆ ప్రయత్నం, ఆలోచనలూ మానుకొన్నాడు.

నారాయణ మర్నాడు మళ్లీ పత్రికాఫీసుల చుట్టూత, ప్రెస్సుల చుట్టూత తిరిగాడు. లాభం లేకపోయింది నిరాశ చేసుకొన్నాడు. ఇహ ఏ పని అయినాసరే కడుపునింపుకోవటానికి చెయ్యాల్సిందే ననుకొన్నాడు. ప్రపంచమంతా బ్రతుకుకోసం బానిసత్వంచేస్తున్నప్పుడు, తానుమాత్రం తలవొగ్గక తప్పేదేముంది? ఈఆలోచనతో నడుస్తున్న నారాయణకు "శిల్పవిద్యాపీఠం" అన్న అక్షరాలుగల బోర్డు కనుపించింది. అతని మనస్సులో ఏదో ఆశాజ్యోతి తళుక్కుమని మెరసి మాయమయింది. ఆ మందిర ప్రబయటి గేటు త్రోసుకొంటూ నారాయణ లోపలికి వెళ్లాడు. అక్కడ రక, రకాల సిమెంటు లోహపు విగ్రహాలు, తయారు చేయబడుతున్నాయి. ఒకొక్క విగ్రహందగ్గర ఇద్దరు ముగ్గురు మెరుగులు దిద్దుతూ, వన్నెలుదిద్దుతూ ఉన్నారు. వీరందర్నీ పరిశీలిస్తూ, శిల్పాచార్యులు అటూ, ఇటూ తిరుగుతూ, వారు చేస్తున్నపనులలో, లోటుపాట్లు చెప్పి, సరిదిద్దుతూ ఉన్నారు. నారాయణ వెళ్లి ఎంతోసేపు ఆవిగ్రహాలనూ, పనివాళ్లనూ, నేర్చుకొంటున్న శిష్యకోటినీ, ఆచార్యునీ చూస్తూ నిలబడ్డాడు. నారాయణకు ఆ వాతావరణం ఎంతో ఆనందాన్ని అతనిలో నిద్రాణమైయున్న జీవశక్తిని, పునర్జీవింప చేయగలిగిందిగా కనుపించింది. శిల్పాచార్యులు, విగ్రహాలవంక ఏకదీక్షతో చూస్తున్న నారాయణ్ణి సమీపించి "ఎవరు మీరు?" అన్నారు. "ఎవరు మీరు?" అంత గౌరవంగా, ఆప్యాయతతో తన్ను ఇంతవరకూ అక్కసీతను వొదిలిపెట్టివచ్చాక, ఈ లోకంలో పలుకరించినవాళ్ళే లేరు. అతని వదనంలో ఆశారేఖలు, ఆనందజ్యోతులు వెల్లి విరిశాయి. కష్టాలతో కృంగిపోయిన ఆ మానవుని ముఖంలో అల్లాంటి తేజస్సు ఒక్కసారిగా చూడగానే శిల్పాచార్యుల హృదయంలో అతనిపై ఏదో తెలియని సానుభూతి, అనురాగపు బీజము పడింది. మళ్లీ "ఎవరు మీరు?..." అని శిల్పాచార్యులు వెనకటికన్నా ఎక్కువ మృదువుగా అడిగారు. నారాయణహృదయం సమాధానంకోసరం వెతికింది. ఏం చెప్పాలో అర్థం కాలేదు. చివరకు, లేని ఓపికతో "బాబూ తల్లిదండ్రులకు చిన్నతనంలో నేదూరమైన వాణ్ణి అక్క అనురాగపు ఛాయల్లో ఇంతవరకు శాంతిగా బ్రతికాను. కానీ కాలశాపం బలవత్తరమై, విషమపరిస్థితులను కల్పించి, అక్క నుండీ దూరంగా లాక్కొచ్చింది. ప్రస్తుతం ఆశ్రయదాతకోసరం వెతుక్కొంటూ వచ్చాను. ఈ 'శిల్పవిద్యాపీఠ' ఆవరణంలో మీ పాదాల దగ్గర ఇంత స్థాన మిప్పిస్తే కృతజ్ఞతతో బ్రతుకుతాను." అని నారాయణ దీనంగా శిల్పాచార్యుల ముఖంలోకి చూచాడు. నారాయణదృక్కులు ఆచార్యుల హృదయాన్ని కలిచివేశాయి. అతని స్థితిని చూచి "స్థానం లేదు. ఫో" అనటానికి శిల్పాచార్యులకు నోరు రాలేదు. కొంతసేపు ఆలోచించి "సరే! ఇక్కడే ఉండు. పని నేర్పుతాను" అన్నారు. నారాయణచెవులకు, శిల్పాచార్యుని మాటలు అమృతవాక్కులుగా వినిపించాయి.

కష్టంలో, నిరాశ్రయుడై మానవుడు కాళ్ల దగ్గరకు వచ్చి నీడకోసం ప్రార్థిస్తే, ఆ ప్రార్థనకు ప్రతిగా సానుభూతిచూపిన మానవహృదయానికి జీవితం అంకితం చెయ్యటం, వ్యక్తిత్వం, కృతజ్ఞతాభావం, విశ్వాసం గల మానవధర్మం. ఆ ధర్మాన్ని గుర్తెరిగే నారాయణ అనురాగ

మూర్తియైన గురుదేవుల పాదాలు తాకి తన కృతజ్ఞతాభావాన్ని భక్తిని ప్రదర్శించాడు.

అతని ప్రవర్తన శిల్పాచార్యుల హృదయానికి పూర్తి సంతుష్టి నిచ్చింది.

ఆ రోజునుండీ నారాయణ శిల్పవిద్యాపీఠ మందిరంలో గురుదేవుల కరుణారసంలో, శిల్పవిద్య నభ్యసిస్తూ ఉన్నాడు.

*   *   *

మూడుసంవత్సరాల కాలచక్రం గిర, గిరా తిరిగిపోయింది. ఆ సంవత్సరం, ఉగాదికి, తెలుగునాడులో ప్రసిద్ధి కెక్కి వన్నెగాంచిన విజయవాడ పట్టణంలో ప్రత్యేక కళాప్రదర్శనం ఏర్పాటు చేయబడింది. ప్రదర్శన నిర్వాహకులు దక్షిణభారతంలోగల శిల్పులకూ, చిత్రకారులకూ, తమ, తమ ఉత్తమ కళాసృష్టులను పంపవలసిందిగా ఆహ్వానాలు పంపారు. శిల్పవిద్యాపీఠ గురుదేవులకు గూడ ఆహ్వానం వచ్చింది. వారు ఆ ఆహ్వానాన్ని నారాయణ్ణి పిలిచి చూపించి ఒక ఉత్తమ కళాశిల్పాన్ని, అతని సొంత ఊహా, ప్రజ్ఞలను యిమిడ్చి తయారు చెయ్యవలసిందిగా ప్రోత్సహించారు.

నారాయణ ఎంతో ఆలోచించాడు. "ఎలా తయారు చెయ్యాలో? ఏం తయ్యారు చెయ్యాలో?" అని. అర్థం కాలేదు. ఆరాత్రి మామూలుగా, నిద్రకు వెళ్లే ముందు అక్కసీతను స్మృతిలోకి తెచ్చుకొన్నాడు. అక్క తన ఎదటున్నట్టే భావించి, తన మనస్సులోని సమస్యను ఆమెముందు పెట్టి ఆచనలో మునిగాడు. అక్క సమక్షంలో గడచిన పదహారుసంవత్సరాల్లు, మళ్ళీ ఒక్కసారి గిర్రున తిరిగాయి. ఆరాత్రి స్వప్నంలో కూడ అక్కనే చూచాడు. "ఏడుస్తున్న తన్ను అక్క ఎంతో అనురాగంతో హృదయానికి హత్తుకొని, ఆమెదివ్యహస్తంతో వెన్ను నిమురుతున్నట్టుగా" దృశ్యం కనుపించింది. మరునాడు నారాయణ ఆ దృశ్యాన్నే తన ప్రజ్ఞతో శిల్పానికి వస్తువుగా తీసుకొని, కష్టపడి పూర్తి చేశాడు. శిల్పాచార్యులు శిష్యుని దివ్యహస్తంలో గలకళాప్రజ్ఞకు అచ్చెరువుపొందారు. "తన శిష్యుడు నారాయణ తనకన్నా శిల్పంలో సిద్ధహస్తుడు," అనుకొన్నాడు శిల్పాచార్యులు. శిల్పంక్రింద చెక్కబడ్డ అక్షరాలు చదువుతూ ఉంటే నారాయణహృదయంలో అక్కపట్ల ఎంత ఉన్నతస్థానం ఉందో శిల్పాచార్యులు గ్రహించారు.

పదే పదే ఆ అక్షరాలు చదివారు—"అనురాగమూర్తులు"; "అక్కాతమ్ముళ్లు" అని.

గురుదేవుల ఆజ్ఞ శిరసా వహించి, నారాయణ శిల్పాన్ని ప్రదర్శనకు, విజయవాడకు పంపించాడు. తండోపతండములుగ, ఆ ఉగాది ప్రత్యేకకళాప్రదర్శనం చూడటానికి ప్రేక్షకులు తీర్థప్రజవలె వచ్చారు. వారంరోజులూ ప్రదర్శనంలో ఏగంటలో చూచినా, నారాయణహస్తంతో తయారైన కళామూర్తిచుట్టూ ప్రజలు త్రొక్కులాడుతూనే ఉన్నారు.

ప్రతివారినోట "అనురాగ మూర్తులు." "అక్కాతమ్ముళ్లు" అన్నమాటలే ప్రతిధ్వనించసాగాయి.

దక్షిణభారతంలో కెల్ల నారాయణ సిద్ధహస్తుడై, ప్రజాహృదయముల చూరగొన్న కళాస్రష్ట అని పేరు వచ్చింది. ప్రదర్శన నిర్వాహకులు నారాయణను ప్రత్యేకముగ విజయవాడకు ఆహ్వానించి సన్మానము జేయ అనుమతి కోరిరి. నారాయణ తన గురుదేవులకు ఆ సన్మానము చేయువలసిందిగా వారిని కోరెను. ప్రదర్శన నిర్వాహకులు ఉభయులకు కలిపి నారాయణ అనుమతితో సన్మానించిరి. శిల్పాచార్యులు శిష్యుని భక్తి, తాత్పర్యాలకు అచ్చెరువొందిరి.

ఆరుమాసములు గడిచిపోయాయి.

శిల్పాచార్యులు వ్యాధిగ్రస్తులయి మంచం పట్టిరి. నారాయణ అహోరాత్రాలు గురుదేవుల మంచాన్ని వదలకుండా సేవ చేశాడు. కానీ గురుదేవులకు స్వాస్థ్యము కలుగలేదు.

అంత్యఘడియల్లో శిల్పాచార్యులు నారాయణ్ణి దగ్గరికి పిలిచి "నారాయణ్! ఈ శిల్పవిద్యాపీఠాన్ని నీ చేతుల్లో పెట్టి పోతున్నాను. దీన్ని సర్వవిధాల పోషించి, అభివృద్ధిలోకి తెచ్చి, భారతీయసంస్కృతి, విజ్ఞానాలకు, నెలవైన శిల్ప విద్యాపీఠంగా తర తరాల శాశ్వతంగా ఉండేట్టు కృషిచెయ్యి. మరోకోరిక—" అని శిల్పాచార్యులు మాట్లాడలేక ఆపారు.

"గురుదేవ్! ఏమిటది?" అన్నాడు నారాయణ ఆత్రతతో ఆయనకన్నుల్లోకి చూస్తూను.

"నువ్వు, ఒక ఇంటివాడివి కావాలి. జీవితంలో మనిషికి, మనిషి అండ ఎప్పుడూ అవసరం. నా యీ కోరిక తీరుస్తానని..."ఆ పైన మాట్లాడకుండానే, నారాయణ్ణి వాగ్దానం చెయ్యమన్నట్లుగా, శిల్పాచార్యులు చెయ్యి చాచారు. నారాయణ ఆ పరిస్థితుల్లో ఏం చెయ్యటానికీ తోచక, "అలాగే" అన్నట్లు తల ఊపుతూ, గురువుచేతుల్లో తన హస్తాన్ని ఉంచాడు. శిల్పాచార్యుడు తనచే యెత్తి, నారాయణతలమీద పెట్టి, ఆశీర్వదిస్తున్నట్లుగా నిమిరాడు.

తరువాత రెండు గంటల్లో శిల్పాచార్యులు దీర్ఘనిశ్వాసంతో, ప్రియశిష్యుడైన నారాయణ వొళ్లో పడుకొని కళ్లు మూశారు. అనురాగమూర్తులైన గురుదేవుల హృదయంపై నారాయణ గుండె పగలగొట్టుకొంటూ ఏడుస్తున్నాడు.

*   *   *

తమ్ముడికోసరం నిరీక్షిస్తున్న సీత "ఇహ, లాభం లేదు. మళ్లీ ఈ జన్మలో తన నారాయణ తనకు కనిపించడు." అని నిరాశతోనే కృంగుతూ బ్రతుకుతూంది. మనశ్శాంతికోసరం "శాంతి" చేత అప్పుడప్పుడూ ఏనైనా పుస్తకాలు, పత్రికలూ చదివిస్తూ, వింటూ కూర్చునేది. "శాంతి" ఎంతబాగా చదివినా, విని తల్లి సీత తృప్తిపడలేక పొయ్యేది. ఒకొక్క భావం, ఒకొక్క సన్నివేశం, ఒకొక్కరసానుభూతి, ఒకొక్క నీతి దృక్పథం, ఆయా రచనలలో వింటూ ఉంటే, "అబ్బ! మా నారాయణే ఉంటే ఎంత నిశితంగా విడమర్చి చెప్పేవాడు!" అనుకొనేది సీత. "భగవంతుడు వాడికి వయస్సుకు మించిన మేధస్సు, విజ్ఞానం, పరిశీలనా దృక్పథం, సంస్కారం, వివేకం, విశాల హృదయం,.." అని తమ్ముణ్ణిగురించి ఆలోచిస్తూ ఉండేది. ఆ ఆలోచనల్లో మునిగిపోయినప్పుడు తన ముఖాన్ని, విషాద ఛాయలు అలము కొన్నప్పుడూ నారాయణ ప్రత్యక్షమై తన కన్నీళ్లు తుడుస్తున్నట్లూ, తన చుబుకాన్ని బట్టుకొని బ్రతిమాలుతూ—

"అక్కా! ఎందుకే ఎప్పుడూ అల్లా ఉంటావ్? ఏడుస్తూ ఎప్పుడూ కాలం గడపగలమా? ధైర్యం వహించద్దూ!" అని కర్తవ్యాన్ని బోధిస్తున్నట్లుగా ఓదారుస్తున్నట్లుగా, సీత గత అనుభూతిని స్మృతిపథంలోకి తెచ్చుకొని కొంత దుఃఖాన్ని దిగమ్రింగుకొంటూ ఉండేది.

తమ్ముడు ఇల్లు విడచివెళ్లిన ఈ నాలుగు సంవత్సరాల్లోనూ, సీత ఎన్నో సంవత్సరాలు గడచిన వృద్ధాప్యస్థితిలోకి దిగజారిపోయింది మనిషి. శరీరపటుత్వం సన్నగిల్లింది. వొంట్లో ఓపిక బొత్తిగా తగ్గిపోయింది. ఎముకలప్రోగు, అస్థిపంజరాకారంలాగ మనిషి తయారయింది.

సీత యీ స్థితిలో జీవిస్తూ ఉండగా చూడటం ఆమె భర్తకు కొంచం కష్ట మనిపించింది; ఆలోచించాడు. ఒకవేళ "శాంతి"కి పెళ్లిచేస్తే, అల్లుడు వస్తే, క్రొత్త వాళ్లరాక పోకముచ్చట్లలో ఒడి కొంతకాలానికి మనస్సును కుదుటపరచుకొంటుందని ఆలోచించాడు.

ఒకరాత్రి భోజనా లయ్యాక సీతను పిలిచి భర్త ఇలా అన్నాడు:

"అమ్మాయికి, పెళ్లిచేసేద్దామనిఉంది. అల్లుడు వచ్చి, వాళ్లిద్దరన్నా క్రొత్త మన కళ్లముందర అటూ, ఇటూ తిరుగుతూఉంటే కొంత కాలక్షేపం జరిగిపోతుం దేమో! ఏమంటావ్?" అన్నాడు మృదువుగా.

సీత అప్రయత్నంగా నవ్వింది. మళ్లీ వెంటనే ముఖం ముడుచుకుపోయింది.

"ఊ...చెప్పు, నీయిష్టం లేకుండా "శాంతి"కి పెళ్ళిచెయ్యను." అన్నాడు. ఈ మాటలు వింటూన్నప్పుడు సీతకు ఒకనాడు తనభర్త తన తమ్ముడి పెళ్లివిషయంలో ఎంత కఠినంగా శాశిస్తున్నట్లు మాట్లాడిందీ గుర్తుకొచ్చింది. ఆనాడు తన భర్త అన్న ఆ మాటలే తన ముద్దుల తమ్ముణ్ణి తననుండీ వేరుచేశాయి. ఈ ఆలోచన మెదలగానే దుఃఖం పైకుబికింది. సీత భోరున ఏడవటం సాగించింది. ఆమెభర్తకూడ ఇది గ్రహించి ఓదార్చాడు.

"ఎప్పటికైనా నీయిష్టంమీదే "శాంతి"కి పెళ్ళిచేస్తాను." అని సీతచేతిలో చెయ్యివేసి వాగ్దానం చేశాడు భర్త.

"అసలు సంబంధాలు విచారిస్తూ ఉండండి. మంచిది, అనుకూలంగా ఉన్నది జతపడితే ముడిపెడదాం" అందిసీత నిస్పృహగా.

"సరే!" అన్నాడు.

తరువాత వారంరోజులు గడిచింది. సీతకు జ్వరం తగిలింది. తెలియకుండా పదిలంఖణాలు జరిగినై. భర్త ఎంతో శ్రద్ధతో వైద్యం చేయిస్తున్నాడు. 'శాంతి' తల్లిమంచాన్ని వొదలకుండా సేవ చేస్తూనే ఉంది. క్రమంగా సీత రోజూ రాత్రిళ్లు తమ్ముణ్ణి "నారాయణా! నారాయణా! బాబూ! రావా, కనుపించవా!..." అని తలచుకొని ఏడుస్తూనే స్మృతి తప్పి పడిపో మొదలుపెట్టింది.

ఒకరోజు భర్త దగ్గర కూర్చొని విసురుతూ ఉండగా "నారాయణ్ణి వెతికించరూ? ఒక్కసారి రప్పించి చూపించరూ?" అని ఎంతో దీనంగా బ్రతిమాలి ఏడ్చింది సీత.

సీతకోరిక ఎలా తీర్చాలో అర్థం కాలేదు భర్తకు. "అసలు బ్రతికున్నాడో లేదో? ఉంటే ఎక్కడున్నాడో, ఏం చేస్తున్నాడో?తన కెట్లా తెలుస్తుంది?" ఎన్నో విధాల ఆలోచించాడు. ఆ సాయంత్రం మామూలుగా వెళ్లే అలవాటు చొప్పున రచ్చబండమీదకు వెళ్లాడు. అక్కడ వాళ్లంతా విజయవాడలో ఆ క్రిందటి రోజుతో ముగిసిన దక్షిణభారత కళాప్రదర్శనాన్ని గురించి చెప్పుకొంటున్నారు. అందులో ప్రత్యక్షంగా వెళ్లి చూచొచ్చినవాళ్లు చెబుతున్న మాటల్ని అంతా శ్రద్ధగా వింటూ కూర్చున్నారు. నారాయణ పేరు, అతడు తయారుచేసిన శిల్పాన్ని గురించి, మరి, మరీ వ్యాఖ్యానించారు. "నారాయణ" అన్న పేరు వినగానే, సీత భర్తకు తన బావమరది నారాయణ స్మృతిలోకి వచ్చాడు. "వాడేనేమో!" అని ఒక భావం హృదయంలో మెదిలింది. మళ్లీ వెంటనే "ఛా! ఎందు కవుతుంది. వాడంతటి వాడు ఎట్లా అవుతాడు? వాణ్ణి దగ్గరకు తీసి, ఆ విద్య నేర్పాల్సిన అవసరం ఎవరి కున్నది? ఏమయిపొయ్యాడో, పాపం!" అనుకొన్నాడు. కానీ ఉండబట్టలేక వెళ్లి ఆ విషయాలు, సీతకు చెప్పాడు భర్త.

"కనుక్కోరూ!" అంది సీత ఎంతో దీనంగా, ఆశతో భర్తముఖంలోకి చూస్తూను.

"పిచ్చిదాన.. వాడంతటివా డవుతాడా?" అన్నాడు.

"మీకు వాడంటే మొదట్నుంచీ ఇంతే భావం.. వాడి అంతస్సు అర్థంచేసుకోవాలంటే మన కున్న సంస్కారం చాలదేమో నంటాను." అని ముఖం అవతలప్రక్కకు త్రిప్పుకొని ఏడవటం మొదలుపెట్టింది సీత.

సీత స్థితి భర్తకు జాలి కలిగించింది. మరునాడే విజయవాడకు వెళ్లి శిల్పి నారాయణ ఎక్కడుండేది, ఎవరైంది కనుక్కొంటానని భర్త వాగ్దానం చేసినమీదట సీతమనస్సు కొంత స్థిమితపడ్డది.

భార్యకు చేసిన వాగ్దానం ప్రకారం సీత భర్త మర్రోజే విజయవాడకు బయలుదేరి వెళ్లి, క్రితం కళాప్రదర్శనం నిర్వహించిన, సంఘ కార్యదర్శి ఇంటికి వెళ్లి, శిల్పినారాయణ విషయమై, వాకబుచేశాడు. ప్రదర్శన నిర్వాహక సంఘ కార్యదర్శి చెప్పిన మాటలు,వర్ణననుబట్టిచూస్తే, ఎక్కడో పట్నంలో "శిల్పవిద్యాపీఠం" అని ప్రసిద్ధిగాంచిన గొప్ప కళాకేంద్రమున్నదనీ, దాని శిల్పాచార్యులు గూడ ఎంతో వయస్సు గలవారనీ, ఎంతో అనుభవమూ, మేధాశక్తీ గల ఆయన ప్రియశిష్యుడు "నారాయణ" అనే ఆయన ఆ శిల్పాన్ని నిర్మించాడనీ, తను తన బావమరిదిగా ఎంచే నారాయణకూ, దక్షిణ భారతంలో సిద్ధహస్తుడైన శిల్పిగా ఎంచబడే నారాయణకూ సంబంధం లే దన్నట్లుగాను" తేలింది.

సీత భర్త నిరాశచేసుకొని ఇంటికి వచ్చి ఆ విషయాలను భార్యకు చెప్పి కొంత ఓదార్చాడు. సీత తమ్ముణ్ణిచూచే భాగ్యం ఇహ లేదని నిరాశచేసుకొని, మంచంలో బడి మ్రగ్గుతూ ఉంది. అలాగే ఆరుమాసాలు గడిచిపొయ్యాయి.

మంచంబట్టిన తరువాత సీత ఎన్నడూ "శాంతి"ని పిలిచి పుస్తకంతీసి చదవమని అడిగి ఎరుగదు. ఆరోజు ఎందుకో సీతకు ఏదైనా చదివితే, వినా లనిపించి "శాంతి"ని పిలిచి "అమ్మా! ఏదైనా చదువు" అంది.

శాంతి "ఏం? చదవమంటావమ్మా?" అని తల్లిముఖంలోకి దీనంగా చూస్తూ అడిగింది.

"నీ యిష్టం."

శాంతి లేచివెళ్లి పాత భారతిసంచిక తీసుకొచ్చి అటూ, ఇటూ తిరగేసింది. దానిలో ఒక చోట "శిల్ప విద్యాపీఠం" అనే శీర్షికతో ఒక వ్యాసం కనుపించింది. శీర్షిక క్రింద, "ప్రాచీన భారతీయ విజ్ఞాన, కళాసంపత్తులకు ప్రాతినిధ్యంగా నిలబడి దక్షిణభారతంలో సేవచేస్తున్న ఏకైకకళానిలయం. పీఠస్థాపన, కృషి వివరాలు"అని ఉంది. "శాంతి" ఈ మాటలు చదువుతూ, ప్రక్కపుటలోని బొమ్మవంక చూచి ఒక్కసారిగ, దెబ్బతిన్నట్లుగా ఆగిపోయింది.

సీత, కూతురుముఖంలోకి చూస్తూ "ఆపావేం? చదువమ్మా!" అంది.

"అమ్మా! ఇటు చూడు. ఇదిగో ఈ బొమ్మ..." అంటూ ఆతురతతో ఆ ఫొటో చూపించింది. ఆ ఫొటోలో దృశ్యం చూచి సీత రెండుచేతులతో ముఖం కప్పుకొని భోరున ఏడ్చి, స్మృతి తప్పి పడిపోయింది. అరగంటకు తెలివి వచ్చాక మళ్లీ ఆ బొమ్మను చూస్తూ "నేను, నా నారాయణ, నేను నా నారాయణ." అంది.

శాంతి ఆ బొమ్మక్రింద అచ్చయివున్న అక్షరాలు ఇలా చదివింది. "అనురాగమూర్తులు, అక్కాతమ్ముళ్లు. ఉగాదికి విజయవాడ పట్టణంలో జరిగిన దక్షిణభారత కళా ప్రదర్శనంలో మేటిగా ఎన్నుకోబడ్డ ఉత్తమశిల్పం. కళాస్రష్ట: నారాయణ, శిల్పవిద్యాపీఠం, మదరాసు."

"నా నారాయణే, నా నారాయణే! వాడు మరుస్తాడా అక్కని? ఎక్కడున్నా, ఏపని చేస్తున్నా నాహృదయసీమలో వాడు, వాడి హృదయకుహరంలో నేను......ఆ వాడే, వాడే.. శాంతీ, శాంతీ, వెళ్లమనవే మీ నా

న్నని; తీసుకురమ్మనవే, నా నారాయణున్ని పిలువు, పిలువు మీనాన్నని. నేబ్రతిమాలు కొంటా..... ఒక్కసారి వెళ్లి తీసుకొచ్చి నాకంటికి మాపించమనవే!" క్రమంగా సీత ఉన్మత్తావస్థలోకి మారింది. ఒకటే, సంతోషం, కేరింతలు, అరుపులూ, మళ్లీ ఏడుపు. ఇదేవరుస.

సీతభర్త హృదయానికి ఆమెస్థితి ఎంతో బాధను, భారాన్ని కలిగించింది. వెంటనే ధైర్యంచేసి పట్నం వెళ్ళి శిల్పవిద్యాపీఠమందిరాన్ని అతికష్టంమీద రెండురోజులు వాకబు చేసి కనుక్కొన్నాడు. గురుదేవుల శిల్పాన్ని అతిశ్రద్ధతో నారాయణ మెరుగులు దిద్దుతున్న సమయంలో సీతభర్త అక్కడకు వెళ్లి నారాయణముఖంలోకి తేరిపారజూచి గుర్తుపట్టి "నారాయణ్ !" అని కేక వేశాడు.

నారాయణ వెంటనే బావని గుర్తించి, ఆశ్చర్యంతో లేచి ఆహ్వానించి, ప్రశ్నలవర్షం కురిపించాడు. సీతభర్త ఇంటిదగ్గర పరిస్థితి అంతా చెప్పాడు. నారాయణహృదయం బ్రద్దలయి "అక్కా! నిన్నే స్థితికి తీసుకొచ్చానే!" అని భోరున ఏడ్చాడు.

ఆరాత్రే నారాయణ బావతో ప్రయాణమై మరునాడు మధ్యాహ్నానికి మళ్లీ అక్క గడపలో కాలుపెట్టాడు.

మంచంమీద తనకోసం నాలుగుసంవత్సరాల, ఆరుమాసాలు, అహోరాత్రాలు క్రుగ్గి, శల్యావశిష్టమై జీర్ణించి, చీకి, చివికి, నిరాశతో కృంగి, కుమిలి కుమిలి, ఉన్మత్తస్థితిలో అంత్యదివసాలల్లో శరీరమంతా కళ్లుగా చేసుకొని తన కోసరం ఎదురుచూస్తున్న అక్కని చూచేటప్పటికి నారాయణకు ప్రపంచమంతా తల్లక్రిందులుగా కనబడి, వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్లి అక్కహృదయంమీద పడిపోయాడు.

సీత ఆ స్థితిలోగూడ తమ్ముణ్ణి గుర్తుపట్టి తన హృదయానికి దగ్గరగా లాక్కొని హత్తుకొన్నది. నోట మాట పడిపోయింది. వెర్రిచూపు. ఒక్కటే ఏడుపు పడే, పడే నారాయణ్ణి తన సందిటకు లాక్కొనేది. తన దివ్యహస్తంతో అనురాగరసాన్ని వర్షిస్తూ, వెన్ను నిమురుతూ ఉండేది రెండురోజులు అక్కడ గడిచిపొయ్యాక అక్కను ఎల్లాగైనా బ్రతికించుకోవాలనే ఆశతో నారాయణ పట్నం తీసుకొనివెళ్లి తన మందిరంలో పెట్టుకొని, అనుభవవేత్తలగు వైద్యులచే చికిత్సచేయించ మొదలుపెట్టాడు.

తొమ్మిది రాత్రిళ్లు గడిచిపొయ్యాయి. పదో రాత్రి...ఆమధ్యాహ్నంనుంచి సీత పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. నారాయణ అక్కతలను తన వొళ్లో ఉంచుకొని, ఆమెనుదుటిని సవరిస్తూ కనకొలుకుల్లో ఏర్పడుతున్న బిందువుల్ని తుడుస్తూ, విసురుతూ కూర్చున్నాడు. శాంతి వంచిన తల ఎత్తకుండా ఏడుస్తూ, తల్లి పాదాల్ని కన్నీళ్లతో అభిషేకిస్తుంది.

అర్ధరాత్రి అయింది. గాఢాంధకారం. నారాయణ ఎదురుగా తెరచిఉన్న కిటికీగుండా ఆకాశంలోకి చూచాడు. "అబ్బా! మృత్యువు. ఎంత భయంకరం. అనంతమయిందీయా ఆకాశం. అంతకు మించిందీ అయోమయ మానవ జీవితం. మన జీవితానికి ముందు వెనుకలు మనకు తెలియవుగదా !......"అని ఏమేమో, తలపోస్తూ, మధ్య మధ్య అక్కసమక్షంలో గడచిన పదహారు సంవత్సరాల జీవితాన్ని స్మరణకు తెచ్చుకొంటున్నాడు. పొర్లుగా వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతున్నాడు.

ఇంతలో ఒక్కసారిగా కళ్లు తెరుస్తూ సీత తమ్ముడివొళ్లోనే పొర్లింది. నారాయణ అక్కసీత కళ్లల్లోకి చూచాడు. ఆ కళ్లల్లో ఉన్న అనురాగరసానికి, కరుణకు నారాయణహృదయం పగిలి కన్నీళ్లు జల జల రాలి, అక్క కనుకొలుకుల్లో పడ్డాయి. సీత నారాయణముఖాన్ని, తన ముఖంమీదికి లాక్కొన్నది. అనురాగమూర్తి అక్కపెదిమలపై కడసారిగ నారాయణపెదిమలు ఆనినాయి.

ఇంతలో పెద్ద దగ్గుతెర వచ్చింది. శాంతి లేచి వచ్చి తల్లి ముఖంలోకి, ఏడుస్తూ "అమ్మా! నన్నేం చేసిపోతున్నావే?" అన్నట్లుగా చూసింది. సీత నారాయణ చెయ్యి తన హృదయంమీదకు లాక్కొన్నది. శాంతి చెయ్యిని, నారాయణచేతిలో పెట్టి, తన హృదయానికి హత్తుకొని కడసారిగ, నారాయణ ముఖంలోకి చూస్తూ, కళ్లు మూసింది!

ఆఖరిసారి అక్కకళ్లల్లోమాత్రం నారాయణ కొంత తృప్తిని, శాంతిని చూడగలిగాడు.

అక్క పోయింతరువాత నారాయణ ఎన్నాళ్లకోగాని తిరిగి యథాస్థితికి, మనిషి కోలుకోలేకపొయ్యాడు. శిల్పవిద్యాపీఠమందిరం ముందుభాగంలో ఒక ఉద్యానవనాన్ని వేయించి, దానిలో మధ్యగా ఎత్తైన ప్రదేశంపై అక్కవిగ్రహాన్ని ప్రత్యేకంగా తయారుచేసి ప్రతిష్ఠించాడు. దానిక్రింద "అనురాగమూర్తి అక్కసీత" అని అక్షరాలు చెక్కాడు. ఏటేట అక్కసంస్మరణదినం వైభవంగా, ఆ ఉద్యానవనంలో జరుపుతూ, కళాప్రదర్శనాన్ని ఏర్పాటుచేసి, ఉత్తమశిల్పకారులకు అక్కసీతపేరుతో బహుమతులు పంచుతూ, సన్మానించుతూ ఉన్నాడు.

మనరాష్ట్రం మనదేశం:

(5-వ పేజీ తరువాయి)

అవసరం ఉంది. దేశంలో ప్రజాప్రాతినిధ్య పరిపాలనవిధానం సక్రమంగా నడవాలంటే; ప్రజల్లో ప్రభుత్వాలపట్ల, శాసనాలపట్ల గౌరవాదరాలు నిలవాలంటే సందేహాలకు ఆవంతైనా తావివ్వకూడదు. ప్రభుత్వంపట్ల ప్రజల విశ్వాసం గౌరవం నిలపవలసిన ఆ బాధ్యత అందరిపైనా ఉంది. పదవుల్లో ఉన్నవారు ప్రత్యర్థులైనంతమాత్రాన వారిపై నిత్యం నిందారోపణలు చెయ్యకుండా, ఇతరనాయకులు, ఒకసారి సందేహాలకు తావు వచ్చినప్పుడు వానిని తొలగించడానికి అధికారంలో ఉన్నవారు అత్యంత జాగ్రత వహించాలి. లేనిపక్షంలో ఈనాటి ప్రభుత్వంపైనా ప్రజలకు గౌరవవిశ్వాసాలు నశిస్తాయి. వీరిని త్రోసి పదవులలోకి వచ్చేవారిపైనా ప్రజలకు గౌరవవిశ్వాసా లుండవు.

ఆంధ్రోద్యమంపై ప్రధాని:

చెన్నరాష్ట్రానికి ప్రధాన మంత్రిగా ఎన్నుకోబడే సరికి రాజకీయనాయకులు ఆంధ్రరాష్ట్రోద్యమాన్ని తెగనాడడం పరిపాటయిపోయింది. ప్రధాని పదవుల్నీ మంత్రి పదవుల్నీ ఉన్నవారే ఇప్పటి వర్గరాజకీయాలను బట్టే నిత్యం ఆకట్టుకోవాలంటే, చెన్నరాష్ట్ర విభజనా జరుగడం రుచించదు. వర్గరాజకీయాలు, పార్టీవైషమ్యాలు నశించడం అంగీకరించదు. రాష్ట్ర రాజకీయాలు దురదృష్టవశాన స్వార్థపరుల తంత్రాలతో కలుషితమై పోయినప్పుడు, ప్రజాభిప్రాయాన్ని మన్నించడంగాని, ప్రజాహిత మేదో యోచించడంగాని, పరుల జాతీయభావాల నాదరించడం గాని ఎలా సాధ్యమౌతుంది? ఉన్నతాశయాలు, ఉన్నతాదర్శాలు వారిదృష్టికి నీచంగా కనిపిస్తాయి.

ఆంధ్రరాష్ట్రోద్యమం గురించి ఓమండూరి పెద్ద రామస్వామిరెడ్డిగారు ప్రధానిగా ఉండగా ఏమాటలు చెప్పారో, సరిగా ఈమారు ప్రస్తుత ప్రధాని జగన్నాథ కుమారస్వామిరాజాగారూ అవే మాటలు చెప్పారు. కేవలం అధికార వ్యామోహులైన వారే ఆంధ్రరాష్ట్రవిభజన కోరుతున్నారు కాని ఆంధ్రదేశంలో ప్రజలు వాస్తవంగా కోరడం లేదన్నారు. ఆంధ్రరాష్ట్రోద్యమానికి కొందరు నాయకుల స్వార్థాశయమే మూలహేతువని తేల్చేశారు. వారీనాడు ప్రధానిగా ఉన్నారంటే మంత్రిపదవీ వ్యామోహితులైనవారందరి తంత్రాలకో తోడ్పడ్డారు. కేవలం దురభిమానం వ్యక్తిగతద్వేషాలతో ఉడికిపోయి రామస్వామిరెడ్డిగారిని తొలగించినవారికి శ్రీ రాజాగారు తమ పరపతినీ బలగాన్నీ ఒప్పగించి పోటీచేశారు మంత్రివర్గాన్ని నిర్మించిన దెవరో, మంత్రుల నెన్నిన దెవరో లోకానికి తెలుసును.

కుమారస్వామిరాజాగారికి ప్రధానిపదవి ఎవరి దయాదాక్షిణ్యాలవల్లనూ, ఎవరి తంత్రబలం వల్లనూ లభించిందో వారే, రాజాగారి యిష్టాయిష్టాలతో నిమిత్తంలేకుండా మంత్రుల నెంచారు. ఇట్టివారికి ఇందుకుమించిన ఉత్తమ రాజకీయా లెలా అర్థం అవుతాయి?

ఆంధ్రరాష్ట్రోద్యమంలో పాల్గొంటున్న వారిలో స్వార్థపరులు లేరని ఎవరూ చెప్పలేరు. కాని ఒకవిషయం అందరూ మరిచిపోతున్నారు. ఆంధ్రరాష్ట్ర నిర్మాణం అంటే కొందరు నాయకులు పండ గనుకుంటున్నారు. తమ సొమ్ము పోతున్నట్లు తమిళనాయకులు ఆక్రోశిస్తున్నారు. కాని ఆంధ్రరాష్ట్రం వారి సొత్తూకాదు, వీరి సొత్తూకాదు. ఈ నాయకు లీనా డుంటారు. రేపు పోతారు రాష్ట్రంమాత్రం ప్రజల హక్కు. తరతరాల ప్రజలకీ ఈ హక్కుంది. ఆంధ్ర రాష్ట్రోద్యమానికి మూలకారణం ఆంధ్రుల ప్రత్యేకరాష్ట్రహక్కేగాని మరేమీ కాదు. ఆంధ్రుల కీనాడు అన్యాయం జరుగుతోందంటే పరిస్థితుల దృష్ట్యా సహజమే. రాజకీయాల్లో ఎప్పుడూ ఉన్నతాదర్శాలే చలామణి అవుతాయనిగాని, ఎప్పుడూ సచ్చరిత్రులూ సదాశయ సంపన్నులే ఉంటారని కాని గారంటీ లేదు కాబట్టి, ఆంధ్రదేశానికి ఇరిగేషన్ ప్రాజెక్టులు, విద్యాసౌకర్యాలు, విద్యుచ్ఛక్తి ఉత్పత్తి మొదలైన విషయాలలో ఆ సత్యం మరింత అనుభవానికి రాబట్టి ఆంధ్రులు జన్మహక్కును కోరుకుంటున్నారు. పొత్తు కుదరలేదు కాబట్టి విభాగాలు కోరుతున్నారు. విభాగాలు కోరడానికి సహజహక్కుంది. మానవుల ప్రాథమిక స్వత్వాలకూ, జాతీయ గౌరవానికీ సంబంధించిన ఈ సమస్యను ప్రధాని ఇంత సంకుచితదృష్టితో పరిశీలించి అవమానకరమైన మాట లన్నారంటే, అది ఆంధ్రరాష్ట్రోద్యమానికి హాని కలిగించదు కాని, ప్రధానిపట్ల ప్రజల్లో గౌరవవిశ్వాసాలు అంతరింపచేస్తాయి. రాష్ట్రంలో దాదాపు సగంమంది ప్రజల అభిప్రాయాన్ని ఇంత చక్కగా గ్రహించిన ప్రధానివల్ల ప్రజాప్రాతినిధ్య పరిపాలనా విధానం ఎంత చక్కగా కొనసాగుతుందో వేరే చూడనక్కరలేదు; చెప్పనక్కరలేదు; గ్రహించవచ్చును. ఓమండూరి వారి హయాంకంటె మేలుగా ఉండబోదు.

నెహ్రూకు ట్రూమన్ ఆహ్వానం:

భారత ప్రధాని పండిట్ నెహ్రూను అమెరికా రావలసిందని అమెరికా అధ్యక్షుడు ట్రూమన్ ఆహ్వానించాడు. ఈ సంవత్సరం తుది మాసాల్లోగాని అమెరికా వెళ్లజాలనట్లు పండిట్ నెహ్రూ కైరోలో చెప్పారు.

భారతదేశంలో పారిశ్రామిక వర్తకవ్యాపారాదుల్లో వ్యక్తిగతస్వేచ్ఛాసూత్రం మన్నించబడుతుందనీ, దేశహితానికి తగినట్లు పారిశ్రామిక వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలను నిర్ణయించడం వరకు మాత్రమే ప్రభుత్వం ప్రమేయం కలిగించుకుంటుందనీ భారత ప్రభుత్వం స్పష్టపరిచింది. అన్యదేశీయులు భారతదేశంలో పారిశ్రామిక వ్యాపారాదులలో పెట్టుబడి పెట్టదలచినట్లయితే వారికి దేశీయులతో సమానమైన స్వేచ్ఛనూ, హక్కులనూ ఇవ్వగలరని పండిట్ నెహ్రూ ప్రకటించారు. ఇదిగాక, భారత ప్రభుత్వం ఎంతగా అగ్రరాజ్యాల వివాదాల్లో జోక్యం చేసుకోకుండా తటస్థంగా ఉన్నప్పటికీ, అందరితోనూ మైత్రి నెరపగలదని కూడా పండిట్ నెహ్రూ స్పష్టపరచారు. బ్రిటన్‌పట్ల స్నేహభావమే కాని శత్రుభావం లేదని కార్యరూపేణా నిరూపించారు. స్విట్జర్లండ్, చెకోస్లోవాకియా మొదలైన దేశాలతో మైత్రిప్రకటన, వాణిజ్య ఒడంబడికలు చేసుకొన్నారు. రెండుదేశాలు పరస్పర విరోధంతో ఉంటేకూడా రెండు దేశాలతోనూ సన్నిహిత స్నేహం నెరపడం మూడోదేశానికి కష్టం కాదని తెలియచేశారు. ఆ దేశాలతో మైత్రి ఎంత బలపడితే అంతమంచిది. ఆ దేశాల మధ్య తగాదాలను పరిష్కరించడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటివిధానం అవలంబించడంవల్లనే కమ్యూనిస్టులుతప్ప ప్రపంచంలో సర్వవర్గాలవారూ పండిట్ నెహ్రూ రాజనీతిజ్ఞతనూ, వ్యక్తిప్రతిభనూ, ఉన్నతాశయాలనూ ప్రశంసిస్తున్నారు. భారతదేశం వైఖరిపట్ల ఇంతవరకూ అనుమానాలతో వర్తించిన అమెరికా ఇప్పుడు నెహ్రూను గౌరవించదలచడం సహజమే.

నెహ్రూ అమెరికా వెళ్లినప్పుడు భారతదేశ పారిశ్రామికాభివృద్ధి అవకాశాల్ని గురించి ట్రూమన్‌తో చర్చించగలడని వార్తలు ప్రచురించబడినాయి. భారతదేశంలో వస్తూత్పత్తి వృద్ధిచెంది, విదేశాలతో వాణిజ్యంలో సమానంగా నిలబడగలిగితే గాని, దారిద్ర్యం ఆర్థిక దుస్థితీ తొలగవు. దీనికోసం అమెరికా, పెట్టుబడి, ఆర్థికసహాయం, నిపుణుల సహాయం అవసరం. అమెరికా ఇంతవరకూ మన దేశానికిటువంటి సహాయం ఏమీ చెయ్యలేదు. ఇప్పుడు దీనినిగురించి నెహ్రూ ట్రూమన్‌తో చర్చించవచ్చును.

తూర్పు ఆసియాలో ఈ సంవత్సరంన్నరలో కమ్యూనిస్టుల పాల పడగా మిగిలినదేశాల్లో నైనా ప్రజల ఆర్థికదుస్థితి తొలగిస్తేగాని ఇవికూడా కమ్యూనిస్టుల అధీనంకాక మానవనే అభిప్రాయం అమెరికాలో స్థిరపడింది. చీనాలో అమెరికా ఆర్థిక సహాయం ప్రజల దారిద్ర్యం తొలగించడానికి తోడ్పడలేదు. కమ్యూనిస్టులపై యుద్ధానికి ఉపయోగపడింది. పశ్చిమయూరప్‌లో ప్రజల ఆర్థికదుస్థితిని మార్షల్ ప్రణాళిక కొంత తొలగించగలినందువల్లనే ఈనాడు కమ్యూనిస్టుల ఆటలు కట్టేశాయి. ఫ్రాన్స్ ఇటలీలలో కమ్యూనిస్టుల బలం ఎంత అధికంగా ఉన్నా ప్రజాసామాన్యాన్ని పూర్తిగా తమ పక్షానికి తిప్పుకోడానికిగాని, ప్రజల అమాయకత్వాన్ని ఆధారం చేసుకొని అరాచకం రెచ్చగొట్టడానికిగాని అంతగా వారికి వీలు చిక్కలేదు. ఇదే పద్ధతి భారతదేశంలో ఆర్థికదుస్థితి తొలగిస్తేకాని కమ్యూనిస్టుల ముప్పు నివారణ కాదు.

నెహ్రూకు స్విట్జర్లండ్ సన్మానం:

పండిట్ నెహ్రూ లండన్ సమావేశంనుంచి భారతదేశానికి తిరిగివచ్చేలోపల మూడు రోజులు స్విట్జర్లండ్‌లో ప్రభుత్వాతిథ్యం స్వీకరించారు పండిట్ నెహ్రూను స్విట్జర్లండ్ ఫెడరల్ కౌన్సిల్ సన్మానించింది. ప్రజాప్రాతినిధ్య పరిపాలనా ప్రభుత్వాలలో ఉత్తమమైన స్విస్ ప్రభుత్వం నెహ్రూరాజనీతిజ్ఞతను కొనియాడింది. ఈ సందర్భంలో ఇండియా-స్విట్జర్లండ్ మైత్రి ఒడంబడిక ఆమోదించబడింది.

పరీక్షలు:

దేశంలో విద్యావిధానం, పరీక్షల పద్ధతి అయోమయంలో పడ్డాయి. విద్యార్థులు వాచర్లని దేహశుద్ధిచెయ్యడం, కాపీలు కొట్టడానికి ఎంత దౌర్జన్యాలకైనా సరే దిగడం, కమ్యూనిస్టుల పద్ధతులు అవలంబించి పరీక్షల్లో తప్పినవారంతా, సమ్మెలు కట్టడం, ఇదంతా చూస్తే విద్య నానాటికీ దిగనారి పోగా, విద్యార్థుల్లో దౌర్జన్యం రెచ్చిపోతున్నట్లు తెలుస్తోంది. పరస్పర వ్యవహారాల్లో విద్యార్థుల్లోనే కాదు మానవుల్లోనే పరస్పర సందేహాలు, అపవాదుల్ను, దూషణలు, దౌర్జన్యాలు, వంచనావమానాలు, అసూయ, స్వార్థాశయం మొదలైనవి రెచ్చిపోతున్నాయి. ఇది విద్యార్థుల్లో కూడా రెచ్చిపోతూంటే ఇంక మనకు విద్యవల్ల కల్గుతున్న ప్రయోజన మేమిటి? మనుష్యుల్లో పశుప్రవృత్తిని నిర్మూలించలేని విద్య విద్యేనా? ఇటువంటిసందేహాలు మన దేశంలోనే కాదు, అన్ని దేశాల్లోనూ ప్రబలుతున్నాయి.

విద్యార్థుల సమ్మెలు, పరీక్షలు మొదలైనవానిని గురించి పండిట్ నెహ్రూ బెర్నార్డ్ షాతో ప్రసంగించారు.

కొత్త కార్మిక సంస్థ:

ఈ వారం కలకత్తాలో కొత్త కార్మికసంస్థ ఒకటి స్థాపించబడింది. బీహార్ కిసాన్ నాయకులు స్వామిసహజానంద సరస్వతిగారి అధ్యక్షత కింద కలకత్తాలో కార్మిక నాయకులు సమావేశమైనారు. కాంగ్రెస్ కమ్యూనిస్టు రాజకీయపక్షాలతో ఎట్టి సంబంధం లేకుండా, ఎట్టి రాజకీయాలలోనూ పాల్గొనకూడ దని ఈ సంస్థ వ్యవస్థాపకులు నిర్ణయించుకున్నారు. కేవలం కార్మికోద్యమవృద్ధి, కార్మిక జనుల యోగక్షేమాలే వీరి ఆశయాలు. ఈ సంస్థపేరు యునైటెడ్ ట్రేడ్ యూనియన్స్ కాంగ్రెస్. దీని ప్రఖ్యాత ఆర్థికవేత్త ప్రొఫెసర్ కె. టి. షా

కులాసా కబుర్లు :

"నాటుపద్ధతే నాణ్యం"

శ్రీ జి. యన్. సూరి

ఇండియా ప్రధాని నెహ్రూ పండితుడు కామన్‌వెల్త్ కాన్ఫరెన్సుల సందర్భంలో ఇటీవల లండన్ వెళ్లినప్పుడు వీలు చేసుకుని ప్రఖ్యాత రచయిత జార్జిబెర్నార్డుషాను సందర్శించాడు. హైందవ సాంప్రదాయాన్ని అనుసరించి గొప్పవారిదగ్గరకు వెళ్లేప్పుడు ఉత్త చేతులతో పోగూడదు కాబట్టి ఒక మామిడిపండ్ల బుట్టను సమర్పించాడు. కేవలం మన పూర్వకాలపు ఋషులలాగా గడ్డాలు మీసాలు పెంచి, కందమూలఫలాలనుమాత్రమే భుజించి, శతమానం అందుకోబోతున్న షా గారు అపరిమితంగా ఆనందించి, ఆయన అమూల్యగ్రంథాలను కొన్నిటిని నెహ్రూగారికి బహూకరించాడుట. ఇస్తే వాయినం పుచ్చుకుంటే వాయినం అన్నట్లు అయింది.

మామిడిపండ్లను ఇచ్చినతరువాత వాటిని ఏ విధంగా భక్షించాలో వివరంగా తెలియజేసి ఉంటాడు మనప్రధాని. మాటలతో బోధపడలేదని అనుమానించినట్లయితే ఒకపండును తానే తిని కూడా చూపించి ఉంటాడు. అసలు మామిడిపండ్లను తినే పద్ధతినిగురించి అభిప్రాయభేదాలు ఉన్నవని చాలామందికి తెలియక పోవచ్చు. నాగరీకులనుకొనేవాళ్లలో ఎక్కువమంది శస్త్రప్రయోగంచేయకుండా పండును గొంతున పడనివ్వరు. మిగల పండని కాయను తీసుకుని, వడపోసిన నీళ్లలో ఒళ్లు తోమి జలకమాడించి, కలవజేసిన తువ్వాలుతో తుడిచి, వేడినీళ్లలో కడిగిన కత్తిని చేత పుచ్చుకొని చెక్కుతీయాలంటారు. చెక్కుతీయటంలో ఎంతో జాగ్రత్త చూపాలిట. కండ తెగకుండా తోలుమాత్రమే అతిసున్నితంగా చెక్కివేయాలిట. తరగటం కూడా అతి సుతారంగా జరగాలిట. టెంకకు సమంగా ముందు రెండు పక్షాలు నిలువున చీల్చాలిట. టెంక ఎంతమాత్రం తెగకూడదుట. ఆ పక్షాలను ఎటు చూచినా ఒక అంగుళానికి మించని ముక్కలుగా కోసి చెంచాతో పెదవులకు తగులకుండా నోటిలో వేసికోవాలిట. దోసముక్కలు నమిలినట్లు కసకస కొరకకుండా ముంతకజ్జాయం మాదిరి చప్పరించి మాయం చెయాలిట. టెంకను చీకటం పిల్లలకు వదలివేయాలిట. ఇది రసికుల పద్ధతి.

ఇక రెండవది నాటుపద్ధతి. పండును రెండు చేతులమధ్యపట్టుకుని దయాదాక్షిణ్యం లేకుండా బూరుగదూది దిండుమాదిరి తయారయేట్లు నలిమివేయాలి. పాకానికి వచ్చిందని తోచగానే కొన దగ్గర పండ్లతో దమ్మిడీ అంత చిల్లి చేయాలిట. రెండు చేతులతో పండును పిసుకుతూ నోటినుంచి పండును దించకుండా, తోలూ టెంకా మాత్రమే మిగిలేట్లు జురజుర పీల్చివెయ్యాలి. ఆ తరువాత టెంకను బయటికి తీసి సారం వచ్చినదాకా చీకి పారవెయ్యాలి. తోలు లోపలి భాగాన్ని కొందరు గీరుకుతిని పారేస్తారు మరికొందరు దానిని కబళించి, గానుగ ఆడించి పిప్పిని ఉమ్మివేస్తారు. ఈ మహాయాగంలో కొద్దో గొప్పో రసం అపసవ్యంగా తప్పించుకుని పారిపోతుంటే చూస్తూ ఊరుకోక మోచేతులవరకు తరిమి నాలుకతో గ్రోలివేస్తారు. ఈ కర్మకాండ చూసి నాగరికులు నొసలు చిట్లించి మూతి విరుస్తారు.

పాశ్చాత్యులు అనేకులు అవకాశం దొరికినప్పుడల్లా ఈ విషయంలో పరిశోధన చేశారు. రెండు పద్ధతులను అనుభవంవల్ల సమగ్రంగా పరిశీలించి, నాటుపద్ధతిలోనే ఒడుపు ఉన్నదని తెల్లరసజ్ఞులు ఒప్పుకున్నారు. దేవుడుఇచ్చిన చేతులు తప్ప కత్తులు కరాగ్లు, ప్లేట్లు ఆకులు ఉపయోగించకూడదన్నారు అంతేగాక చొక్కాలు గిక్కాలు తీసి పారవేసి ఒడిలో తువ్వాలు వేసుకుని పండుపని పట్టాలన్నారు. అప్పుడు గాని ఈ ఫలరాజపు పసను తెలుసుకోలేమన్నారు. పరిపూర్ణరసాస్వాదనానికి అంతకంటె అనువైన మార్గం లేదని నిర్ణయించారు.

సుప్రసిద్ధ రచయిత బెర్నార్డుషా సుప్రసిద్ధ రసజ్ఞుడు కూడా అయి ఉంటాన ఉత్తమమైన నాటు పద్ధతినే అవలంబించి, ఆదరంగా సమర్పించిన పండ్లను ఆరగిస్తాడని నిస్సందేహంగా ఊహించవచ్చు. అయితే ఆయనకూ ఈ విషయంలో పెద్ద చిక్కు ఒకటి ఉన్నది. ఆయన చిన్నప్పటినుంచి అతిగోముగా పెంచుకున్న మీసాలు గడ్డాలు ఇందుకు కొంతవరకు అంతరాయం కలిగించవచ్చు. పండులో సగంభాగం రసాన్ని గడ్డాలు మీసాలు ఆహుతిచేసుకుంటే ఎవరికైనా కష్టం గలగక మానదు. మా మామయ్య ఒకడు ఈ మీసాలతిప్పలు పడలేక కప్పున్నర కాఫీ తెమ్మనేవాడు. అరకప్పు మీసాలకు తరుగు వదలినా కప్పు ఆయనకు మిగిలేది. ఇప్పుడు షా గారు ఏం చేశాడో తెలుసుకోదగిన విషయం. మహాకవి రవీంద్రుడు మామిడి పళ్లను ఎట్లా తినేవాడో అన్న అంశం శాంతినికేతన నూతన అధ్యక్షుడైన నెహ్రూగారికి తెలియకుండా ఉండదు. ఈ గొడవను ముందుగా ఊహించి అయినా తెలుసుకుని వెళ్లి షా గారికి తూచా తప్పకుండా వివరించి ఉంటాడు. మిగతా వివరాల కోసం మన ప్రధాని తిరిగి రాగానే ప్రెస్ కాన్ఫరెన్సులో అడిగించి తెలుసుకుందాం.

మామిడిపళ్ల రసాస్వాదనానికి గడ్డాలు మీసాలు ప్రతిబంధకాలు అయినందువల్ల తతీమా రసాస్వాదనాలకు కూడా ఇవి అంతేనని తొందరపడి అనుకోకూడదు. ఈ శతాబ్దం మొదటి కొన్ని సంవత్సరాలవరకు అధికంగా మీసాలు, కొంతవరకు గడ్డాలు రసికులలో ప్రచారంలో ఉండేవి. గత శతాబ్దపు కవులు, వేదాంతులు, శాస్త్రకారులు, రాజకీయవేత్తలు, పాశ్చాత్యదేశాలవరకు సంబంధించినంతవరకైనా ముఖాన వీటిని సాగుచేసినవాళ్లే. ముఘల్ చక్రవర్తులే కాక ఆరవజార్జివరకూ రాజులందరూ వీటిని పెంచినవాళ్లే. శతాబ్దం వచ్చేసరికి ముందు గడ్డాలు, తరువాత మీసాలు మోటు అయిపోయినవి. ముఖంమీది వాటిని చేతురాలా వదిలించుకోగా నెత్తిమీది శిరోజాలు వాటంతట అవి అదృశ్యం కావటం సాగించినవి. మనదేశంలో కూడ ప్రస్తుతం మీసాలనూతులు అల్పసంఖ్యాక వర్గాలలో చేరిపోయినవి. కాకపోతే సినిమా నటుల కోరమీసపుచారలుమాత్రం కుఱ్ఱకారు కొందరు ధరిస్తున్నారు. ఇక గడ్డాలు పూర్తిగా మాయమైపోయినవి. మతనియమాలను పాటించేవాళ్లు, తిరపతి మొక్కుబడులవాళ్లు తప్పనిసరిగా ఉంచటం జరుగుతున్నది. మీసాలు గడ్డాలు అదృశ్యం కావటానికి ముఖ్యంగా స్త్రీలు కారకులేమో నని అనిపిస్తుంది.

అకారణంగా ఎవరైనా గడ్డంపెంచితే ఎరిగినవాళ్లంతా వేళాకోళం పట్టిస్తారు. అందాకా ఎందుకు? బెర్నార్డుషాగారికి క్రిస్‌మస్ ప్రెజంటుగా క్షౌరపుకత్తులు ఎన్నిసార్లు వచ్చినవో లెక్కలేదుట. టాగూరుగారికికూడా ఇలాంటి వ్యర్థమైన కానుకలు వచ్చేఉండవచ్చు. సర్దార్ పటేల్‌గారి సోదరుడు విఠల్‌భాయ్ పటేల్‌గారి బవిరిగడ్డం ఢిల్లీ శాసనసభలో రాజ్యం ఏలింది ఒకప్పుడు. ఆయనకు జబ్బుచేసినప్పుడు వైద్యులు కత్తిరించివేయటానికి ప్రయత్నించగా ప్రాణం పోయినా ఫరవాలేదు గాని, గడ్డం తీయటానికిమాత్రం ఒప్పుకోనన్నాడుట.

ఇంతకూ ఒక్కవిషయం మనసులో ఉంచుకోవాలి. గడ్డం పెంచవలచుకున్న ప్రతివాడూ మామిడిపండును గమనానికి తెచ్చుకొని అటువంటి అమూల్యమైన పండును శిసలైన పద్ధతిలో అనభవించటానికి వీలులేకుండా చేతులారా చేసుకోటమా అని తమాయించి చూడాలి. హైదరాలీవంటి యోధుడు సంవత్సరం పొడుగునా మామిడిపండ్లను కాయించేందుకు లక్షలు ఖర్చుపెట్టి పర్షియాదేశపు శాస్త్రజ్ఞులను పిలిపించాడుట. నెహ్రూగారు రుచి చూపించారు కాబట్టి షాగారు కూడ మామిడిపండుమీది మోజువల్ల గడ్డం తీసివేసే అవకాశం లేకపోలేదు. ఈలోపుగా మనంమాత్రం తరుణం దాటిపోయే లోపల మామిడిపళ్లకు చేతనైనంత సత్కారం చేదాం.

గ్రంథములు.

[స్వీకారము]

తెలుగు వ్యాసములు :

సంకలనం వేమూరి ఆంజనేయశర్మ. ప్రకాశకులు: ఆంధ్రరాష్ట్ర హిందీప్రచారసంఘము, విజయవాడ. వెల 1-8-0.

స్వరాజ్యశాస్త్రము :

మూలం: వినోబా భావే. అనువాదం: శ్రీ వేమూరి ఆంజనేయశర్మ. ప్రకాశకులు గొల్లపూడి సీతారామశాస్త్రి, వినయాశ్రమం వయా, పొన్నూరు. వెల 0-12-0.

గాంధీజీకి శ్రద్ధాంజలి :

గ్రంథకర్త వినోబాజీ. అనువాదం: వేమూరి రాధాకృష్ణమూర్తి. ప్రచురణ: వినయాశ్రమ గ్రంథమాల, వినయాశ్రమం. (వయా)పొన్నూరు. వెల 0-8-0.

హిందీ తెలుగు స్వయంబోధిని :

రచయిత, ప్రకాశకులు శ్రీరాములు గుప్త. లోకమాన్య హిందీమందిర్, బిసెంటురోడ్డు గవర్నరుపేట, విజయవాడ. వెల 1-8-0.

బాలసుందరము :

నాటకము. రచన: జీవబంధు T. S. శ్రీపాల్ గారు ప్రకాశకులు దక్షిణ భారతజీవరక్షా ప్రచారసభ, మదరాసు. వెల 0-12-0.

అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు. ప్రొఫెసర్ షా నెహ్రూ కమిటీ అని పేరుపొందిన నేషనల్ ప్లానింగ్ కమిటీలో చాలకాలం పనిచేశారు. రాజ్యాంగ పరిషత్సభలో సోషలిస్టుపక్షాన వాదిస్తారు. ఇప్పుడు కమ్యూనిస్టుల పాలబడిన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌కు ఇదివరలో అధ్యక్షులుగా నున్న మృణాలకాంతి బోస్ ఈ సంస్థకు కార్యదర్శిగా ఉన్నారు. వీరిదివరలో సోషలిస్టుపార్టీకి అనుబంధంగా హింద్ మజ్దూర్ సభ అనే అఖిల భారత కార్మిక సంస్థ స్థాపించడానికి కృషిచేసి విఫలులైనారు. ఇప్పుడు రాజకీయాలతో నిమిత్తం లేకుండా వ్యవహరించగలదని ఈసంస్థను ప్రారంభిస్తున్నారు. కాని కలకత్తా సమావేశంలో రాజకీయాలే ముఖ్యచర్చనీయాంశాలైనాయి. కామన్వెల్తులో భారతదేశ సభ్యత్వాని కంగీకరించినందుకు పండిట్ నెహ్రూను విమర్శించారు.

ఈ వారమే అఖిలఆసియా కార్మిక సంఘ సమాఖ్యస్థాపించడానికి నిశ్చయమయింది. ప్రపంచ కార్మికసంఘ సమాఖ్యలోని ఆసియా సంఘాలు ఇట్టి ప్రాంతీయసంస్థను స్థాపించడానికి నిశ్చయించాయి. ఈ సమాఖ్యలో భారతదేశంనుంచి కాంగ్రెస్‌కు అనుబంధమైన భారత జాతీయ కార్మికసంఘ కాంగ్రెస్ పాల్గొంటుంది. ప్రాంతీయ సమాఖ్యలోకూడా వీరిదే ప్రధానపాత్ర.

భారత జాతీయ కార్మిక సంఘ కాంగ్రెస్ ద్వితీయ వార్షిక సమావేశం ఈ వారం ఇండోర్‌లో శ్రీ హరిహరనాథశాస్త్రిగారి అధ్యక్షతక్రింద జరిగింది. సర్దార్ పటేల్ ప్రారంభోపన్యాసమిస్తూ కమ్యూనిస్టుల ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్‌నూ, సోషలిస్టు కార్మిక సంఘాలనూ తీవ్రంగా విమర్శించారు. సమావేశంలో తీర్మానాలూ, ఉపన్యాసాలూ దాదాపు జయపూర్ కాంగ్రెస్ సమావేశ ధోరణిలోనే ఉన్నాయి.

బ్రిటన్‌లోని ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, అమెరికాలోని రెండు. బలమైన కార్మికసంఘసమాఖ్యలూ కలిసి కొత్తగా మరొక అంతర్జాతీయ కార్మికసంఘ సమావేశాన్ని స్థాపించడానికి యత్నిస్తున్నాయి. వీరికి భారతదేశంలో కాంగ్రెస్‌పార్టీకి అనుబంధమైన భారతజాతీయ కార్మికసంఘ సమాఖ్య తోడ్పడే అవకాశం ఉంది.



రాష్ట్రగవర్నరుల సమావేశానికి హాజరైన గవర్నరులను పరామర్శిస్తున్న గవర్నరు జనరల్, సర్దార్ పటేల్ అభివందనను స్వీకరిస్తున్నారు

లేఖలు

పేదలకు వృత్తులు

అయ్యా,

స్వరాజ్యములో మా పేదల బ్రతు కింతేనా? ప్రభుత్వము మాగురించియేదైనా ఆలోచిస్తుందా?

ఏ స్కీము పెట్టినా మా పేదల గురించే యంటారు. పేరు మాత్రము పేదలది. ఫలితము పెద్దవారిదే. పేదలంటే, నిర్దోషులు, అమాయకులని మీ యందఱుకు తెలుసును. అనాథులమని గదా మమ్మావలకు గెంటేస్తున్నారు. గట్టిగా అడిగితే మెరిట్ అంటున్నారు. ఈ పాడు మెరిట్టే మా పేదల కొంప తీస్తోంది.

ఎంప్లాయిమెంటు ఆఫీసులు ఎందుకున్నాయో అర్థము కాదు. ఏదో వొలికి పోతుందని ఎగబడి వెళ్లితే, ఎన్నో వాయిదాలు వేసి త్రిప్పి ఆఖరకు, అది లేదు, యిది లేదు పో పొమ్మంటున్నారు. పేదలకు యేదైన తక్కువ వుండ వచ్చును. అన్నీ వుంటే అందఱులాగునే టెంగరంగా యని మేము తిరుగుదుము. రెండేండ్లు అయింది. నన్నుగురించి మాత్రము యేమి చెసేరు?

నేను కాంగ్రెసులో పని జేసి దెబ్బలు తిన్నాను. ఎ ఆర్. పి. లో వార్డెనుగా పని జేశాను. మిలిటరీలో క్లర్కు కోర్సు ప్యాసయి, బర్మా యుద్ధ భూములలో క్లర్కు హవిల్దారుగా పని చేశాను. ఆఫీసుపనిలో ఆరితేరిన వాడిని. నిమ్న జాతికి చెందిన యువకుడను. ఏ పని యిచ్చినా ఓపికతో చేయడానికి సమర్థుడను.

ఈ పయి కేటగరు లున్న వారికే గాని యితరులకు పనిగాని, భూమిగాని యివ్వ మంటారు. నాకు మాత్రము ఒక అక్టింగైనా యివ్వరు. స్వరాజ్యములో నేను పనికిరానని నన్ను పైకి త్రోసి వేసేరు. ఏవిగాని క్రొత్తవారు నా జూనియరు లందఱుకు పను లిస్తున్నారు. నా బోటి అమాయకులు పేదవారెందఱో పనిలేక పరితపిస్తున్నారు. మా గోడు వినేవారెవరు? అడిగేవారెవరు? అధికార్ల యనుగ్రహము. అందులో స్వరాజ్యము.

పని యివ్వకపోతే మీదయ, ఏదైనా భూమైన యిస్తే నేను, నాకుటుంబము, దున్నుక బ్రతుకుతామని తూ॥ గో॥ జిల్లా కలెక్టరుగారిని, ఎంప్లాయిమెంటు ఆఫీసరుగారిని ఏడాది నుండి ఎన్నో అర్జీలనిచ్చి ప్రార్థిస్తూ వున్నాను. ఆ భూమియైనా యిష్టులు పరిచయస్తులకేగాని యితరులకే కివ్వడము లేదు.

మెడ్రాసు పబ్లిక సర్వీసు కమీషనువారు కోపరేటివ్ జూనియరు యినస్పెక్టరు పనికి, క్లర్కు పనికిని, యింటర్వ్యూ యిచ్చారు. కాకినాడ రీసెటిలుమెంటు ఆఫీసరుగారు కూడా నేను నా పనులకు తగిన వాడనని సిఫార్సు చేసేరు; అప్పాయింటుమెంటు రూల్సు ప్రకారము నేను పూర్తిగా అర్హుడనై యున్నాను. నా పారపాటేమిటో కాని సెలక్షనలో నన్ను నిరాకరించేరు. కారణము చెప్పరు. తిరిగి నా విషయమాలోచించ మంటే, ఆక్షేపణమో యని ఆ పట్టుమీదే యున్నారు.

ఈ అన్యాయముచేత నా జీవితము పాడై పోతుంది. రక్షించండని ఎంప్లాయిమెంటు అండు రీసెటిల్మెంటు పై అధికార్లకు, మెడ్రాసుగవర్నమెంటు. సెంట్రల్ గవర్నమెంటుకు, ప్రధాన మంత్రి పండిట్టు జవ్హారులాల్ నెహ్రూగారికిని, లెక్కలేనని, పిటీషను లిచ్చి మొరపెట్టుకుంటున్నాను. ఏడాదైనది. ఎవరూ మాటాడరు.

16–3–1949 ని కాకినాడ క్యాంపులో, ఫుడ్ మినిష్టరు టి. యస్. యస్. రాజన్‌గారిని, మద్రాసు రీజినల్ డైరెక్టరుగారిని దర్శించేను. మినిష్టరుగారు నన్ను చూడగానే మాట్లాడకుండా పొమ్మన్నారు. డైరెక్టరుగారు మాత్రము సంగతి విని దగ్గరవున్న జిల్లా కలక్టరుగారిని, ఎంప్లాయిమెంటు ఆఫీసరుగారిని చూపించి, వీరి నాశ్రయించు; పని యిచ్చినా, భూమి యిచ్చినా, వీరి దయ. నేనేమి చేయలేను. పొమ్మన్నారు. ఉంటేయేమి ప్రమాదమోయని, నా చేతిలోని పిటీషను బల్లమీద పెట్టి మెల్లగా బయటికి పోయేను. అయ్యో! నేడు పేదలబ్రతు కెంత అన్యాయమై పోయింది! ప్రభుత్వమే ప్రజలయం దింత అనాదరణ పక్షపాతము చూపిస్తుంటే, అన్నమో రామచంద్రా యని హడలుచున్న పేదవారిలో శాంతి యెట్లు కలుగుతుంది? ఇప్పుడైనా ప్రభుత్వము నావంటి పేదలను కనికరించి వెంటనే రక్షించడానికి తగు శ్రద్ధ తీసుకుంటుందని ప్రార్థిస్తున్నాను. ప్రాణము పోయేక ప్రయత్నములు ఎన్ని చేసిన యేమి లాభము?

రెడ్డి అప్పలస్వామి.

నూలు పంపిణీ

అయ్యా,

శ్రీశ్రీశ్రీ మద్రాసు గవర్నమెంటువారు నూలును పంపకము చేయు విషయములో గ్రామగ్రామ విచక్షణ లేకుండ అన్ని గ్రామములలోను మగ్గము నేయువార లందరికి నూలులు యిచ్చునట్లు ఏర్పచియుండిరి. అయితే ఆ విషయము ఈ అమాయక బీదలకు తెలియ దను భావమున నూలు డీలర్లు పనివారల నోరు కొట్టి బ్రతుకుచున్నట్లు నాకు తోచుచున్నది. ఇంకొక విషయము గవర్నమెటువారు. పెట్టె (*One Bundle*)కు 0-8-0కు తక్కువ లేకుండా లాభము వచ్చునట్లుగా యిచ్చుచుండిరి. డీలర్లకు ఆ లాభము చాలక బీదలకు యివ్వవలసిన నూలు మీద కూడా లాభము పొందవలెనని స్లాకున డీలర్లే నూలు అమ్ముకొన్నట్లు తెలియుచున్నది. డీలరుకు యిచ్చిన లాభము డీలరుది పనివాడి లాభము పనివాడిది గదా అయితే పనివాని లాభము డీలరులాభము డీలరే పొందుట యిప్పటి మన పరిస్థితులకు ఎంత శోచనీయమో యెల్లరకు తెలిసిన విషయమే. కొబట్టి యిందుమూలమున నూలు సప్లయి చేయు అధికారులకు మనవి చేయడ మేమనగా—మగ్గమున్న ప్రతి వానికి నూలు అందునట్లు చేసి దేశమును ఉద్ధరించ ప్రార్థయపడి మనవి చేయుచున్నాను.

చీ. శే. లాషి

జిల్లాబోర్డుల ఎన్నికలా? నామినేషనులా?

ఆర్యా,

మద్రాసు ప్రభుత్వంవారు యీ మధ్యన జిల్లాబోర్డులు, పంచాయతీబోర్డులు ఎలక్షనలు జరుపుతామని జులై మొదటి వారంలో జిల్లాబోర్డుల ఎన్నిక అధ్యక్షులు బోర్డులను స్వాధీనపరచుకుంటారని ప్రకటనలు జరిపినారు. ఇప్పటికే చాల సంవత్సరాల క్రితమే ఎన్నికలు జరిగినవి గనుకను అప్పటికీ ఇప్పటికీ దేశంలో అనేకమార్పులు వచ్చినందుననూ ప్రజాస్వామికసిద్ధాంతాన్ని అనుసరించికూడా ఎన్నికలు జరగటం ప్రశస్తమైనదే. ఇందుకు మద్రాసు ప్రభుత్వాన్ని, స్థానికస్వపరిపాలనా శాఖామంత్రి శ్రీ. గౌ॥ కల్లూరి చంద్రమౌళి గారిని అభినందించక తప్పదు. కాని ప్రస్తుత స్థితిలో ఎలక్షనలు జరుపుట ప్రజాశ్రేయస్సు దృష్ట్యా యెంత వరకుసాధ్యమా అనీ, ఇందువల్ల యెంత వుపయోగం వున్నదా అనీ సంశయం చాలా మందికి కలుగుచున్నది. ఎందువల్లనంటే—ఇదివరకు ఒక పర్యాయం జిల్లా బోర్డుల ఎన్నికలు జరుపుతామనటం, జిల్లా కాంగ్రెస్ సంఘాలు అభ్యర్థులను నియమించుటకు దరఖాస్తులతో నూరు, యేనబై, అరవై రూపాయలు ఫీజులు రకరకాలుగా తీసుకొనటం ఇందులో అనేకతగాదాలు (పార్టీలవల్ల) రావటం, ఇవి ఆల్ ఇండియా కాంగ్రెస్‌దాకా పోవటం, వీటిని పరిష్కరించటానికి శ్రీమతి కమలాదేవి ఛటోపాధ్యాయగారిని నియమించటం, ఆమెకు యీ తగాదాలు తలనొప్పి కలిగించి తమ అధికారమును వదులుకొనటం, తదుపరి ప్రభుత్వము వారే ఎన్నికలు ఆపినామని ప్రకటించటం అందరికీ తెలిసినదే. ఆ సందర్భంలో దరఖాస్తుతో చెల్లించిన ఫీజులను ఇస్తామని రాష్ట్రకాంగ్రెస్ ప్రధానకార్యదర్శిగారు కొన్ని ప్రకటనలు చెయ్యటం, కొందరికి ఇప్పటికి ఇవ్వకపోవటం జరిగినది. తిరిగి యీ ఎలక్షన్లో అభ్యర్థుల నియామకానికి జిల్లా కాంగ్రెస్ సంఘాలు రాష్ట్రకాంగ్రెస్‌ను అనుమతి కోరుతున్నవి. అంగీకారమును పొందిన వెంటనే తిరిగి దరఖాస్తులు ఫీజులతోసహా కోరుతారు. లోగడ ఫీజును వాపసు పొందినవారు మా దరఖాస్తులు అలాగే వున్నవంటారు. కాగా ప్రస్తుతస్థితిలో కాంగ్రెస్ సంఘాలకు మంత్రివర్గానికి అనుకూల దాంపత్యం లేదని నాయకులే ప్రకటనలు చేస్తున్నారు గదా, మొన్ననే అస్సెంబ్లీ కాంగ్రెస్ పార్టీ నాయకుని ఎన్నికలో శ్రీ ఆచార్య రంగాగారు ప్రత్యేకంగా ఢిల్లీనుంచి వచ్చి చేసిన కృషి, ఇచ్చిన స్టేటుమెంటులు చూస్తే మంత్రివర్గానికి రాష్ట్రకాంగ్రెస్‌కు అనుకూలదాంపత్యం కుదరలేదని తెలిసిన విషయమే గదా; యీ స్థితిలో జరుగనున్న ఎన్నికలు ప్రజాశాంతిని ప్రజాక్షేమాన్ని కాపాడగలవా? కాక ప్రస్తుత స్థితిలో ప్రజాస్వామిక సిద్ధాంతాన్ని అనుసరించి వయోజనుల ఓటుతో జరపటం లేదు గదా. 1951 సం॥ లో వయోజన ఓటుతో అన్ని ఎన్నికలు జరుగనున్నవి గదా, యీ మధ్యలో కొద్ది ఓటర్లుతో యీ ఎన్నికలు జరుపుట అసంపూర్తిగాను అసంతృప్తిగాను వుండును గదా. అందువల్లను ప్రస్తుతవర్తమానకాలపరిస్థితులను బట్టి దేశక్షేమదృష్ట్యా ప్రభుత్వమే జిల్లాబోర్డులసభ్యులను నామినేట్ చేయుట చాలా ఉత్తమోత్తమముగానే కనుపడుచున్నది. ఇందుకు పరిపాలనా సమర్థత కలిగి నిరంతరం ప్రజాసేవయే తమ జీవితపరమావధిగా నిర్ణయించుకొని నైతిక జీవితం గలవారిని రాజకీయకక్షులతో నిమిత్తం లేకుండా జాతిమతకులవర్గభేదాలను పాటించకుండా ప్రభుత్వము నియమించటం చాలా ఉత్తమంగా కనుపడుచున్నది. ఇందువల్ల ప్రజలలో యెక్కువగా ప్రభుత్వ విధానమును ప్రచారము చేయుటకు, ప్రజలలో శాంతిని కలిగించుటకు, తద్వారా 1951 సం॥ లో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్‌పక్షానికి అఖండవిజయాన్ని చేకూర్చటానికి, ప్రస్తుతం ప్రభుత్వ యంత్రం నిరాఘాటంగా సాగిపోవటానికి యెంతో అవకాశం కలుగుతుంది. కనుక యీ విషయాన్ని ప్రజాసేవకులు తమ అభిప్రాయాన్ని వెల్లడించాలని ప్రభుత్వం యీ విషయాన్ని పునర్విమర్శన చేయాలనీ కోరుచున్నాను.

కాండూరి సీతారామయ్య.

అవతరించే తెలుగుతల్లి

(6 పేజీ తరువాయి)

చిందుతూ శృంగారాన్ని తొణికించుతోంది. ఆ చేతి వ్రేళ్ల సోయగాలు. అందులో అమర్చబడ్డ అంగుళీకాల వెలుగులు......ఆ పరిసరాలనే కాంతుల్లో ముంచివేస్తున్నవి.

ఇహ ఆమెమెడలో మంగళసూత్రం తప్ప కనిపించే దేమీ లేదు. కరుడుగట్టి పట్టుకున్న చిలుముతో బాధపడుతున్న కాసులపేరుమాత్రం అస్పష్టంగా కనబడుతూ వుంది.

అట్టే చూస్తూ పాదాల వద్దకు చూపులు వెళ్లేలోగా నా గుండెలు పగిలిపోయాయి. అసలు పాదాలే కనిపించలేదు. బహుశా భూమిలో దిగజారిపోయిందేమోననే అనుమానంతో క్రిందికి తొంగి చూచాను.. ఖచ్చితంగా తెగనరుకబడ్డట్టు కనబడ్డెంవల్ల యిక లాభం లేదనుకున్నా.

ఆవిగ్రహం కదులుతుం దేమో ననుకున్నాను.. ప్రక్కకుచూచాను.. పట్టాభిగారె... ఆశ్చర్యముతో కళవళపడ్డారు. ఒళ్లంతా చెమట పట్టింది. ఈ చెమట ఆ శిల్పాన్ని చెక్కిన ఆయనకైనా కావచ్చు.. చూచిన నాకైనా కావచ్చు. యిందులో ఆశ్చర్యం లేదు...ఎంతప్రయత్నించినా ఇదే నన్నట్టు చూస్తున్నారు. కుంచె చేతిలోనే వుంది బట్టలు రంగుల మరకలతో నిండిపోయింది. రంగు లందిస్తున్న రంగాజీ గూడా అట్టే శిల్పంకేసి చూస్తుండడం నాకు మరీ ఆశ్చర్యంవేసింది...

ఆమూలనుండి టార్చిని ఫోకస్ చేస్తున్న దెవరో. ఆ వెలుగుల్ని ప్రసరిస్తున్న దెవరో తెలుసుకోవడానికి తంటాలుపడ్డాను...వెలుగు మన వెలుగే ప్రకాశంపంతులుగారు. .

నిరాశాహృదయంతో నీళ్లు నమలడంకంటే యింకేమీ తోచలేదు. ఇంతలోనే ఆపైనుండి కనిపించీ కనిపించని వెలుగునుండి ఏదో సినిమాలో కనబడే వెలుగులా క్రిందికి దిగివచ్చింది. ఆ వెలుగును పంపినవారు గూడా పరిచయులే...విగ్రహం కదిలింది. నడవడానికి ప్రయత్నించింది...అడుగు సాగలేదు... మెదలింది......నోరువిప్పింది......పలకడానికి తొలిగా చేసిన ప్రయత్నం విఫలమైంది. ఆ వెనుక మాటలు తాతయ్య బోసినోటికంటే అస్పష్టం. అసమగ్రం..

ప్రేక్షకుల్లో ఏదో కలకలం బయలుదేరింది. అది అలాగే విజృంభిస్తుం దనుకున్నాను. కానీ ఇంతలోనే పొడుగుపాటి వ్యక్తి సిల్కులాల్చీలో చేతు లిముడ్చుకుని వచ్చాడు. ఎఱ్ఱగా అందంగా వంగదేశపు పంచెకట్టుతో...వంగ సాహిత్యపు మెరుగుల ఉరవళ్లతో ఆయ నివ్వబోయే ఉపన్యాసం అత్యంతముఖ్యమైందని అందరూ ఆ వేపుకు చెవుల్ని నిక్కించారు...

ఆయనగారు ఆ శిల్పసౌందర్యాన్ని వర్ణించలేదు గానీ అది బాగానే వున్నదన్నారు... ఫరవాలేదన్నారు...

ఇంతలో ఇంకోవ్యక్తి ముందుకు తోసుకొచ్చి పాదాలులేకుంటే కాళ్లకే ఎక్కువకష్టం అంచేత పాదా లుండి తీరాలి అంటూ సెలవిచ్చారు...

ఇంతలో ఇంకోవ్యక్తి వాళ్లిద్దరికీ మధ్య వచ్చి కుడిచేయి విషయం మెల్లగా చూచుకోవచ్చునన్నారు.

ఆ వెనుకనుండి వచ్చిన వ్యక్తి శిఖ లేకుంటే మానె ప్రాణం వచ్చిందే పదివేలు. శిఖ పెరిగిందే పూలుగూడా వుంచుకుందా మన్నారు.

ఈ విచిత్ర మంతా చూచిన నా ఒళ్లంతా వేళ్లు, జెర్రులు ప్రాకి నట్లయింది...సంపూర్ణ అవయవాలతో.. నిండు ప్రాణం లేక పోయినా అవ్యక్తంగా, అస్పష్టంగా కనిపించే శిల్పం కొనూపిరితో వుండినా బావుండే దనిపించింది. ఈ అసమగ్ర శిల్పం ఒద్దందా మనుకున్నా... అబ్బే...ఈ మాట నసం సామాన్యమా. నోరు పెగల్లేదు... పెగిలినా ఆ మాటను ఆదరించేవా రుండవద్దూ?

ప్రేక్షకుల్లో గలభా ఎక్కువవుతున్న కొద్దీ యవనిక దిగజారిపోయింది...నాటకం యింతటితో సమాప్తి ఐం దనుకున్నాను..


ఓమారు తెరవేపు చూచాను. అదే నల్లటి ములికబట్ట దాచుకున్న మబ్బుతునకల్ని చేర్చుకుంటూవుంది. కానీ ఆమూల . చివర...సన్నటి అక్షరాలతో.. కనబడీ కనబడనట్టు "ఇంకా వుంది" అని వ్రాయబడింది. ఇంకా వుండేదేమో తెలుసుకోనే ఆతురత వున్నా ఎక్కువ ఉక్కపోయ పెంవల్ల హాలును ఒదిలెట్టాను. వెలుపల విద్యుల్లత వలయాలలో "అవతరించే తెలుగుతల్లి" అన్న పొడి అక్షరాలు కాంతి దీపాల జోడింపులతో మెరిసిపోతున్నాయి.

నాలు గడుగులు ముందుకు పెట్టానో లేదో ఎవరో అబ్బాయి పెద్ద నోటీసును అందిచ్చాడు. మరునాటికి గూడా ఇదే హాలులో ఉచితంగా ఇంకో కొత్తి నాటకాన్ని ప్రదర్శిస్తారేమో... ఈమారు నేను పొట్టి మనిషిని కొబట్టి నిక్కి చూచే అవసరం లేకుండా ముందు సీటునే ఆక్రమిద్దామని విప్పిచూచాను. కానీ నిరాశే యెదురయింది. నాటకం చూచాకనే దాని వివరాలను ప్రచురించి కరపత్రాలు పంచే అలవాటట ఆ కంపెనీది. అందులో గూడా నాటకం పేరు... "అవతరించే తెలుగుతల్లి" అని ప్రకటించబడింది. నటీమణు లెవరూ నాటకంలో కనబడకపోయినా కనీసం కరపత్రంలోనైనా కనబడుతారని ఆశపడ్డాను. వెదకి వెదకి చదివినా ఆరుమందిపేర్లు మాత్రం కనబడ్డాయి. ఇంగ్లీషుబాడీ వైపులో కనబడేవారు దాదాపు వందమంది వుంటారనుకొంటాను. వారిపేర్లు వ్రాయడం వ్రాసే నాకు, చదివే మీకు గూడా అట్టే ఉపయోగం వుండబోదని చాలుకున్నాను.


ఇక నా ఆలోచనకు మిగిలింది నేను చూచిన నాటకం ఎందుకు నవరసభావాలతో సమస్త ప్రజానీకాన్ని ఆకర్షించకపోయిందనిమాత్రమే. అందుకు నాకు ఒకే సమాధానం తోచింది. ఆ నాటకంలో కథానాయిక లేకపోవడమే యిందుకు ప్రధానకారణ మని తట్టింది...ఇంకా ఆ స్వప్నసీమలో నా మెదడులో ఏ ఆలోచన తట్టేదో కానీ మా అన్నయ్య వ్యాయామం చేయడానికి వుంచుకొన్న అలారం గడియారం ఒకటే మ్రోత పెట్టింది.

వికలాంగుల జీవనోపార్జన


బ్రిటన్‌లోని క్వీన్ ఎలిజబెత్ ట్రెయినింగ్ కాలేజీలో వికలాంగులైనవారు 12 మందిని పింగాణిపాత్రల అలంకరణకు నియమించారు. వీరికి చేతులు రెండూ స్వాధీనంలో లేకపోయినా చక్కగా పనిచేయగలరు.



వికలాంగులు తయారుచేసిన పాత్రలు పేర్చిఉన్నాయి.



పెద్ద పింగాణిపువ్వులో రేఖలు చేర్చుతున్నాడు.




పింగాణిపాత్రపై రంగులు దిద్దుతున్నాడు.

★

ఢిల్లీలో ఇటీవల జరిగిన రాష్ట్ర, సంస్థాన ఆహారశాఖా మంత్రుల సమావేశం: భారత ప్రభుత్వ ఆహారశాఖా మంత్రి జయరాందాస్ దౌలత్ రాం గారు ప్రసంగిస్తున్నారు.

★





భారత కోస్తాలో రవాణా రాకపోకలకు సేకరింపబడిన రెండు కొత్త నౌకలు, ఒక్కొక్కటి 1200 టన్నుల పరిమాణం గల ఈ రెండు నౌకలు, ప్రాచీనవైదిక మంత్రతంత్రాంగములతో బెల్‌ఫాస్టులో సముద్ర జలప్రవేశం చేయుచున్న దృశ్యం.
మొదట కానవచ్చే నౌకపేరు చంపావతి, దానివెనుక నౌకపేరు 'రోహిదాస్'



కీ. శే. మునునూరి సూర్యనారాయణ భాగవతార్ గారు

Regd. No. M. 4479

ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

ప్రథమ ద్వితీయ సంపుటములు

ప్రథమసంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ పుటలు గలవు. ఇందు 'అ' నుండి "అధ్వర్యు" వరకును గల విషయము గలదు. త్రివర్ణ పటములు ౮, ఇతర పటములు ౧౨౫, వివిధవిషయములు ౮౦౦ కలవు.

రెండవ సంపుటమునందు డిమ్మీ ౮-వ ఆకృతియందు ౬౦౦ లకు మించిన పుటలు కలవు. "అ" మొదలుకొని "అశ్విని" వరకు గల విషయము గలదు. త్రివర్ణపటములు ౧౦. వానిలో ౨ అమరావతీస్తూపమునకును, ౨ అనాహతమునకును చెందినవియు, ౬ దేశచిత్రపటములును గలవు. ఇవిగాక మరి ౫ సాదా దేశపటములు కలవు. ప్రాచీనాంధ్రుల కళాసంపదను వ్యక్తముచేయు అమరావతీస్తూపమును గురించిన గొప్ప వ్యాసమునందు అమరావతీ శిల్పమునకు సంబంధించిన హాఫ్‌టోన్ బొమ్మలు రమారమి ౧౦౦ ను, వేషభూషాదుల వెల్లడించు బొమ్మలు ౫౦ వఱకును గలవు. మరియు అభినయ మను వ్యాసమున భరతశాస్త్రమునందలి వేఱువేఱుహస్తములను సూచించు బొమ్మలు ౫౭ ను, 'అనాహతము' నందుపట్చక్రాదుల చిత్రములును గలవు. ఇట్లు ఆ యా వ్యాసములకు చెందిన చిత్రములు మొత్తముమీద ౨౫౦ కి పైగా నున్నవి. వివిధవిషయముల సంఖ్య ౮౦౦ వరకు నుండును. సంపుటము చక్కని స్వదేశీచర్మముతోడను బంగారురేఖలతోడను సంపుటీకృతము. ప్రతిసంపుటమున ౬౦౦ పుట లుండును.

ప్రతి సంపుటము వెల రూ. ౧౦.

పోస్టు ఖర్చులు: రూ. ౧-౮-౦.

రైలు ద్వారా దగ్గర చోట్లకు ఖర్చులు అ. ౧౨.

మేనేజరు,

ఆంధ్రవిజ్ఞానసర్వస్వ కార్యాలయము,

నెం. 7, తంబుశెట్టివీధి, మదరాసు.

గాంధీ మహాత్ముని

ఆత్మకథ



రెండుసంపుటములు

[చతుర్థముద్రణము]

శతావధాని

వేలూరి శివరామశాస్త్రిగారి

అనువాదము

ఖద్దరు బైండు

ప్రతిసంపుటము పోస్టేజితో సహా

వెల రూ. **5-9-0**

ఒకేసారి 2 సంపుటములు

పోస్టేజితో రూ. **10-12-0**

ఆంధ్రగ్రంథమాల,


పోస్టు బాక్సు నెం. 212, మదరాసు 1.

కళాప్రపూర్ణ

కీ॥ శే॥ కాశీనాథుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర



సరికొత్తపద్ధతిని, సంగ్రహరూపంలో నడిచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల వాఙ్మయచరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రలనన్నిటిని అవలోడనచేసి, సమన్వయించి క్రోడీకరించిన సిసలయిన చరిత్ర.

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండి ఉండి, నన్నయధర్మమా అని ఒక్కఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికి నవనవోజ్జ్వలంగా వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను పోడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమాల

పోస్టుబాక్సు **212,** మదరాసు **1.**

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.